www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆర్నెల్లకో ఇంజెక్షన్‌తో..
గుండెపోటుకు చెక్
చెడు కొలెస్ట్రాల్ తయారీని జన్యుస్థాయిలో
అడ్డుకునే అద్భుత ఔషధం.. ఇన్‌క్లిసిరాన్ 14
ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ వెల్లడి
హైదరాబాద్ అపోలోలో అందుబాటులోకి
ఒక్కో ఇంజెక్షన్ ఖరీదు దాదాపు రూ.లక్ష

శుక్రవారం | 26-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :22 సంచిక (Issue) : 118
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి రా. 11.31 తదుపరి సప్తమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 2.30 తదుపరి రేవతి; వర్జ్యం: రా.1.45-3.15; దుర్ముహూర్తం: ఉ.8.30-9.21, మ.12.47-1.38; అమృతఘడియలు: ఉ.10.03-11.32; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.46 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైతు.. రాజధాని!

రేవంత్‌రెడ్డి సర్కారు బడ్జెట్లో వీటికి పెద్దపీట

- వ్యవసాయ అభివృద్ధికి నాలుగో వంతు.. రూ.72,659 కోట్లు
- రుణ మాఫీకి రూ.26 వేల కోట్లు.. కూలీలకు ఏటా రూ.12 వేలు
- సన్నాలకు బోనస్, సబ్సిడీ విత్తనాలు సీమలుకు కేటాయింపులు
- రైతు భరోసాలో ఆంక్షలుంటాయని స్పష్టీకరణ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రూ.65,119 కోట్లు
- మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇంటి పథకాలకు నిధులు
- యువ వికాసం, పింఛన్ల పెంపు ఈ ఏడాదికి లేనట్లేనా!?
- బీఆర్‌ఎస్ పథకాలు గొర్రెల పంపిణీ, దళిత బంధుకు రాంరాం
- కేంద్ర గ్రాంట్లు, పన్నేతర రాబడి కింద ఎప్పట్లాగే కేటాయింపులు
- లోటు భర్తీకి మద్యం, రిజిస్ట్రేషన్ పన్నుల్లో పెంచిన అంచనాలు
- రేవంత్ సర్కారు తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి
- ఆరు గ్యారెంటీల్లో కొన్నింటికి లేని బడ్జెట్ కేటాయింపులు 9

రైతు.. రాజధాని! సంక్షేమం కూడా! తొలి బడ్జెట్‌లో రేవంత్ రెడ్డి సర్కారు ప్రాధాన్యాలివే! బడ్జెట్లో ఏకంగా నాలుగో వంతు నిధులను వ్యవసాయ రంగానికి కేటాయించి తమ తొలి ప్రాధాన్యం అన్నదాతకేనని స్పష్టం చేసింది! దాని కంటే కాస్త తక్కువ నిధులను కేటాయించి మలి ప్రాధాన్యం సంక్షేమ రంగమేనని చాటి చెప్పింది! ఇక, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో ఎదురు దెబ్బ తగిలిన విషయం తెలిసిందే! అందుకే, మూడో ప్రాధాన్యంగా నగరాభివృద్ధిని ఎంచుకుంది! జీహెచ్‌ఎంసీ సహా అన్నిటికీ కేటాయింపులను భారీగా పెంచింది! వెరసి, బడ్జెట్లో ఇటు పల్లెకు, అటు పట్టణానికి పెద్దపీట వేసింది! ఈ మూడు అంశాలకే దాదాపు 50 శాతం నిధులను కేటాయించింది!

హైదరాబాద్ అభివృద్ధికి 10 వేల కోట్లు


బడ్జెట్ ప్రతులను సీఎం రేవంత్‌కు అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు



సాగుకు సలాం

- బడ్జెట్‌లో నిధుల కేటాయింపే నిదర్శనం
- ఈ ఏడాది ఫసల్ బీమా యోజనలోకి రాష్ట్రం
- పంటలు సాగు చేసే అర్హులకే రైతు భరోసా
- ఈ ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- త్వరలోనే ఉద్యోగ నియామక క్యాలెండర్
- బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ముందునుంచీ చెబుతున్నట్లుగానే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను మొత్తం రూ.2,91,159 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అత్యధికంగా రూ.72,569 కోట్లను వ్యవసాయ రంగానికే కేటాయిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి తాము ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామనేదానికి ఈ కేటాయింపులే

మిగతా 10వ పేజీలో...

ఆశలన్నీ ఆ మూడింటిపైనే!

- భారీ పథకాలకు నిధుల కోసం ఎక్సైజ్, 9
- రిజిస్ట్రేషన్, రవాణా శాఖలపై సర్కారు దృష్టి
- వాటి ఆదాయ లక్ష్యం రూ.52,322 కోట్లు

కిస్తీలు వడ్డీలకే 48,331 కోట్లు
మొత్తం బడ్జెట్‌లో ఇది 17 శాతం
నెలవారీ భారం 4,027 కోట్లు

ఒడిదుడుకులున్నా.. మున్ముందుకే..
బడ్జెట్‌తో పాటుగా సామాజిక, ఆర్థిక సర్వే సమర్పణ 11

2024-25 రాష్ట్ర బడ్జెట్
₹ 2,91,159 కోట్లు

(రూ. కోట్లలో)

రెవెన్యూ వసూళ్లు	2,21,242
రెవెన్యూ వ్యయం	2,20,945
రెవెన్యూ మిగులు	297
ద్రవ్య లోటు	49,255


అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కేసీఆర్

బడ్జెట్‌పై చీల్చి చెండాడతాం

- అంతా ట్రాష్.. గ్యాస్.. ఓ పాలసీ అంటూ లేదు
- ప్రస్తావన కూడా లేని గొర్రెల పథకం.. దళిత బంధు
- ఇది రైతు శత్రు ప్రభుత్వం.. పొగుడుతూనే వెన్నుపోటు
- రైతు బంధు, భరోసాలో ఆంక్షలతో మోసం చేశారు
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ విమర్శలు 12
- పదేళ్లలో తొలిసారి మీడియా పాయింట్‌కు మాజీ సీఎం

అభూత కల్పన.. గారడీలు

- పంట పెట్టుబడుల సాయానికి కేటాయింపులేవీ?
- మైనార్టీల సంతుష్టీకరణే కాంగ్రెస్ ఏకైక లక్ష్యం
- వారికి ఏకంగా 30% నిధుల పెంపు: కిషన్‌రెడ్డి
- **అది ఆర్థిక బడ్జెటా.. అప్పుల పత్రమా?**
- కాంగ్రెస్+రాష్ట్ర బడ్జెట్ = గాడిద గుడ్డేనా?
- హామీలపై చేతులెత్తేశారు: బండి సంజయ్

ములుగు, కొత్తగూడెం జిల్లాల సరిహద్దుల్లో ఎన్‌కౌంటర్

- ఒక మావోయిస్టు మృతి
- భూపాలపల్లి జిల్లా వాసి అశోక్‌గా గుర్తింపు
- తండ్రి సంవత్సరీకం రోజునే ఘటన 3

ఇకపై పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

- ఆధార్ ధ్రువీకరణ, అభ్యర్థుల ఫేషియల్ రికగ్నిషన్
- క్యూఆర్ కోడ్, సీసీటీవీ నిఘా
- ఖేడ్కర్ ఉదంతం నేపథ్యంలో అప్రమత్తమైన కమిషన్ 14



ఈ ఏడాదీ జనగణన లేనట్టే!

కేంద్ర బడ్జెట్‌లో పరిమితంగానే కేటాయింపులు

ఆటల సమరం విశ్వమంత సంబరం

- నేటి నుంచే ఒలింపిక్స్.. బరిలో 206 దేశాలకు చెందిన 10,500 మంది
- భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు.. తెలుగు వారు 8 మంది

ఎక్కడాలేని ఉత్కంఠ.. రెప్పపాటులో మారే ఫలితాలు.. పతకవీరుల సింహనాదాలు.. ఉవ్వెత్తున ఎగసే భావోద్వేగాలు.. అంతులేని నిర్వేదాలు.. వెరసి అభిమానుల్లో జోష్ నింపే విశ్వ క్రీడా సంరంభం ఒలింపిక్స్ వచ్చేసింది. ప్రపంచాన్ని కదిలించే ఆటల పండగ నేడు మొదలు కానుంది. పారిస్‌లో 17 రోజుల పాటు క్రీడా కోలాహలం నెలకొననుంది. ఈ మెగా ఈవెంట్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఫ్రాన్స్ సిద్ధమైంది. 32 క్రీడాంశాల్లో 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు పాల్గొననున్నారు. భారత్ నుంచి 117 మంది పోటీ పడుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి.. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, డబుల్స్ స్టార్ సాత్విక్ సాయిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్, యువ షూటర్ ఇషా సింగ్, ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర, టేబుల్ టెన్నిస్‌లో ఆకుల శ్రీజ, అథ్లెట్లు జ్యోతి యర్రాజి, దండి జ్యోతికశ్రీ బరిలో ఉన్నారు. 2


పారిస్‌లో ఒలింపిక్ జ్యోతితో అభినవ్ బింద్రా


తుంగభద్ర గేట్లు ఎత్తి వరదను దిగువకు వదులుతున్న దృశ్యం

ప్రాజెక్టులకు జల కళ

- తుంగభద్రలోకి లక్ష క్యూసెక్కులు.. 28 గేట్లు ఎత్తివేత
- ఆల్మట్టి, జూరాలకు 2 లక్షల క్యూసెక్కులు మించి..
- శ్రీశైలం 2.57 లక్షలు, సాగర్‌కు 29125 క్యూసెక్కులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తుంగ, భద్ర నదులపై ఉన్న కర్ణాటక-ఏపీ-తెలంగాణల ఉమ్మడి జలాశయం తుంగభద్ర ప్రాజెక్టుకు గురువారం వరద మళ్లీ పెరిగింది. తుంగ, వార్దా నదుల నుంచి ప్రవాహంతో.. లక్ష నుంచి లక్షన్నర క్యూసెక్కులు విడుదల కావచ్చని తుంగభద్ర బోర్డు తెలిపింది. తుంగభద్ర డ్యాం గరిష్ఠ నీటిమట్టం 1,633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. గురువారం ఉదయం 8 గంటలకు

మిగతా 3వ పేజీలో...

ఖనిజ సంపదపై రాష్ట్రాలు పన్ను విధించవచ్చు!



- కేంద్రానికి ఆ అధికారం లేదు
- కాకపోతే పరిమితులను పేర్కొనవచ్చు
- రాష్ట్రాలకు చెల్లించే రాయల్టీ పన్ను కాదు
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- రాష్ట్రాల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం
- పాత బకాయిలపై 31న స్పష్టతనిస్తామన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, జూలై 25: గనులపై, ఖనిజాలతో కూడిన భూములపై పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించే రాయల్టీ.. పన్ను కాదని తెలిపింది. దేశంలో గనులు, ఖనిజాలపై కొనసాగుతున్న కేంద్రం గుత్తాధిపత్యాన్ని పక్కనపెట్టేలా సుప్రీంకోర్టు గురువారం సంచలన తీర్పును వెలువరించింది. ఈ తీర్పు రాష్ట్రాలకు.. ముఖ్యంగా ఖనిజ సంపద అధికంగా ఉన్న ఝార్ఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాలకు గొప్ప ఊరట కలిగించనుంది. వాటి ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్

మిగతా 14వ పేజీలో...

పారిస్ ఒలింపిక్స్ నేటినుంచే

ఆటే ధ్యాస పతకమే శ్వాస



మళ్లీ నీరజ్‌పైనే ఆశలు

ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్ ఎన్ని పతకాలు సాధిస్తుంది అంటే.. కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. జావెలిన్ త్రోలో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగుతున్న నీరజ్ చోప్రా మరోసారి గోల్డ్ కొల్లగొడతాడనే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక, బ్యాడ్మింటన్‌లో సాత్విక్ సాయిరాజ్ జంట, షూటింగ్‌లో సిఫ్ట్ కౌర్ సమ్రా పతకాలు సాధిస్తారని భావిస్తున్నారు. బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, రెజ్లింగ్‌లో అంతిమ్ పంగల్, వినేష్ ఫొగట్‌కు కూడా మెడల్స్ సాధించే సత్తా ఉంది. టెన్నిస్ డబుల్స్‌లో రోహన్ బోపన్న-శ్రీరామ్ బాలాజీ జోడీపై భారీగా ఆశలు పెట్టుకొన్నారు. గత క్రీడల్లో కాంస్యం సాధించిన భారత హాకీ జట్టు మరింత మెరుగైన ప్రదర్శన చేసే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే టోక్యో క్రీడల్లో సాధించిన ఏడు పతకాల కంటే.. ఈసారి ఎక్కువగా సాధిస్తారని అనుకొంటున్నారు.

206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు

రాత్రి 11 నుంచి జియో సినిమా, స్పోర్ట్స్ 18లో

- భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు
- వినూత్నంగా ప్రారంభ వేడుకలు

తమ దేశ జాతీయపతాకం సగర్వంగా ఎగరాలని ప్రతి ఒక్కరూ కోరుకునే అరుదైన సందర్భం.. గొప్పగొప్ప ఆటగాళ్లంతా తమ నైపుణ్యాలకు పదునుపెట్టే అసలైన సమరం.. జీవితంలో ఒక్కసారైనా పోటీపడాలని ప్రతి క్రీడాకారుడు కలలు కనే విశ్వక్రీడా సంరంభం.. యావత్ క్రీడాలోకాన్ని ఒక్కటి చేస్తూ, విశ్వవ్యాప్త అభిమానులను ఆనందసాగరంలో ముంచెత్తుతూ, ప్రపంచ మేటి అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలుస్తూ, అద్భుత విన్యాసాలు, ప్రదర్శనలకు అరుదైన వేదిక.. నాలుగేళ్లకోసారి జరిగే ఆటల సంబరం.. ఒలింపిక్స్.. వచ్చేసింది.. ఫ్రాన్స్ రాజధాని, ఫ్యాషన్ సిటీ పారిస్ ఆతిథ్యమిస్తున్న ఈ ఒలింపిక్స్ మొదలయ్యేది నేడే.

విశ్వక్రీడల చరిత్రలోనే తొలిసారిగా స్టేడియం లోపల కాకుండా బయట.. అదీ.. పారిస్‌లోని ప్రఖ్యాత సెన్ నదీ తీరంలో వినూత్నరీతిలో ప్రారంభ వేడుకలను నిర్వహిస్తున్నారు. 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు 32 క్రీడాంశాల్లో సత్తా చాటేందుకు సమాయత్తమయ్యారు.

భారత్ నుంచి 117 మంది క్రీడాకారులు పోటీలో ఉన్నారు. గత టోక్యో క్రీడల్లో స్వర్ణ పతకంతో యావత్ భారతావనిని మెప్పించిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, హ్యాట్రిక్ పతక వేటలోనున్న తెలుగు షట్లర్ పీవీ సింధు, వరుసగా రెండోసారి పతకం అందుకోవాలని పట్టుదలగా ఉన్న బాక్సర్ లవ్లీనా, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, జంబో బృందంగా బరిలో ఉన్న షూటర్లు, పతకాన్ని పట్టేయాలనుకుంటున్న రెజ్లర్లు.. ఇలా అందరిపైనా అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి.. ఈ పదిహేడురోజుల పాటు జరిగే విశ్వక్రీడా పండగలో పతక విందు ఎవరిదో?

పారిస్: ఉత్కంఠ.. ఉద్వేగంతో యావత్ ప్రపంచాన్ని గుప్పిట బంధించే విశ్వక్రీడా పండుగ ఒలింపిక్స్‌కు వేళైంది. ఫ్యాషన్ పుట్టిల్లు పారిస్.. విశ్వక్రీడలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. కరోనా ముప్పు వీడిన తర్వాత నిర్వహిస్తున్న మెగా ఈవెంట్ కావడంతో.. చిరకాలం గుర్తుండి పోయే విధంగా గ్రాండ్‌గా ఆరంభ వేడుకలను నదిలో నిర్వహించాలని ఫ్రెంచ్ ప్రభుత్వం నిర్ణయించింది. గతానుభవాలను దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక వేదికల్లో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయడంతో.. నగరం మొత్తం సందడి వాతావరణం నెలకొంది. అయితే, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో జరుపుతున్న మెగా ఈవెంట్ కూడా ఇదేనని భావించాలి. బలమైన శక్తుల మధ్య యుద్ధ వాతావరణం, తీవ్రవాదుల హెచ్చరికల నేపథ్యంలో భారీ భద్రత మధ్య ఈవెంట్లు జరగనున్నాయి. సుమారు 45 వేల మంది రక్షణ బలగాలను వినియోగించనున్నారు. ఒలింపిక్స్‌కు ఫ్రాన్స్ ఆతిథ్యమివ్వడం ఇది మూడోసారి. తొలిసారిగా 1900 సంవత్సరంలో విశ్వక్రీడలను నిర్వహించిన ఈ దేశంలో రెండోసారిగా 1924లో జరిగాయి. అమెరికా (నాలుగుసార్లు), బ్రిటన్ (మూడుసార్లు) తర్వాత అత్యధిక సార్లు ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తున్న దేశంగా ఫ్రాన్స్ రికార్డులకెక్కనుంది. ఓవరాల్‌గా 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు ఈ క్రీడల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఈ క్రీడలు ఎందుకు ప్రత్యేకమంటే..

ఏ ఆతిథ్య దేశమైనా ఒలింపిక్స్ నిర్వహణలో తమదైన ప్రత్యేకత చాటుకుంటుంది. అలాగే పారిస్ నిర్వాహకులు కూడా పర్యావరణానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ, వృథాకు చోటులేకుండా ఈసారి విశ్వక్రీడలను భావితరాలకు మార్గదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇలా పలు అంశాల్లో పారిస్ ఒలింపిక్స్ ప్రత్యేకత సంతరించుకోనున్నాయి. అవేంటంటే..

వృథాకు లేదు అవకాశం

విశ్వక్రీడల నిర్వహణ ఏ దేశానికైనా ప్రతిష్ఠాత్మకం. గర్వకారణం. అదే సమయంలో ఆర్థికంగా కూడా భారమే. రూ. వందల కోట్లు వెచ్చించి నిర్మించిన స్టేడియాలు, గేమ్స్ విలేజ్..క్రీడలు ముగిశాక ఎక్కువ శాతం నిరుపయోగమవుతాయి. కానీ పారిస్ క్రీడల నిర్వాహకులు అందుకు ఆస్కారం లేకుండా..ఈసారి ఒలింపిక్స్ కోసం ఏర్పాటు చేసిన ప్రతి నిర్మాణంలోని వస్తువులను పునర్ వినియోగించేలా చర్యలు చేపట్టారు. భవనాలను లీజుకు ఇవ్వడం, ఇతర నిర్మాణ సామాగ్రి అమ్మకం, రీసైక్లింగ్ చేయడం ద్వారా వృథాకు తావులేకుండా చూస్తున్నారు.

పర్యావరణ హితం

ఈసారి పోటీల సందర్భంగా 20 లక్షల క్రీడా పరికరాలను వినియోగిస్తున్నారు. వీటిలో 15 లక్షల పరికరాలను ఆయా క్రీడా సంఘాలు అద్దెకు తీసుకోవడం గమనార్హం. క్రీడల్లో ఉపయోగించే కంప్యూటర్లు, ప్రింటర్లను సైతం రెంటుకు తీసుకొచ్చారు. అలాగే ఫర్నిచర్‌కు సంబంధించిన వస్తువులను కూడా ముందు అనుకున్నట్టు ఎనిమిది లక్షలకు కాకుండా ఆరు లక్షలకే పరిమితం చేశారు. ఎలక్ట్రిక్, హైబ్రిడ్, హైడ్రోజన్ గ్యాస్‌తో నడిచే వాహనాలనే ఉపయోగిస్తున్నారు. అంతేకాదు. గత కొన్ని ఒలింపిక్స్‌లో కంటే 40 శాతం తక్కువగా వాహనాలను వినియోగిస్తున్నారు. బయో ఫ్యూయల్, హైడ్రోజన్, బ్యాటరీలతో నడిచే జనరేటర్లనే వాడుతున్నారు. మొత్తంగా..ఈసారి ఒలింపిక్స్ అత్యంత పర్యావరణ హితంగా నిర్వహిస్తున్నారు.

పొదుపు మంత్రం

ఇప్పటికే ఉన్న, తాత్కాలికంగా నిర్మించిన వేదికల్లోనే 329 క్రీడాంశాలను నిర్వహిస్తున్నారు. మొత్తం 35 క్రీడా వేదికల్లో రెండింటినే కొత్తగా నిర్మించారు. ఈ రెండింటిలో ఒకటి..అక్వాటిక్ స్టేడియాన్ని కర్బన్ ఉద్గారాలకు తావులేకుండా చెక్కతో నిర్మించారు. ఈ స్టేడియాన్ని నగరంలో క్రీడా సదుపాయం అందుబాటులోలేని ప్రాంతంలో ఏర్పాటు చేశారు. స్టేడియంలో సీట్లలో రీసైక్లింగ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించారు. అలాగే రెండోది పోర్ట్ డి లా చాపెల్ స్టేడియం.

లింగ సమానత్వం

పారిస్ గేమ్స్‌లో మొత్తం 10,500 మంది అథ్లెట్లు తలపడుతుండగా వీరిలో సగం మంది మహిళలు కావడం విశేషం. టోక్యో క్రీడల్లో మహిళా అథ్లెట్ల శాతం 47.8 కావడం గమనార్హం. 1972 మ్యూనిచ్ క్రీడల వరకు ఒలింపిక్స్‌లో అతివల ప్రాతినిధ్యం 20 శాతం కంటే తక్కువగానే ఉండేది. సాధారణంగా పురుషుల మారథాన్‌తో ఒలింపిక్స్‌కు తెరపడుతుంది. అయితే ఈసారి మహిళల మారథాన్‌తో ముగియనుండడం మరో విశేషం.

యూత్ కోసం..

28 రెగ్యులర్ క్రీడా విభాగాలతోపాటు ఈ ఒలింపిక్స్‌లో స్కేట్ బోర్డ్, క్లైంబింగ్, సర్ఫింగ్, బ్రేకింగ్/బ్రేక్‌డ్యాన్స్ చేర్చారు. యువతను ఆకర్షించాలన్న ఆలోచనతోనే ఈ క్రీడలకు చోటు కల్పించారు. టోక్యో క్రీడల్లో కరాటేను చేర్చినా.. ఎక్కువ వయసున్న క్రీడాకారులు భారీగా పాల్గొనడంతో యూత్‌ను పెద్దగా ఆకట్టుకోలేక పోయింది. గత క్రీడల్లో ఎంట్రీ దక్కించుకొన్న సర్ఫింగ్, క్లైంబింగ్ క్రీడలకు పారిస్‌లోనూ అవకాశం కల్పించారు. క్లైంబింగ్ క్రీడను సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. తొలిసారి చోటు కల్పించిన బ్రేక్ డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణ కానుంది.

రష్యా నుంచి 15 మందే..

డోపింగ్ స్కామ్‌తోపాటు ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా నిషేధాన్ని ఎదుర్కొంటున్న రష్యా నుంచి 15 మంది మాత్రమే ఒలింపిక్స్‌లో పాల్గొంటున్నారు. పైగా తటస్థ అథ్లెట్లుగా వీరు బరిలోకి దిగనున్నారు. మూడేళ్ల క్రితం టోక్యోలో జరిగిన క్రీడల్లో రష్యా ఒలింపిక్ కమిటీ కింద 30 క్రీడా విభాగాల్లో 335 మంది రష్యా అథ్లెట్లు బరిలోకి దిగారు. అయితే, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. రష్యన్లు స్వర్ణం సాధిస్తే.. పతక బహూకరణ సమయంలో ఆ దేశ జాతీయ గీతాన్ని వినిపించరు. 17 మంది బెలారస్ అథ్లెట్లకు కూడా ఇదే నిబంధనలు వర్తించనున్నాయి.

ఆరుబయట ఆటాపాట.. నీటిపై మార్చ్‌పాస్ట్



సంప్రదాయాన్ని బ్రేక్ చేస్తూ.. ఆరంభోత్సవాన్ని ప్రధాన స్టేడియం బయట నిర్వహించనున్నారు. సెన్ నదిలో సుమారు ఏడు వేల మంది అథ్లెట్లలో బోట్లలో పరేడ్ నిర్వహించడానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. 6 కిలోమీటర్ల పరేడ్ తర్వాత ఐఫిల్ టవర్ వద్ద ఇది ముగియనుంది. ఇందుకోసం 85 బోట్లను వినియోగించనున్నారు. దాదాపు 5 లక్షల మంది ఈ ఆరంభ వేడుకల వీక్షణకు రానున్నట్టు అంచనా. ప్రముఖ సింగర్లు సెలీనా డియాన్, లేడీ గాగా తమ ఆటపాటలతో ఉర్రూతలూగించనున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్ ఓపెనింగ్ సెర్మనీపై కరోనా ప్రభావం తీవ్రంగా కనిపించింది. ఎక్కువ మంది వీక్షకులను కూడా అనుమతించలేదు. పారిస్‌లో మాత్రం అలాంటి ఇబ్బందులు లేకపోవడంతో.. మెగా ఈవెంట్‌కు అదిరే ఆరంభం దక్కాలని నిర్వాహకులు ప్రణాళికలు రచిస్తున్నారు. నీటిపై తేలియాడుతూ సాగే మార్చ్‌పాస్ట్‌లో భారత పతాకధారులుగా పీవీ సింధు, శరత్ కమల్ వ్యవహరించనున్నారు.

శరణార్థులుగా..


సిండీ ఎంగామ్‌బా

ఐవోసీ శరణార్థుల జట్టు పతాకధారులుగా బాక్సర్ సిండీ ఎంగామ్‌బా, తైక్వాండో అథ్లెట్ యహ్యా అల్ గోటనీ వ్యవహరించనున్నారు. కామెరూన్‌లో జన్మించిన సిండీ యూకేకు వలస వెళ్లగా.. సిరియా అంతర్యుద్ధం కారణంగా యహ్యా తన కుటుంబంతో కలసి జోర్డాన్ పారిపోయాడు. రెఫ్యూజీ టీమ్‌లో ఉన్న 37 మంది అథ్లెట్లు 12 క్రీడా విభాగాల్లో బరిలోకి దిగనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 10 కోట్లకుపైగా ఉన్న శరణార్థులకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని ఐవోసీ పేర్కొంది. 2016 రియో ఒలింపిక్స్ నుంచి శరణార్థుల జట్టు మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగుతోంది.

1 — భారత బృందం నుంచి స్వర్ణ పతక విజేతగా మళ్లీ బరిలోకి దిగుతున్న ఏకైక అథ్లెట్ నీరజ్ చోప్రా. ఈసారి ఒలింపిక్స్‌కు భారత రెజ్లింగ్ జట్టులో పురుషుడు ఒక్కడే ఉన్నాడు. అతనే అమన్ సెహ్రావత్.

2 — ఈ క్రీడల్లో ఒకటి కంటే ఎక్కువ ఈవెంట్లలో పోటీపడుతున్న భారత ప్లేయర్లు. అథ్లెట్ పారుల్ చౌదరి 5వేల మీటర్ల రేసుతో పాటు 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్‌కు అర్హత సాధించగా.. షూటర్ మనూ భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్లకు ఎంపికైంది.

5 — టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ తరపున పతకాలు సాధించిన ఐదుగురు (నీరజ్ చోప్రా, పీవీ సింధు, మీరాబాయి, లవ్లీనా, హాకీ జట్టు) పారిస్ క్రీడల బరిలోనూ ఉన్నారు.

14 — పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత జట్టులోని ధినిధి దేషింగు వయసు ఇది. పిన్న వయసులో విశ్వక్రీడల బరిలోకి దిగుతున్న రెండో భారత ప్లేయర్‌గా రికార్డు. గతంలో స్విమ్మర్ ఆర్తి సాహా 11 ఏళ్ల వయసప్పుడు 1952 ఒలింపిక్స్‌లో తలపడింది.

35 — పోటీలు జరిగే వేదికలు

329 — పోటీలు జరిగే పతక విభాగాలు

45 వేలు — ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న వాలంటీర్లు

6 లక్షలు — క్రీడాగ్రామంలో ప్రతిరోజు అథ్లెట్లకు వడ్డించే భోజనాల సంఖ్య

43 — పారిస్‌లో పోటీపడుతున్న టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న వయసు ఇది. భారత బృందంలో అత్యధిక వయసు ఆటగాడు ఇతనే. టీటీ ప్లేయర్ శరత్ కమల్ (42 ఏళ్లు) రెండోస్థానంలో ఉన్నాడు.

35 — ఇప్పటిదాకా ఒలింపిక్స్‌లో భారత్ సాధించిన పతకాలు. ఇందులో పది స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, పదహారు కాంస్యాలున్నాయి.

72 — పారిస్ క్రీడలతో తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత అథ్లెట్లు. వీరిలో బాక్సర్ నిఖత్, అథ్లెట్లు జ్యోతి యర్రాజి, జ్యోతికశ్రీ, శ్రీజ, షూటర్ ఇషా సింగ్‌లాంటి తెలుగు ప్లేయర్లున్నారు.

117 — భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో పోటీపడుతున్న మొత్తం అథ్లెట్లు. ఈ బృందంలో అత్యధికంగా 29 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెటిక్స్ నుంచి, 21 మంది షూటింగ్ విభాగం బరిలో ఉన్నారు.

రూ. 40 వేల కోట్లు — పారిస్ క్రీడల నిర్వహణ కోసం ఫ్రాన్స్ వెచ్చిస్తున్న ఖర్చు

45 వేలు — ఒలింపిక్స్ కోసం ఏర్పాటుచేసిన భద్రతా సిబ్బంది

ఇటు 11.. అటు 61


జెంగ్ హావోహావో


జిల్ ఇర్వింగ్

వయసు సంఖ్య మాత్రమే. అది ప్రతిభకు ఏమాత్రం కొలమానం కాదు. కొంతమంది చిరుప్రాయంలోనే సత్తా చాటితే.. మరికొందరు లేటు వయసులో అద్భుతాలు సృష్టిస్తారు. అలా.. పారిస్ ఒలింపిక్స్‌లోనూ తమదైన రీతిలో ముద్ర వేసేందుకు పిన్న, పెద్ద వయసు అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. వీరిలో 11 నుంచి 60 ఏళ్ల పైబడిన వయసు క్రీడాకారులు ఉన్నారు. ఈసారి చైనాకు చెందిన 11 ఏళ్ల చిన్నారి జెంగ్ హావోహావో మహిళల స్కేట్‌బోర్డింగ్ ఈవెంట్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఈ క్రీడల్లో పోటీపడుతున్న అతి పిన్నవయసు అథ్లెట్‌గా జెంగ్ రికార్డుకెక్కనుండగా.. ఈమె తర్వాతి స్థానంలో కెనడాకు చెందిన స్కేట్‌బోర్డింగ్ అథ్లెట్, 14 ఏళ్ల ఫే డి ఫాజియోతో పాటు భారత స్విమ్మర్ ధినిధి దేషింగు (14 ఏళ్ల 2 నెలలు) ఉన్నారు. కెనడాకే చెందిన ఈక్వెస్ట్రియన్ జట్టు సభ్యురాలైన జిల్ ఇర్వింగ్ 61 ఏళ్ల వయసులో ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేస్తోంది. పారిస్ క్రీడల బరిలో ఉన్న అతిపెద్ద వయసు అథ్లెట్ రికార్డు ఈమెదే. ఒక ఒలింపిక్స్ చరిత్రలోనే అతిపెద్ద వయసులో పోటీపడ్డ అథ్లెట్‌గా స్వీడన్ షూటర్ ఆస్కార్ స్వాహ్ ఘనత సాధించాడు. ఇతను 72 ఏళ్ల వయసులో 1920 ఆంట్వెర్ప్ ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడు.


ధినిధి దేషింగు

మెరిసిన ధీరజ్, అంకిత

- క్వార్టర్స్‌లో రికర్వ్ ఆర్చరీ జట్లు

పారిస్: తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర, అంకిత భకత్ గురి కుదరడంతో.. ఒలింపిక్స్‌ను భారత్ ఆశావహంగా ఆరంభించింది. ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందే.. గురువారం జరిగిన ర్యాంకింగ్ రౌండ్లలో అదరగొట్టిన భారత పురుషులు, మహిళల జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ రమేష్ జాదవ్‌లతో కూడిన పురుషుల జట్టు మొత్తం 2013 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. క్వార్టర్స్‌లో టర్కీ లేదా కొలంబియాతో తలపడే అవకాశం ఉంది. కొరియా (2049), ఫ్రాన్స్ (2025)లు తొలి రెండుస్థానాలు దక్కించుకొన్నాయి. వ్యక్తిగత ర్యాంకింగ్స్‌లో ధీరజ్ 681 పాయింట్లతో నాలుగోస్థానంలో, తరుణ్‌దీప్ 674 పాయింట్లతో 14వ స్థానంలో, ప్రవీణ్ 658 పాయింట్లతో 39వ స్థానంలో నిలిచారు. కాగా, అంకిత భకత్, దీపిక కుమారి, భజన్ కౌర్‌లతో కూడిన మహిళల జట్టు 1983 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి రౌండ్-8 చేరుకొంది. క్వార్టర్స్‌లో నెదర్లాండ్స్ లేదా ఫ్రాన్స్‌తో భారత్ తలపడనుంది. కాగా, వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్‌లో అంకిత 11, కౌర్ 22, దీపిక 23వ స్థానాల్లో నిలిచి నాకౌట్‌కు అర్హత సాధించారు. మిక్స్‌డ్ కేటగిరీలో ధీరజ్-అంకిత జోడీ 5వస్థానంలో నిలిచింది.

క్రీడలకు భారీ బడ్జెట్

- రూ.389.87 కోట్ల కేటాయింపు
- నగదు ప్రోత్సాహకాలకు 100 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారుడైన సీఎం రేవంత్ రెడ్డి స్పోర్ట్స్‌పై తనకున్న ప్రేమ, శ్రద్ధను బడ్జెట్‌లో ప్రస్ఫుటం చేశారు. గురువారం ప్రవేశపెట్టిన 2024-25 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో క్రీడా రంగానికి రూ. 389.87 కోట్లు కేటాయించారు. వీటిలో రూ.325.05 కోట్లు స్టేడియాల ఆధునికీకరణ, నిర్వహణ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు, రాష్ట్ర క్రీడా సంఘాల గ్రాంట్స్‌కు వెచ్చించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో క్రీడాకారులు పాల్గొనేందుకు, పతకాలు సాధించిన అథ్లెట్లకు నగదు ప్రోత్సాహకాలు అందించేందుకు, ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు రూ.100 కోట్లు కేటాయించారు. ఇక, గతేడాది బడ్జెట్‌లో క్రీడలకు తొలుత 126.06 కోట్లు కేటాయించగా, ఆ తర్వాత తెలంగాణ క్రీడా ప్రాంగణాల కోసం మరో రూ.85 కోట్లు అదనంగా ఇచ్చారు.

ఫైనల్‌పై గురి

నేడు బంగ్లాతో భారత్ సెమీస్
మహిళల ఆసియాకప్
మ.2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

దంబుల్లా: మహిళల ఆసియా టీ20 కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ అంచనాలకు తగ్గట్టుగానే అదరగొడుతోంది. అన్ని విభాగాల్లో రాణిస్తున్న హర్మన్‌ప్రీత్ సేన టోర్నీలో భారీ విజయాలతో సెమీస్‌కు చేరింది. ఇప్పుడు ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకునేందుకు శుక్రవారం బంగ్లాదేశ్‌తో కీలక పోరులో తలపడేందుకు సిద్ధమవుతోంది. రాత్రి ఏడు గంటలకు జరిగే మరో సెమీఫైనల్లో శ్రీలంక జట్టు పాకిస్థాన్‌ను ఎదుర్కోనుంది.

ఒలింపిక్స్‌లో 'రేపిస్ట్'

క్రీడా గ్రామంలోకి నో ఎంట్రీ



నెదర్లాండ్స్‌కు చెందిన బీచ్ వాలీబాల్ ప్లేయర్ స్టీవెన్ వాన్ డి వెల్డె నేపథ్యం వింటే ఎవరైనా వణికిపోతారేమో.. సరిగ్గా పదేళ్ల క్రితం అతను 12 ఏళ్ల బ్రిటిష్ స్కూల్ విద్యార్థినిని రేప్ చేశాడు. అప్పుడు స్టీవెన్ వయస్సు 19 ఏళ్లు. ఈ నేరాన్ని అంగీకరించడంతో 2016లో నాలుగేళ్ల శిక్ష విధించారు. అయితే యూకే ఆ తర్వాత నెదర్లాండ్స్‌లో శిక్ష అనుభవించిన తను 13 నెలలకే విడుదలయ్యాడు. అనంతరం వాలీబాల్ కెరీర్‌ను కొనసాగించడంతో పాటు తాజాగా తమ దేశం తరఫున ఒలింపిక్స్‌కు కూడా ఎంపికయ్యాడు. కానీ జట్టులో అతడిని చేర్చడంపై విమర్శలు కూడా ఎదురవుతున్నాయి. అందుకే స్టీవెన్‌ను ఒలింపిక్ విలేజ్‌లో ఉంచడం లేదు. అలాగే గేమ్స్ జరిగినన్ని రోజులు కూడా మీడియాతో మాట్లాడవద్దని నెదర్లాండ్స్ అధికారులు ఆదేశించారు. మరోవైపు రెండేళ్ల క్రితమే వాలీబాల్ ప్లేయర్, పోలీస్ ఆఫీసర్ కూడా అయిన కిమ్ బెహ్రెన్స్‌ను స్టీవెన్ వివాహం చేసుకోవడం గమనార్హం.

ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్, ఎస్సై

» లంచం తీసుకున్న పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత..
పాల్వంచ టౌన్ ఎస్సై బానాల రాము అరెస్టు

పరకాల/పాల్వంచ/మక్తల్, జూలై 25: లంచం తీసుకుంటూ హనుమకొండ జిల్లా పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ టౌన్ ఎస్సై బానాల రాము రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కారు. పరకాల మునిసిపాలిటీ పరిధిలోని సీతారాంపురానికి చెందిన లడే రాజేశ్వర్‌రావు, సాంబలక్ష్మి దంపతులు తమ పేరిట ఉన్న 1173 గజాల భూవిని వారసత్వంగా తమ ఇద్దరు కుమారులకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు నిర్ణయించుకున్నారు. డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేశ్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ సునీతను సంప్రదించారు. అందుకు ఆమె రూ.80వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో రాజేశ్వరరావు ఆయన కుమారులు ఈనెల 22న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం వారు రూ.80వేలను డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేశ్‌కు ఇచ్చారు. అదే సమయంలో దాడి చేసిన ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్ సునీతను అరెస్టు చేశారు. మరోవైపు.. భద్రాద్రి జిల్లా పాల్వంచ గట్టాయిగూడెంకు చెందిన శ్రావణి అనే మహిళ నుంచి కొత్తగూడేనికి చెందిన బాలసాని గణేష్ నగదు అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత అతను మృతి చెందడంతో శ్రావణి కోర్టును ఆశ్రయించగా గణేష్‌కు చెందిన ఆస్తిపై అటాచ్‌మెంట్ ఆర్డర్ జారీ అయింది. అయినా పాల్వంచకు చెందిన ఇద్దరు వ్యక్తులు గణేష్ ఆస్తిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పైగా ఆమెను వారు బెదిరించడంతో పాల్వంచ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కానీ ఎస్సై బానాల రాము ఆమె ఫిర్యాదును పక్కన పడేశాడు. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల మేరకు ఎస్సై ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాడు. కేసు నమోదు చేసినందున తనకు డబ్బులివ్వాలని శ్రావణి తరఫు న్యాయవాది లక్ష్మారెడ్డిని ఎస్సై రాము ఒత్తిడి చేయడంతో ఆయన ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. గురువారం న్యాయవాది పాల్వంచలోని ఎస్సై నివాసానికి వెళ్లి.. ఆయనకు రూ.20 వేల నగదును అందించగా ఏసీబీ అధికారులు.. ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.


సబ్ రిజిస్ట్రార్ సునీత, ఎస్ఐ బానాల రాము

మక్తల్‌లో ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్

నారాయణపేట జిల్లా మక్తల్ మండల సర్వేయర్ బాల్‌రాజ్ రూ.9 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. మక్తల్‌కు చెందిన గాసం వెంకటేష్ భూమిలో సర్వే చేసేందుకు సర్వేయర్ బాల్‌రాజ్ లంచం డిమాండ్ చేశాడు. ఈ విషయంపై బాధితుడి అల్లుడు శ్రవణ్ ఏసీబీ అధికారులకు సమాచారం అందించాడు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌కు బాధితుడు లంచం ఇచ్చి బయటకు రాగానే వెంటనే ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు.

మద్యం సీసాలో బల్లి

» తాగిన వారికి స్వల్ప అస్వస్థత.. వికారాబాద్‌లో ఘటన

వికారాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'రాయల్ గ్రీన్' విస్కీ సీసాలో బల్లి రావడంతో ఆ సీసాలోని మద్యం తాగిన వారు స్వల్ప అస్వస్థతకు గురైన సంఘటన వికారాబాద్ జిల్లాలో కలకలం రేపింది. వికారాబాద్ పట్టణానికి చెందిన సందీప్ అనే యువకుడు ఎన్నెపల్లిలోని అనంతగిరి వైన్స్‌లో రాయల్ గ్రీన్ విస్కీ ఫుల్ బాటిల్‌ను ఈ నెల 22న సాయంత్రం 8గంటల సమయంలో కొన్నాడు. మిత్రులతో కలిసి సగం సీసా వరకు మద్యం తాగిన తరువాత చూడగా సీసాలో బల్లి కన్పించింది. దీంతో మద్యం తాగిన యువకులంతా నిశ్చేష్టులయ్యారు. బల్లి పడిన మద్యం తాగిన తమకు ఏమవుతుందోనని భయపడ్డారు. మరుసటి రోజు తెల్లవారుజామున వారంతా విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. స్వల్ప అస్వస్థతకు గురైనప్పటికీ మాత్రలు వేసుకొని కోలుకున్నారు.

నేడు ఫైర్ మెన్ల పాసింగ్ అవుట్ పరేడ్

» శిక్షణ పూర్తి చేసుకున్న 483 మంది.. ముఖ్య అతిథిగా సీఎం

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తి చేసుకొని 483 మంది ఫైర్ మెన్లు విధుల్లో చేరుతుండడంతో రాష్ట్ర విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ మరింత బలోపేతమవుతోంది. నాలుగు నెలల ప్రత్యేక శిక్షణ పొందిన ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్ వట్టినాగులపల్లిలోని తెలంగాణ విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక సేవల శాఖ శిక్షణ కేంద్రంలో శుక్రవారం జరుగుతుంది. దీనికిసీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ కార్యక్రమం అనంతరం అగ్నిమాపక శాఖలో ఇటీవల ఎంపికైన 157 మంది డ్రైవర్ ఆపరేటర్లకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారు.


వెమ్ టెక్నాలజీస్ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు

రాష్ట్రానికి వెయ్యి కోట్ల పెట్టుబడులు

» నిమ్జ్‌లో రక్షణ పరికరాల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న 'వెమ్ టెక్నాలజీస్'
» మంత్రి శ్రీధర్‌బాబుతో సంస్థ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రక్షణరంగ పరికరాల ఉత్పత్తి సంస్థ 'వెమ్ టెక్నాలజీస్' రాష్ట్రంలో రూ.1000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఆ సంస్థ సీఎండీ వి.వెంకటరాజు, ప్రతినిధులు గురువారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జహీరాబాద్ నిమ్జ్‌లో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమ మొదటి దశలో రూ.1000 కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. ఇదివచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తవుతుందని, తొలిదశలో వెయ్యి మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. పరిశ్రమకు కావాల్సిన భూమిని వెంటనే సమీకరించి ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతికి శ్రీధర్‌బాబు సూచించారు. ఉత్పత్తి ప్రారంభించడానికి అవసరమైన 33 కేవీ విద్యుత్తు లైన్లను 4 నెలల్లో ఏర్పాటు చేసి సరఫరా ప్రారంభించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో మధుసూదన్, ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, జపనీస్ పెట్రో కెమికల్ దిగ్గజం 'మిత్సుయి కెమికల్స్' హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి టెక్నికల్ సెంటర్ ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. సంస్థ గ్లోబల్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ ఫ్యూజి ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం గురువారం మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయింది. టీహబ్ ద్వారా లైఫ్‌సైన్సెస్, పెట్రో కెమికల్స్ రంగాల్లోని అంకుర సంస్థల్లో 100 కోట్లు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్లు సంస్థ ప్రతినిధి హన్మంతరావు తెలిపారు.

ప్రభుత్వరంగ సంస్థలను అమ్మితే ఊరుకోం: శ్రీధర్ బాబు

ప్రభుత్వరంగ సంస్థల వాటాల విక్రయం ద్వారా ఈ ఏడాది రూ.50 వేల కోట్ల ఆదాయం రాబట్టాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో ప్రస్తావించడంపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. ఇది కన్నబిడ్డలను మరొకరికి అమ్ముకోవడం లాంటి దారుణమన్నారు. 13 మహారత్న, 14 నవరత్న, 72 మినీరత్న సంస్థలన్నీ లాభాల్లో ఉన్నాయని.. వాటిని అమ్మితే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

ప్రాజెక్టులకు జల కళ

(మొదటి పేజీ తరువాయి)

నీటి మట్టం 1631.91 అడుగులకు, నీటి నిల్వ 101.91 టీఎంసీలకు చేరింది. 28 గేట్లను ఎత్తారు. బేసిన్‌తో పాటు సబ్ బేసిన్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర జలాశయాలు నిండడంతో వచ్చిన నీరంతటినీ శ్రీశైలం ప్రాజెక్టుకు వదులుతున్నారు. గురువారం ఆల్మట్టికి 2,04,167 క్యూసెక్కులు వస్తుండగా 2,75,000 క్యూసెక్కులు, నారాయణపూర్‌కు 2.70 లక్షల క్యూసెక్కులు వస్తుండగా 25 గేట్లు ఎత్తి 2,70,120 క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఔట్‌ఫ్లో 2.50 లక్షల క్యూసెక్కులుగా ఉంది. జూరాల జలాశయానికి 2.27 లక్షల క్యూసెక్కుల నీరువస్తుండగా 46 గేట్లు ఎత్తి 2,25,354 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 19,516 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలంలోకి 2.54 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, జల విద్యుదుత్పత్తితో 31,784 క్యూసెక్కులు సాగర్‌కు విడిచిపెడుతున్నారు. తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేసిన వరద కూడా రెండు రోజుల్లో శ్రీశైలం చేరే అవకాశం ఉంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు కాగా 855.20 అడుగులకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా 85.75 టీఎంసీల నీరు ఉంది. రోజుకు 16.50 టీఎంసీల నీరు డ్యాంలోకి చేరుతోంది. ఇలాగే కొనసాగితే వారం రోజుల్లో జలాశయం నిండే అవకాశం ఉంది. కాగా, నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల, ఏపీ మధ్య కృష్ణా నదిలో ఉన్న సంగమేశ్వరాలయం శుక్రవారం ఉదయానికి జలదివాసం కానుంది.


భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి, వరద నీటి ముంపులో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల వద్ద సంగమేశ్వరాలయం

సాగర్‌కు 29,125 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఈ ఏడాది తొలిసారి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద రాక మొదలైంది. వారం రోజుల్లో 50 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో బుధవారం నుంచే విద్యుదుత్పత్తి ప్రారంభించగా, సాగర్‌కు గురువారం సాయంత్రానికి 29,125 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. సాగర్ నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 503.50 అడుగులుండగా గురువారం సాయంత్రానికి 504.20 అడుగులకు (122.08 టీఎంసీలు) చేరుకుంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5,700క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

గోదావరి తగ్గుతూ.. పెరుగుతూ..

భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. బుధవారం అర్ధరాత్రి నుంచి క్రమంగా పెరిగింది. గురువారం సాయంత్రం 6 గంటలకు 48.60 అడుగులకు చేరింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాగా, సమ్మక్కసాగర్ (తుపాకుల గూడెం) బ్యారేజీకి 9.50లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం)కు 11.47 లక్షలు, మేడిగడ్డకు 7.71 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. శ్రీరాం సాగర్‌కు 21,650 క్యూసెక్కుల వరద చేరుతోంది.

విద్యార్థులను భుజాలపై ఎత్తుకుని..

ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలం జైహింద్‌పూర్‌లో ఒర్రె పొంగడంతో 26 మంది విద్యార్థులు ఒక్కొక్కరిని ఉపాధ్యాయుడు సంతోష్ భుజాలపై ఎత్తుకుని అవతలి ఒడ్డున ఉన్న బడికి చేర్చారు. అలాగే, మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో ప్రాణహిత బ్యాక్ వాటర్ రోడ్డుపైకి భారీగా చేరింది. దీంతో జాజులపేటకు చెందిన గర్భిణి భారతిని ఆమె భర్త, ఆశా కార్యకర్త వరద నీటిలో ఆమెను అర కి.మీ. నడిపించుకుని వెళ్లి ఆస్పత్రికి చేర్చారు.

హైదరాబాద్‌లో రోజంతా వాన

రాష్ట్రంలో గురువారం ముసురు కమ్మేసింది. హైదరాబాద్‌లో బుధవారం అర్ధరాత్రి మొదలైన వర్షం గురువారం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాల్లో 1 సెంటీమీటర్‌పైనే వాన పడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ వర్షం తెరిపినివ్వలేదు. సగటున 2.6 సెం.మీ. పైనే వర్షం కురిసింది. పెన్ గంగా, ప్రాణహిత, పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రాణహిత ధాటికి బెజ్జూర్ మండలంలో 12 గ్రామాలు జల దిగ్బంధమయ్యాయి.

నేటి నుంచి ఎప్‌సెట్ రెండో దశ కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై25(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ రెండో దశ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 26న అభ్యర్థులు స్లాట్‌లను, 27, 28వ తేదీల్లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలి. 31న సీట్లను కేటాయించనున్నారు. పాలిసెట్ తుది దశ కౌన్సెలింగ్‌ను కూడా శుక్రవారం నుంచే చేపడుతున్నారు.

నేటితో ముగియనున్న ఫోన్ ట్యాపింగ్ నిందితుల రిమాండ్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన నలుగురు నిందితులు.. మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు జ్యుడీషియల్ రిమాండ్ శుక్రవారంతో ముగియనుంది. దీంతో.. చంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నారు.

'దానం' అనర్హతపై పిటిషన్ స్వీకరించండి

» రసీదు ఇవ్వండి.. అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌ను స్వీకరించడంతోపాటు రసీదు ఇవ్వాలని అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కనీసం తమ పిటిషన్‌ను స్పీకర్ కార్యాలయం స్వీకరించడం లేదని పేర్కొంటూ మహేశ్వరరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం అనర్హత పిటిషన్‌ను స్వీకరించి.. రశీదు ఇవ్వాలని.. కాపీని కోర్టుకు సమర్పించాలని ధర్మాసనం అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు కొనసాగిస్తూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారని.. అనర్హత పిటిషన్‌లు దాఖలైన వెంటనే కోర్టుకు వచ్చారన్నారు. మూడునెలలైనా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదన్న వాదనను తోసిపుచ్చారు. ఈ పిటిషన్‌లు హైకోర్టు ఎదుట ఉన్నందున స్పీకర్ పరిశీలించకపోయి ఉండొచ్చని.. కోర్టు నిర్ణయం కోసం స్పీకర్ వేచి చూస్తుండొచ్చన్నారు. వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

కన్నెపల్లి పంప్‌హౌస్ కరెంట్ బకాయిలు 492 కోట్లు

మహదేవపూర్, జూలై 25: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి (లక్ష్మీ) పంప్‌హౌస్ విద్యుత్తు బిల్లుల బకాయిలు రూ.వందల కోట్ల మేర పేరుకుపోయాయి. 2019లో జూన్ 21న లక్ష్మీ పంప్‌హౌస్‌లో ఎత్తిపోతలను ప్రారంభించగా.. అప్పట్నుంచి ఇప్పటివరకు రూ.492 కోట్లకు పైగా బిల్లు బకాయిలున్నట్టు గురువారం విద్యుత్తు అధికారులు వెల్లడించారు. గత నెల నుంచి జూలై 25 వరకు రూ.7,26,31,794 బిల్లు వచ్చిందని పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభం నాటి నుంచి ఇప్పటివరకు 163 టీఎంసీల నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోశారు. ఇందుకోసం భారీగా విద్యుత్తు వినియోగం జరిగింది.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

» భూపాలపల్లి జిల్లా వాసి అశోక్‌గా గుర్తింపు


నల్లమరి అశోక్(ఫైల్)

గణపురం/ములుగు, జూలై 25: ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో.. తెలంగాణకు చెందిన ఓ నక్సలైట్ మృతిచెందారు. మావోయిస్టు పార్టీ ప్లీనరీ జరుగుతోందనే సమాచారంతో స్పెషల్ పార్టీ పోలీసులు గురువారం తెల్లవారుజాము నుంచి ఈ రెండు జిల్లాల సరిహద్దుల్లోని గుండాల మండలం దామరతోగు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటలకు మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తులో మృతుడిని జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన విజేందర్ అలియాస్ నల్లమరి అశోక్(40)గా గుర్తించారు. కాకతాళీయంగా అశోక్ తన తండ్రి సంవత్సరీకం రోజునే చనిపోయారని గ్రామస్తులు కన్నీటిపర్యంతం చెప్పారు. అశోక్‌పై రూ.లక్ష రివార్డు ఉంది. మరోవైపు.. ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని, ఈ ఎన్‌కౌంటర్‌ను విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి-కొత్తగూడెం - అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ కోరారు. ఈ మేరకు ఆయన పేరిట ఓ లేఖ విడుదలైంది. ఈ ఎన్‌కౌంటర్‌కు రేవంత్ సర్కారు తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. కాగా.. ఛత్తీస్‌గఢ్‌లోని గంగలూరులో గురువారం నలుగురు మావోయిస్టులు అరెస్టవ్వగా.. సుకుమాలో మరో ఐదుగురు పోలీసులకు లొంగిపోయారని పోలీసులు తెలిపారు.

వచ్చే ఏడాది జూన్‌కు విజయవాడ టర్మినల్ రెడీ

» ఇప్పటికే 48.5శాతం పనులు పూర్తి: కేంద్ర మంత్రి రామ్మోహన్

న్యూఢిల్లీ, జూలై 25: ఏపీలోని గన్నవరం విమానాశ్రయంలో నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రల్ టర్మినల్ వచ్చే ఏడాది జూన్ నాటికి సిద్ధమవుతుందని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. 2020 జూన్‌లో 611.80 కోట్ల అంచనా వ్యయంతో దీని నిర్మాణం చేపట్టామని, కొవిడ్, తుఫాన్ల వంటి కారణాలవల్ల నిర్మాణం ఆలస్యమైందని చెప్పారు. ప్రస్తుతానికి 48.5 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. గురువారం లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు రామ్మోహన్‌నాయుడు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. తిరుపతి విమానాశ్రయానికి 'శ్రీవెంకటేశ్వర ఎయిర్‌పోర్ట్' అనే పేరు పెట్టాలని ఏపీ ప్రభుత్వం కోరిందన్నారు. షిర్డీ ఎయిర్‌పోర్ట్‌కు 'శ్రీ సాయిబాబా అంతర్జాతీయ విమానాశ్రయం' అని పేరు పెట్టాలని మహారాష్ట్ర కోరిందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దిగ్విజయోస్తు

విశ్వ క్రీడా సంరంభానికి వేళ అయింది. పారిస్ వేదికగా ఒలింపిక్ క్రీడలు ప్రారంభమవుతున్నాయి. 1896లో ఫ్రాన్స్‌కు చెందిన పియరీ డీ కోబర్టిన్ కృషితో ఏథెన్స్ వేదికగా మొదలైన ఆధునిక ఒలింపిక్స్ ప్రపంచ యుద్ధాల కారణంగా మూడుసార్లు మినహా అప్రతిహతంగా సాగుతూ ఆబాల గోపాలాన్ని అలరిస్తున్నాయి. మానవాళిని వణికించిన కరోనా సమయంలోనూ ఓ ఏడాది వాయిదా పడిందేగానీ రద్దు కాలేదు. వేసవి ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వడం ఫ్రాన్స్‌కిది మూడోసారి. 1900, 1924లలో పోటీలు జరిగాయి. సరిగ్గా శతాబ్దం తర్వాత మళ్లీ ఇప్పుడు వేడుకకు సిద్ధమైంది. 206 దేశాలకు చెందిన సుమారు 10,500 మంది క్రీడాకారులు 32 క్రీడాంశాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలో ఉన్నారు. పారిస్ క్రీడలకు అక్కడి ప్రభుత్వం భారీ స్థాయిలో 45 వేలమంది పోలీసు, మిలిటరీ బలగాలను రంగంలోకి దించింది. క్రీడల్లో సేవలందించేందుకు మిగతా దేశాలనుంచి 45 వేల మంది వాలంటీర్లు రానున్నారు.

ఈ 17 రోజుల పండుగకు భారత్ నుంచి 117 మందితో కూడిన బృందం పారిస్‌కు బయల్దేరింది. 2021లో జరిగిన టోక్యో క్రీడల్లో 122 మందితో వెళ్లిన మన బృందం ఏడు పతకాలు సాధించుకొచ్చింది. ఒలింపిక్ క్రీడల చరిత్రలో ఇన్ని పతకాలు మనం ఎన్నడూ సాధించింది లేదు. మొత్తంగా చూస్తే ఈ పోటీల్లో మన స్థానం 48. ఈసారి కనీసం పది పతకాలైనా కొల్లగొడతారని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. జావెలిన్ వీరుడు నీరజ్ చోప్రా మరోసారి స్వర్ణ భేరీ మోగిస్తాడని అంతా ధీమాగా ఉన్నారు. ఏదైనా సంచలనం జరిగి జావెలిన్‌తోపాటు మరొక్క స్వర్ణం మనకు దఖలు పడితే అవధుల్లేని ఆనందమే. లిఫ్టర్ మీరాబాయి చాను, బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా బోర్గొహైన్, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో సాత్విక్ జోడీ, పీవీ సింధు, రెజ్లర్ అంతిమ్ పంగల్, పురుషుల హాకీ జట్టు నుంచి పతకాలు లభించవచ్చునన్నది ఓ అంచనా. ఒలింపిక్స్‌లో 1920లో తొలిసారిగా బరిలోకి దిగింది మొదలు మనం ఇప్పటి వరకూ సాధించిన పతకాల సంఖ్య 35. వీటిలో హాకీలోనే 12 మెడల్స్ ఉన్నాయంటే, ఇతర క్రీడాంశాల్లో మనం ఎంత వెనుకబడి ఉన్నామో అర్థమవుతుంది. 1952 హెల్సెంకి క్రీడల్లో కేడీ జాదవ్ కుస్తీలో కాంస్యం సాధించే వరకూ మనకు వ్యక్తిగత పతకమే లేదు.

తెలుగు రాష్ట్రాల నుంచి ఈసారి ఎనిమిది మంది పతకాల పరుగులో ఉన్నారు. వీరిలో ఆరుగురు అమ్మాయిలే. పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్, యర్రాజి జ్యోతి, దండి జ్యోతికశ్రీ, బొమ్మదేవర ధీరజ్, నిఖత్ జరీన్, ఆకుల శ్రీజ, ఇషా సింగ్ నుంచి పతకాలు ఆశిస్తున్నారు.

ఆధునిక ఒలింపిక్స్ మొదలైనప్పటినుంచీ ఇప్పటిదాకా అమెరికాదే ఆధిపత్యం. నువ్వా నేనా అన్నట్టు రష్యా, చైనా దేశాలు దాని వెన్నంటే ఉంటున్నాయి. గత క్రీడల్లో అమెరికా జట్టు పతకాల పట్టికలో చైనా కంటే ఒక్క స్వర్ణం మాత్రమే ఎక్కువ సాధించింది. ఇక డోపింగ్ కారణంగా 2021 క్రీడల నుంచి, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా ఈసారి ఒలింపిక్స్ నుంచి రష్యాను నిషేధించారు. దీంతో వారంతా రష్యా ఒలింపిక్ కమిటీ జెండాకింద ఆడుతున్నారు. 1896 నుంచి 2021 వరకూ పతకాలపై అమెరికా ఒకరకంగా దండయాత్రే చేస్తోంది. మొత్తం 2600 పతకాలతో అగ్రపీఠంపై ఉంది.

గతం సంగతలావుంచితే పారిస్‌లో పలువురు ప్రపంచస్థాయి అథ్లెట్లు మోహరించారు. అమెరికా జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్, కెన్యా మారథాన్ రన్నర్ కిప్చొగె, అమెరికాకు చెందిన 100, 200 మీటర్ల రన్నర్ నోవా లైల్స్, స్వీడన్ పోల్‌వాల్ట్ ఆటగాడు డుప్లాటిస్, టెన్నిస్ దిగ్గజాలు రఫెల్ నడాల్, జొకోవిచ్, బాస్కెట్‌బాల్ స్టార్ లెబ్రాన్ జేమ్స్, జమైకా స్ప్రింటర్, మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ షెల్లీ ఆన్ ఫ్రేజర్, ఈత కొలను రాణి కేటీ లెడెకీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. రెప్పపాటులో తారుమారయ్యే ఫలితాలు, ప్రపంచ రికార్డులు, ఉత్కంఠభరిత పోరాటాల సమాహారమైన మహా సంగ్రామానికి అంతా సిద్ధమైంది. అంతర్జాతీయ ఆటగాళ్ల అత్యుత్తమ ప్రతిభాపాటవాలను ఆస్వాదిస్తూనే, భారత బృందం పతక వేటలో గత రికార్డుల్ని పటాపంచలు చేయాలని ఆకాంక్షిద్దాం.

కన్వర్ యాత్రలో ఆహార రాజకీయం!

చాలా సంవత్సరాలుగా నేను 'ఎలెక్షన్స్ ఆన్ మై ప్లేట్' అనే ఒక టీవీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను. రుచికరమైన వైవిధ్యభరిత ఆహార పదార్థాల గురించి నివేదనతో సహ ఎన్నికల ప్రచార పోకడలను సవివరంగా చూపించే, వ్యాఖ్యానించే టీవీ షో అది. వాస్తవంగా ఆహారమే ఆ కార్యక్రమం ప్రధాన ఆకర్షణ. కారణం చెప్పాలా? భారతదేశ అద్భుత ఆహార వైవిధ్యానికి సాటిరాగల దేశమేదీ ప్రపంచంలో లేదు కదా. మరి ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ పోలీసులు కన్వర్ యాత్ర సమయంలో ఆహార నిఘా (పోలీసింగ్)కు పాల్పడుతున్నారు! ఇది భారతీయ అస్తిత్వ విశిష్టతగా భావించేదాన్ని దెబ్బతీయడమే కాదూ?

భారతీయ ఆహారం భారతీయ జీవన పరిమళం. దక్షిణ భారతావనిలో ఉన్న మదురై వెళ్లండి. ఉత్కృష్ట ఆలయ శిల్పానికి దర్పణమైన మీనాక్షిపురం కోవెల సమీపంలోనే అమ్మాస్ కిచెన్ అనే ఒక అద్భుత భోజనశాల ఉన్నది. చెట్టినాడ్ మాంసాహారం, పీతల ఆమ్లెట్, కుందేలు మాంసాన్ని ఆస్వాదించాలంటే ఆ కిచెన్‌కు వెళ్లాల్సిందే. అటువంటి కమ్మని వంటకాలు మదురైలో కాక మరెక్కడ లభిస్తాయి? జైపూర్ పాత బస్తీలో మూడు అంతస్తుల రెస్టారెంట్ ఒకటి ఉన్నది. ఇప్పటికి చాలా తరాలుగా ఒక ముస్లిం కుటుంబమే దానిని నిర్వహిస్తోంది. చవులూరించే మొగలాయి వంటకాలు అక్కడ కాక మరెక్కడ మీకు ఎక్కడ లభ్యమవుతాయి? ఆ పురాతన హోటల్ ఒక 'శుద్ధ' శాకాహార భోజనశాల పక్కనే ఉందని నేను చెప్పి తీరాలి. పూణె-సోలాపూర్ హైవేలో జై తుల్జా భవాని అనే పేరు గల ధాబా ఒకటి ఉన్నది. పరిమళ భరితమైన మటన్ వంటకాలకు అది పెట్టింది పేరు. ఆ ధాబాను నిర్వహిస్తున్న కుటుంబం ధంగార్లు అనే ఒక ఓబీసీ సామాజిక వర్గానికి చెందినది. అమితమైన మత నిష్ఠ గల కుటుంబమది. అయినా ఆ కుటుంబ సభ్యులందరికీ మాంసాహారమే నిత్య ఆహారం. ఆంధ్రాకు వెళదాం. విజయవాడ నడి బొడ్డున అర డజన్ రకాల ఆంధ్ర బిర్యానీలను విక్రయించే ఒక స్టాల్ ఉంటుంది. మీరు ఆ స్టాల్‌కు వెళ్లితే దాని పక్కనే ఉన్న ఒక ఇడ్లీ–దోశ జాయింట్ మిమ్ములను తప్పక ఆకర్షిస్తుంది.

అద్భుతమైన పాకనాడు మన భారతావని. ఆహార భారతంలో మీకు ఎల్లెడలా శాంతియుత సహజీవనమే కనిపిస్తుంది. ఒక రెస్టారెంట్ ఘనతను దాని యజమాని పేరునుబట్టి కాకుండా అది వడ్డించే వంటకాల నాణ్యత ఆధారంగా మాత్రమే ఆస్వాదకులు నిర్ణయిస్తారు, గుర్తు పెట్టుకుంటారు. అయినా కన్వర్ యాత్రా మార్గంలో రోడ్డు పక్క రెస్టారెంట్‌లు తమ యజమాని పేరు ఉన్న బోర్డు (నేమ్ ప్లేట్) ఉంచి తీరేలా చూడాలని ఉత్తరప్రదేశ్ పోలీసులను యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 'ఆదేశించింది'! ఇది, ఉద్దేశపూర్వకంగా పౌర సమాజంలో మతపరమైన విభేదాలను రగుల్కొల్పే నిర్ణయమే కాదూ? యాత్ర మార్గం పొడవునా శాంతి భద్రతలకు ఎటువంటి భంగం కలుగకుండా జాగ్రత్త వహించేందుకే ఆ ఆదేశాన్ని జారీ చేసినట్టు యోగి సర్కార్ సమర్థించుకుంటోంది. ఇంతకంటే కపటం మరేమైనా ఉంటుందా? కన్వర్ యాత్ర ఈ నాటిదా? ఏ నాటి నుంచో జరుగుతున్న తీర్థయాత్ర కదా అది. అయితే యాత్రికుల ఆహార అలవాట్ల విషయమై అది ఎన్నడూ ఇబ్బందుల్లో పడలేదు. ఇప్పుడు యోగి ప్రభుత్వ వివక్షాపూరిత ఆహార రాజకీయాల కారణంగానే అది వివాదాస్పదమయింది. అనవసర సమస్యల నెదుర్కొంటోంది.

రెస్టారెంట్లు, ధాబాలు తమ యజమాని పేరును ఎందుకు ప్రదర్శించాలి? సామాజిక వేర్పాటుతనాన్ని రెచ్చగొట్టేందుకే యోగి సర్కార్ ఆ ఆదేశాన్ని జారీ చేసింది. ఒక నిర్దిష్ట మతం వారిని ప్రత్యేకంగా సూచించేందుకే ఆ ఆదేశం. ఆ మతస్థులు ముస్లింలు అని మరి చెప్పనవసరం లేదు. ముస్లిం మతస్థుల నిర్వహణలోని తినుబండారాలలో యాత్రికులు ఏమీ కొనకుండా నిరోధించేందుకే ఆ నిర్ణయం తీసుకున్నారు. ఇది ఎటువంటి మినహాయింపులు లేని సామాజిక వివక్ష, సందేహం లేదు. మతపరమైన చీలికలు సృష్టించడమే దీనివెనుక ఉన్న ఉద్దేశం. యాత్రికులు వాంఛించని, వారి మతవిశ్వాసాలకు విరుద్ధమైన ఆహార పదార్థాలను సరఫరా చేయాలని ఏ వ్యాపారి అభిలషిస్తాడు? వ్యాపారి అనేవాడు మతపరమైన కారణాలతో వినియోగదారులను పోగొట్టుకుంటాడా?



> యోగి ఆదిత్యనాథ్ సర్కార్ నిర్ణయంతో ఈ రోజు ముస్లిం విక్రేతల జీవనాధారాలు ప్రమాదంలో పడ్డాయి. మరి రేపు దళితుల, కింది స్థాయి ఓబీసీ వర్గాల వారి జీవనోపాధులకు అటువంటి గతి పట్టదని ఎవరు చెప్పగలరు? ఎవరెన్ని చెప్పినా ఆహార 'శుచి', 'అస్పృశ్యత' అనేవి శతాబ్దాలుగా హిందూ సమాజంలో కుల వివక్షలో నిర్ణయాత్మకంగా ఉన్నాయి. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అన్న ఆదర్శం ఆహారం విషయమై మతతత్వ సంకేతాత్మక రాజకీయ సందేశాలకు ఆస్కారమివ్వదు.

సరే, సామాజిక మాధ్యమాలు కన్వర్ యాత్రలో ఆహార రాజకీయాన్ని మరింత హానికరం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముస్లింల యాజమాన్యంలోని రెస్టారెంట్లు 'అపరిశుభ్రమైనవని', 'అనారోగ్యకరమైనవని' ఆ అధునాతన మాధ్యమాలలో ఎందరో ఘోషిస్తున్నారు. ఇదొక శుద్ధ అబద్ధం. ఇది నిస్సిగ్గుగా మతతత్వాన్ని ప్రదర్శించడమే. అటువంటి అభిప్రాయాలు వ్యక్తం చేసిన వారు ముస్లింల పట్ల ఎంత దురభిప్రాయంతో ఉన్నారో వెల్లడవుతుంది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

ఈ సందర్భంగా ఒక సమాంతర విపరీత ఉదంతాన్ని పేర్కొనడం సముచితంగా ఉంటుంది. అది కొవిడ్ ఉపద్రవ కాలంలో సంభవించింది. దేశ రాజధానిలో తబ్లీఘి జమాత్ సమావేశాలు జరిగాయి. సరిగ్గా అదే సమయంలో కొవిడ్ కేసులు అంతు లేకుండా పెరిగాయి. ఇంకేముంది, మతోన్మాదులకు ఒక సాకు దొరికింది. తబ్లిఘి ముస్లింలే కరోనా విలయాన్ని వ్యాపింపచేస్తున్నారనే ఒక అపప్రథను పుట్టించారు! ఆ ప్రపంచవ్యాప్త మహమ్మారికి ముస్లింలే కారణమంటూ విషప్రచారం జరిగింది. ముస్లింలు అందరినీ లక్ష్యం చేసుకున్న ఆ తప్పుడు ప్రచారం ఆ విపత్కాలంలో చాలా ప్రభావదాయకంగా పరిణమించింది. ఎంతగా అంటే వీధుల్లో తోపుడు బండ్లపై కూరగాయలు అమ్ముకునే ముస్లిం విక్రేతలను ఊరూ, వాడలోనూ, బస్తీలు, కాలనీలలోనూ బహిష్కరించడం జరిగింది. కన్వర్ యాత్ర వివాదంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం శీఘ్రగతిన, సకాలంలో జోక్యం చేసుకుని ఉండకపోతే కొవిడ్ కాలంలో సంభవించిన దుష్పరిణామమే ఇప్పుడూ వాటిల్లి ఉండేదనంలో సందేహం లేదు. ఆ హిందూ తీర్థయాత్ర మార్గంలో ఉన్న రెస్టారెంట్లు తమ యజమానులు, నిర్వాహకుల, సిబ్బంది పేర్లను ప్రదర్శించాలనే ఆదేశం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, దేశ పౌరుల ప్రాథమిక హక్కులను, వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం ఎంతైనా ముదావహం.

ఈ వివాదం ఉత్తరప్రదేశ్‌లో ఆరంభమవడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకని? ముగిసిన వేసవిలో జరిగిన 18వ సార్వత్రక ఎన్నికలలో, దేశంలో అత్యధిక జనాభా ఉన్న ఆ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ భారీగా నష్టపోయింది. ఆ ఎన్నికల తీర్పు వెలువడిన నాటి నుంచి యూపీలో ఆ పార్టీ చాలా క్లిష్టపరిస్థితుల నెదుర్కొంటోంది. పార్టీకి ఎన్నడూ లేని విధంగా సీట్లు, ఓట్లు తగ్గిపోవడానికి కారణమెవరు అనే విషయమై యూపీ బీజేపీలోని వివిధ వర్గాలు బహిరంగంగా పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను పార్టీ పరాజయానికి ప్రధాన కారకుడిని చేసేందుకు ఒక గట్టి ప్రయత్నమే జరుగుతోంది బీజేపీ కేంద్ర నాయకత్వం బాహాటంగా అయితే ఏ పక్షమూ వహించడం లేదు. అటువంటి వైఖరి శ్రేయస్కరం కాదని భావిస్తున్నందున ఆ పరస్పర సతాయింపులు మరింతగా కొనసాగేందుకు అనుమతిస్తోంది. తనపై వర్షిస్తున్న నిందలు, ఆరోపణలకు నిలువెల్ల కాషాయ వస్త్రధారి అయిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎప్పటిలాగానే దురుసుగా ప్రతిస్పందిస్తున్నారు. దేనికీ విచారం వ్యక్తం చేసే స్వభావం కాని, క్షమాపణ చెప్పే నమ్రత కాని ఏ కోశానా లేని అతివాద హిందుత్వ యోధుడు ఆ యోగి. మరి రాజకీయంగా సరైన ప్రవర్తన అనే విషయమై సంప్రదాయ రీతి రివాజులకు ఆయన కట్టుబడుతాడా? అసంభవం. భగవాన్ శివ భక్తులు కాలినడకన హరిద్వార్ మొదలైన పవిత్ర గంగానది వెంబడి పుణ్య క్షేత్రాలకు వెళ్లి గంగా జలాన్ని సేకరించి శివాలయాలలో సమర్పించడమే కన్వర్ యాత్ర. ఈ వార్షిక తీర్థయాత్ర ఏటా శ్రావణ మాసంలో జరగడం అనూచానంగా వస్తోంది. ఈ యాత్ర 'పవిత్రత' లేదా 'ధర్మబద్ధత'ను సమర్థిస్తూ తన హిందూ మత నిబద్ధతను హిందూత్వ మద్దతుదారులకు నొక్కి వక్కాణించేందుకు యోగి ప్రభుత్వం ఆరాటపడుతోంది. తత్కారణంగానే కన్వర్ యాత్ర మార్గంలోని ఆహార పదార్థాలను విక్రయించే ముస్లింల మూలంగా ఈ తీర్థయాత్ర మాన్యత అపవిత్రమవుతుందనే వాదనతో ధాబాలు, రెస్టారెంట్లు తమ యజమానుల, నిర్వాహకుల పేర్లను ప్రదర్శించాలని యోగి సర్కార్ ఆదేశించింది. అయితే ఈ వ్యూహాత్మక రాజకీయ నిర్ణయం రాజ్యాంగ నియమాలు, నిర్దేశాలను పూర్తిగా ఉపేక్షించింది, అగౌరవపరిచింది.

ఆదిత్యనాథ్, ఆయన హిందుత్వ సమూహం ఒక సత్యాన్ని విస్మరించింది. ఎన్నికలలో గెలిచేందుకు మెజారిటేరియన్ అస్తిత్వ రాజకీయాలు ఇంకెంత మాత్రం ఎన్నికలలో విజయానికి భరోసా కావని, కాబోవనే నిరూపిత వాస్తవాన్ని గుర్తించడంలో యోగి ఆదిత్యనాథ్ విఫలమయ్యారు. ఇటీవలి సార్వత్రక ఎన్నికలలో జరిగిందేమిటి? యోగి పాలనలో ఉన్న యూపీలో బీజేపీకి వ్యతిరేకంగా దళితులు, ముస్లింలు, యాదవ్‌లు ఓబీసీలు ఏకమయ్యారు. సమ్మిళిత పాలన నందించడలో బీజేపీ ప్రభుత్వం విఫలమవడం వల్లే కాదూ? కుల అస్తిత్వాలు మళ్లీ పదునెక్కుతున్నాయి, కీలకంగా పరిగణన పొందుతున్నాయి. యోగి సర్కార్ నిర్ణయంతో ఈ రోజు ముస్లిం విక్రేతల జీవనాధారాలు ప్రమాదంలో పడ్డాయి. మరి రేపు దళితుల, కింది స్థాయి ఓబీసీ వర్గాల వారి జీవనోపాధులకు అటువంటి గతి పట్టదని చెప్పగలిగేది ఎవరు? ఎన్ని చెప్పినా, ఏమి జరిగినా ఆహార 'శుచి', 'అస్పృశ్యత' అనేవి శతాబ్దాలుగా హిందూ సమాజంలో కుల వివక్షలో నిర్ణయాత్మకంగా ఉన్నాయి. మరి ఏ ప్రగతిశీల ప్రజాస్వామ్య ప్రభుత్వమైనా గతించిన యుగాలలో హిందువుల జీవన విధానాన్ని కట్టడి చేసిన ఆ పక్షపాతాలను పునరుద్ధరించడానికి బదులు మనసా వాచా కర్మణా సమతా భావనలు వర్ధిల్లే భవిష్యత్తు నిర్మాణానికి పూనుకోవాలి. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' (అందరితో కలిసి అందరికీ అభివృద్ధి) అన్న ఆదర్శం ఆహార రాజకీయాలపై మతతత్వ సంకేతాత్మక సందేశాలు, సూత్రీకరణలకు ఆస్కారమివ్వదు.

తాజా కలం: ఉత్తరప్రదేశ్‌లోని ఒక హైవేలో 'మున్నా కిచెన్' అనే ఒక రెస్టారెంట్ ఉన్నది. మున్నా అనేది వాస్తవంగా ఆ హోటల్ యజమాని మహమ్మద్ ఖాన్ ముద్దు పేరు. ఆయన హోటల్‌లో పని చేసే నలభీముల్లో ఒకరు యాదవ్ కులస్థుడు. భారతీయతలో మనలను సమ్మిళితపరిచే అద్భుతమది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రాజ్యాంగంపై 'కుడి ఎడమల' దాడి!

రాజ్యాంగ రచనా కాలం నుంచీ రాజ్యాంగంపై దాడి కొనసాగుతున్నదే. తాము కాంక్షించిన మతరాజ్యాన్ని అంగీకరించనందుకు ఈ రాజ్యాంగాన్ని మేము వ్యతిరేకిస్తున్నాం అని రైట్ వింగ్ ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు ఆనాడే ప్రకటించారు. అనంతర కాలంలో 'ఈ రాజ్యాంగం పేదలను అణచిపెట్టేందుకు రాసినది' అని ఆధిపత్య కుల నాయకత్వంలోని లెఫ్ట్ వింగ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ విప్లవ సంస్థలు ప్రకటించాయి. గతంలో పాలన సాగించిన కాంగ్రెస్ తదితర పార్టీలు రాజ్యాంగ లక్ష్యాలను పూర్తిస్థాయిలో నెరవేరనీయకుండా కాలయాపన చేస్తూ వచ్చాయి. ప్రస్తుతం బీజేపీ రాజ్యాంగబద్ధంగా ఎన్నికై రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటించింది. విప్లవ రచయితల సంఘం 29వ రాష్ట్ర మహాసభలలో 'రాజ్యాంగ వాదం' పేరుతో రాజ్యాంగంపై దాడికి దిగింది. లెఫ్ట్ రైట్‌ల ఉమ్మడి కార్యాచరణగా కొనసాగుతున్న ఈ రాజ్యాంగ రద్దు లక్ష్యాన్ని పౌర సమాజం తమ ఓటు హక్కుతో కొంతమేర కట్టడి చేయగలిగింది. ఇటీవలి ఎన్నికల్లో మతతత్వ ఎజెండా పట్ల ప్రజా వ్యతిరేకత వ్యక్తం కావడంతో 'రాజ్యాంగ రద్దు' బాధ్యతను ఇప్పుడు ఎర్రజెండా స్వీకరించినట్లుగా స్పష్టమవుతుంది. ఈ క్రమంలోనిదే బి.ఆర్. బాపూజీ 'అందరూ రాజ్యాంగ రక్షకులే కానీ...' వ్యాసం (ఆంధ్రజ్యోతి -12.7.2024). రాజ్యాంగం ముంగిట స్మృతుల ఆచరణ కొనసాగిస్తున్న వ్యవస్థలు పరిఢవిల్లుతున్న దశలో శ్రామిక ప్రజల ప్రయోజనాల వంకన వాస్తవ స్పృహ లేకుండా సాగిన వ్యాసమిది.



> ఇటీవలి ఎన్నికల్లో మతతత్వ ఎజెండా పట్ల ప్రజా వ్యతిరేకత వ్యక్తం కావడంతో 'రాజ్యాంగ రద్దు' బాధ్యతను ఇప్పుడు ఎర్రజెండా స్వీకరించినట్లుగా స్పష్టమవుతోంది. రాజ్యాంగ వైఫల్యానికి అసలు కారణాలేమిటో అన్వేషించకుండా, కనిపించినా చూడకుండా రాజ్యాంగ రచయితే లక్ష్యంగా బి.ఆర్. బాపూజీ వ్యాసం కొనసాగింది.

ఈ రచయిత రాజ్యాంగ సభ్యుల ఎన్నికల నుంచి మొదలుపెట్టి రాజ్యాంగంలోని కొన్ని ఆర్టికల్స్‌ను ఉటంకిస్తూ రాజ్యాంగ రచయితను ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగ స్వభావాన్ని శ్రామిక వర్గ దృక్పథంతో అంచనా వేయాలని కోరుతున్నారు. అలాగే సంస్కరణతో సమయం వృథా చేయకూడదని తక్షణ రాజ్యాంగ రద్దుకు తొందరపడుతున్నారు. ఆ తీవ్రకాంక్ష ఆయన అక్షరాక్షరానా వ్యక్తం అయింది.

అంబేడ్కర్ అసలు రాజ్యాంగం అంతా ఆయన పాల్గొన్న రౌండ్ టేబుల్ సమావేశాల్లోను, ఆయన రాసిన 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' పుస్తకంలోను రాజ్యాంగ రచనకు ముందే వ్యక్తమైంది. అది గమనంలో ఉంటే అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తి ప్రస్ఫుటంగా ఎవరికైనా అర్థమవుతుంది. ప్రస్తుత రాజ్యాంగం అంతా రచయితగా అంబేడ్కర్ కాంక్షించినదేమీ కాదన్నది, ఆయన అభిప్రాయాలకు విరుద్ధమైనవి కూడా అందులో చోటుచేసుకున్నాయన్నదీ చారిత్రక వాస్తవం. దీనికి ఇప్పటికీ 'కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ డిబేట్స్ వాల్యూములు' తిరుగులేని సాక్ష్యాలు. రాజ్యాంగ రూపకల్పనలో గల కీలక కాంశాలను, అందులో వ్యక్తుల పాత్రను అవి పట్టి చూపుతున్నాయి. అంబేడ్కర్ కోరుకున్న రాజ్యాంగ రచనకు సహకరించనివారు ఎవరో, అందులోని ప్రగతికారకమైన అంశాలను తొలగించేందుకు ప్రయత్నించినవారు ఎవరో అవి ఆధారాలతో సహా పట్టిస్తున్నాయి. రాజ్యాంగ సభలో మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు మాత్రమే రాజ్యాంగంగా రూపొందిందనే వాస్తవం తెలిసినప్పటికీ వ్యాసకర్త బాపూజీ కేవలం రాజ్యాంగ రచయితపైనే దోషమంతా నెట్టే పనికి పూనుకున్నారు.

'భూమిని ఇతర కీలక పరిశ్రమలని జాతీయం చేయాలని, భూమిని అభివృద్ధి చేసి ప్రభుత్వమే సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా నిర్వహించాలని' అంబేడ్కర్ కోరుకున్నారు. 'ఏ ప్రభుత్వమైనా నిజాయితీగా రాజకీయంగా సామాజికంగా సమానత్వాన్ని సాధించాలనుకుంటే దాని ఆర్థిక విధానం సోషలిస్టు ఆర్థిక విధానం కాకపోతే ఎలా సాధ్యం' అని పండిట్ నెహ్రూను సైతం ప్రశ్నించేందుకు అంబేడ్కర్ వెనుకాడలేదు. రాజ్యాంగంలో స్టేట్ సోషలిజం చోటు చేసుకోకుండా మెజారిటీ సభ్యులు అడ్డుకున్నారు. అంబేడ్కర్ తీవ్రంగా వ్యతిరేకించిన ఆస్తి హక్కు ఆర్టికల్ 31గా రాజ్యాంగంలో చేర్చి మొత్తం అంబేడ్కర్ రాజ్యాంగ రచనా స్ఫూర్తినే దెబ్బ తీశారు. ఈ విషయంలో తన ఆవేదనను అంబేడ్కర్ 1955 మార్చి 19న రాజ్యసభలో చేసిన ప్రసంగంలో వ్యక్తం చేసారు. 'ఆర్టికల్ 31 పరమ వికృతమైన అంశం. దాని వంక చూడడమే నాకు పరమ అసహ్యం' అని ఆయన పేర్కొన్నారు. కానీ రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ పాత్రను, రాజ్యాంగ విశ్వసనీయతను ఏకకాలంలో దెబ్బతీయటం ద్వారా ఇప్పటికీ రాజ్యాంగ పరిరక్షణ కర్తవ్యాన్ని మోస్తున్న వర్గాలను ఆ కృషి నుంచి సడలిపోయేలా చేయడమే బాపూజీ ఏకైక లక్ష్యంగా కనిపిస్తున్నది.

అంబేడ్కర్ బ్రతికినంత కాలం తీవ్రంగా నిరసించిన ప్రైవేటు ఆస్తిహక్కును నిర్మూలించడం కోసం ఏ రకమైన కృషీ చేయని ఈ వామపక్ష వాదులకు భారత రాజ్యాంగంలో నాటి నుండి నేటికీ ఒక్కటంటే ఒక్క విషయం కూడా శ్రామిక ప్రజలకు పనికొచ్చే అంశం కనిపించకపోవటానికీ, రాజ్యాంగాన్ని ఏక మొత్తంగా తృణీకరించి దాని రద్దును ఇంతగా కాంక్షించటానికీ కారణాలు స్పష్టమే. లెఫ్ట్ రైట్‌లు రెండూ వేర్వేరు అంశాలుగా కనిపించే ఆధిపత్య కుల కవలలు కావటమే అసలు కారణం. నాలుగు కనులు – ఒకే ఒక దుస్వప్నం.

నాటి రాజ్యాంగ పరిషత్ సభ్యులు భారత ప్రజలంతా ఓట్లు వేసి ఎన్నుకున్నవాళ్లు కానప్పటికీ పరిమితంగానైనా ఈ దేశ ప్రజలకు ఈ రోజు అందుతున్న హక్కులకు నాటి సభ్యుల అంగీకారమే ఏదో మేర కారణం. ప్రజాప్రతినిధులు ఇన్ని సంవత్సరాలలో ఆ రాజ్యాంగాన్ని ఏ మేరకు అమలు చేయగలిగారో రచయిత పరిశీలించినట్లు కనిపించదు. ఎస్సీ ఎస్టీ కేసులలో నిందితులు శిక్షించబడకపోవడానికి ఈ రాజ్యాంగమే కారణమని, ఈ చట్టాలతో ఏ ప్రయోజనమూ లేదనే వింత వాదన చేసారు వ్యాసకర్త. పాలకులు ప్రభుత్వ యంత్రాంగాలు నిందితుల పక్షాన నిలిచిన కారణంగా జరిగే అన్యాయానికి కూడా రాజ్యాంగ రచయితలే కారణమని చెప్పబోవడం వాస్తవ విస్మరణ.

'రాజ్యాంగం అంటే పెత్తనం చెలాయించే సాధనం కాదని అది కేవలం సమాజంలో అసమానతలను చట్టబద్ధంగా తొలగించి నవ జీవనాన్ని క్రమ పద్ధతులలో నడిపే ఒక మార్గదర్శిగా ఉండాలని' అంబేడ్కర్ కోరుకోవడాన్ని గ్రహించాలి. రాజ్యాంగ రూపకర్తలకు అవకాశం దొరకక వదిలిన ఖాళీలను వర్తమాన తరాలు పూరించుకోవాలి. అలాగే ప్రతికూల అంశాలను తొలగించుకునేందుకు రాజ్యాంగమే ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఉన్న రాజ్యాంగ హక్కుల పరిరక్షణకే శతాబ్దాల కాలం సరిపోకపోతే మరింత మెరుగైన కృషికి ఆస్కారమెక్కడ. అటువంటి వాస్తవిక దృష్టి ఏమీ లేకుండా నిర్మాణాత్మక వైఖరిని విస్మరించి రాజ్యాంగ రద్దును ఆది నుండీ జపించే లెఫ్ట్ రైట్ దళాల రాజ్యాంగ ద్వేషం అంతిమ లక్ష్యం ఏమిటి?

వీరు నినదించిన మరో ప్రపంచం అగ్రజులను అగ్రనాయకులుగా మార్చి పీడిత కులాలకు రమణీయ మరణాన్ని మిగిల్చాక ఇప్పుడు మరలా శ్రామికుల పేరిట నూతన రాజ్యాంగాన్ని వాగ్దానం చేస్తున్నారు. ఈ కుట్రలను గ్రహించలేని దశను భారతీయ దళిత, పౌర సమాజం ఎప్పుడో దాటిపోయిందని వ్యాస రచయిత గ్రహించాలి!

● బడుగు భాస్కర్ జోగేష్
న్యాయవాది

'సామాజిక చలనం – ప్రజాస్వామిక ప్రతిస్పందన' సభ

పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో జూలై 27 శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమురయ్య హాల్‌లో 'సామాజిక చలనం– ప్రజాస్వామిక ప్రతిస్పందన' ఆరు పుస్తకాల పరిచయం, ఆవిష్కరణ సభ జరుగుతుంది. కెసి వెంకటేశ్వర్లు ఆహ్వానం పలుకుతారు, రాజేంద్రబాబు అర్విణి సభకు అధ్యక్షత వహిస్తారు, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ఆవిష్కర్త. కె. శ్రీనివాస్, ఎన్.వేణుగోపాల్, ప్రొ. కె. లక్ష్మీనారాయణ, డా. వనమాల, ప్రొ. జి.హరగోపాల్, పి. స్వామి, ఎం. రాఘవాచారి పాల్గొంటారు.

– పాలమూరు అధ్యయన వేదిక

రుణమాఫీ చారిత్రాత్మకం

తెలంగాణ రైతాంగానికి రెండు లక్షల రూపాయలు రుణ మాఫీ చేయడం ఒక గొప్ప చారిత్రాత్మక విషయం, యావత్ భారతదేశం గర్వించదగిన సందర్భం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతు రాజ్యాన్ని స్థాపించే క్రమంలో రుణమాఫీ చేయడంతో రైతులందరూ హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉత్సాహంతో పంట సాగు విస్తీర్ణాన్ని పెంచే క్రమంలో ముందుకు పోతున్నారు. ఈ విషయంలో పార్టీల కతీతంగా అందరూ రుణమాఫీ పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞత తెలియజేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం రైతుల పరిస్థితి చాలా దీనాతిదీనంగా ఉంది. పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించక, అకాల వర్షాలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయి అనేక మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ స్థితిలో రైతుకు భరోసాగా ప్రభుత్వం నిలబడడం ఆనందదాయకం. ప్రపంచమంతా ఐటి, కంప్యూటర్ యుగం వైపు మరలుతున్న తరుణంలో ప్రపంచానికి అన్నం పెట్టే రైతును ఆదుకోవాలని సంకల్పం కలిగిన ప్రభుత్వాన్ని పదికాలాలు నిలుపుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది.

– ఎండి మక్బూల్, రంగాపూర్

హైదరాబాద్‌కు కొండంత అండ 'హైడ్రా'!

ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములు ఏ విధంగానైతే అన్యాక్రాంతమయ్యాయో, స్వరాష్ట్రంలో దానికి రెట్టింపు భూ విధ్వంసం జరిగింది. ఆనాటి గొలుసుకట్టు చెరువులు చాలా మాయం చేసి, కొండలు, గుట్టలను పిండి చేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండే వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖ నుంచి దూరం చేయడంతో కబ్జాలకు ప్రభుత్వమే ఉసిగొలిపినట్టయ్యింది. అధికారం అండతో జీఓ59 ముసుగులో భూములను రక్షించాల్సినవారే దొరికినకాడికి నాకేసిన పరిస్థితి. ఈ నేపథ్యంలో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో జరిగిన భూ విధ్వంసంపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త ఆలోచన చేసి, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అనే ఓ ప్రత్యేక విభాగాన్నే ఏర్పాటు చేశారు. కమిషనర్‌గా ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) స్థాయి సీనియర్ పోలీస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను నియమించారు. బడ్జెట్‌లో 'హైడ్రా'కు 200 కోట్ల రూపాయల కేటాయింపు ప్రభుత్వ సంకల్పశుద్ధికి నిదర్శనం.

జీహెచ్ఎంసీ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరించేందుకు సీఎం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నందున, జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ వరకు ఉన్న ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి రానున్నాయి. సుమారు 2 వేల చదరపు కిలోమీటర్లు, 27 మునిసిపాలిటీలు, 33 పంచాయతీలను కలుపుకొని స్వయం ప్రతిపత్తితో ఉండేలా హైడ్రాను అందుబాటులోకి తెచ్చారు. జీహెచ్ఎంసీతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని ఔటర్ రింగురోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా పేర్కొంటూ ప్రభుత్వం ఆ ప్రాంతం వరకు విపత్తు నిర్వహణ, తదితర అధికారాలతో హైడ్రాను ఏర్పాటు చేసింది. చెరువుల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, ప్రభుత్వ స్థలాల పరిరక్షించడం, అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో ప్రధాన భూమికను పోషించనుంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు విపత్తుల నిర్వహణలోనూ అది కీలకం.

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో వేలాది ఎకరాల ప్రభుత్వ, చెరువు, వక్ఫ్, దేవాదాయశాఖ, పార్కులు, ఇనాం భూములు కబ్జాదారుల చెరల్లో ఉన్న విషయం తెలిసిందే. గత కొన్నేళ్లుగా ఈ ఆక్రమణలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇంకా చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు కబ్జాల పాలవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కబ్జాదారుల బారి నుంచి సర్కారు భూములకు విముక్తి కల్పించడంతోపాటు ఇకముందు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం కోసం సరికొత్తగా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను అందుబాటులోకి తెచ్చింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, ఇతర విభాగాల నుంచి ప్రత్యేక బృందాలు ఈ విభాగంలో పని చేస్తాయి. తెలంగాణ గొలుసుకట్టు చెరువులకు నెలవు. హైదరాబాద్‌లో సుమారు 2వేలకు పైగానే ఒకప్పుడు చెరువులు ఉండేవి. తుమ్మలకుంట, చింతలకుంట, పుప్పలకుంట, కూర్మచెరువు, గొల్లవానికుంట, బొంగలకుంట, క్వారీకుంట, భజన్ సాహికుంట, అంజయ్య చెరువు, సుదర్శన్ చెరువు, షాన్‌కీసమున కుంట ఇలా ఎన్నెన్నో చెరువులు నామరూపం లేకుండా మాయం అయ్యాయి. మిగిలిన చాలా చెరువులు కబ్జాలకు గురయ్యాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో రాత్రికి రాత్రే మట్టిపోస్తూ చెరువులను నామరూపం లేకుండా పూడ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటల కబ్జాలపై వచ్చే ఫిర్యాదుల మీద హైడ్రా తక్షణమే స్పందిస్తుంది. క్షేత్ర స్థాయిలో బృందాలు ఆక్రమణలను గుర్తిస్తాయి, కూల్చివేతలు చేపడతారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువుల ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్‌లో నిర్మించిన ఎలాంటి నిర్మాణాలైనా కూల్చివేస్తారు. హైదరాబాద్ నగరంలో శాటిలైట్ ఉపగ్రహ ఛాయాచిత్రాలతో ప్రభుత్వ రికార్డులను ఆధారంగా చేసుకొని హైడ్రా అధికారులు నీటిపారుదల, రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి సర్వే చేసి ఆక్రమిత భూముల వివరాలను వెలికితీసి, అక్రమ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనుమతి లేకుండా నిర్మించినా, అనుమతికి మించి అదనపు అంతస్తుల నిర్మాణం చేపట్టినా నోటీసులిచ్చి కూల్చివేయనున్నారు. అనుమతుల జారీలో అక్రమాలు జరిగినా అధికారులను బాధ్యులను చేసే అధికారం కూడా హైడ్రాకు ఉంది.

> జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని వేలాది ఎకరాల ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ, ఇనాం భూములు, చెరువులు కబ్జాదారుల చెరలో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మరిన్ని చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాల పాలవుతూనే ఉన్నాయి. సర్కారు భూములకు చెరనుంచి విముక్తి కల్పించడంతోపాటు ఇకముందు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం కోసం 'హైడ్రా' ఏర్పడింది.



నాలాల పూడికతీత, వరద నిర్వహణ, రోడ్ల నిర్మాణం, మరమ్మతు వంటి పనులనూ విజిలెన్స్ అధికారులు పరిశీలిస్తారు. పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తారు. తదనుగుణంగా సంబంధిత అధికారులపై చర్యలుంటాయి. వాటర్ బోర్డు చేపట్టే పనులపైనా హైడ్రా పరిశీలన ఉంటుంది. నగరంతో పాటు నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేలా పోలీసులతో సమన్వయం చేసుకుంటారు. ప్రధాన రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లపై శాశ్వత ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు. వరద నిర్వహణకు జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బృందాల పని తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించనున్నారు. ఇంతే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఉండే భారీ హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణలోనూ ఈ విభాగం సేవలందిస్తుంది. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.

హైడ్రా పాలక మండలికి సీఎం రేవంత్‌రెడ్డి ఛైర్మన్, అఖిల భారత సర్వీసుకు చెందిన కార్యదర్శి లేదా అంతకు మించి హోదా కలిగిన అధికారి కమిషనర్‌గా ఉంటారు. మున్సిపల్ శాఖ మంత్రి, రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మంత్రి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు, జీహెచ్ఎంసీ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐసీసీసీ అధిపతి, హైడ్రా కమిషనర్ సభ్యులుగా ఉంటారు. ఇదే కాకుండా టీసీయూఆర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సబ్ కమిటీకి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా, వివిధ విభాగాల అధికారులతో 14 మంది సభ్యులుగా ఉంటారు. ఈ సబ్ కమిటీ హైడ్రా పాలక మండలికి పాలసీల్లో, ప్రణాళికల్లో, ఇతర అంశాలలో సహకారం అందిస్తోంది. హైడ్రాకు ఏటా నిర్దిష్టమైన బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి. ఇదే కాకుండా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, టీజీఎస్‌పీడీసీఎల్, వాటర్ వర్క్స్, ఎంఆర్‌డీసీఎల్, హెచ్‌జీసీఎల్ లాంటి సంస్థల నుంచి రుసుముల ద్వారా నిధులు వినియోగిస్తారు. హైడ్రా ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పోలీసుస్టేషన్ కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, సర్వేయింగ్, టౌన్ ప్లానింగ్, అటవీ, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్‌పై హైడ్రాకు రానున్నారు. ఇలా, నిర్దిష్టమైన బృహత్ లక్ష్యాలతో ఆవిర్భవించిన 'హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (హైడ్రా)' చరిత్రలో నిలిచిపోనుంది.

■ డా. ఎన్.యాదగిరిరావు
అదనపు కమిషనర్, జీహెచ్ఎంసీ

కొంత మోదం.. కొంత ఖేదం..




- వివిధ పద్దుల కింద కేటాయిస్తూ ప్రకటన
- నీటి పారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- మెగాటెక్స్‌టైల్ పార్క్‌కు మొండి చేయి
- ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు శూన్యం
- ఊసులేని కొత్త సెంట్రల్ జైలు నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం
- స్మార్ట్‌సిటీ పనులకు మ్యాచింగ్ గ్రాంట్
- ఎకో టూరిజంగా పాకాల, ఏటూరునాగారం
- మేడారం జాతర పనులకు నిధులు

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు రూ.2,595.53 కోట్లు

హనుమకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేసిన కేటాయింపులు చూస్తే కొంత మోదం.. కొంత ఖేదం అన్నట్టుగా ఉందని జిల్లావాసులు అభిప్రాయ పడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, ముఖ్యంగా ఎత్తిపోతల పథకాలకు ఎక్కువ నిధులను కేటాయించిన ప్రభుత్వం.. ఎంతో కీలకమైన మెగాటెక్స్‌టైల్‌పార్క్, కాళోజీ కళాక్షేత్రం, ఆసుపత్రుల అభివృద్ధి, సెంట్రల్‌జైల్ నిర్మాణం, వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం లాంటి వాటిని పట్టించుకోలేదన్న చర్చ జరుగు తోంది. నీటిపారుదలతో పాటు వివిధ పద్దుల కింద ఉమ్మడి జిల్లాకు మొత్తంగా రూ.2595.53 కోట్లను నిర్దేశించారు. గత ఆర్థిక సంవత్సరం 2023-24 కన్నా సుమారు రూ.350కోట్లు ఎక్కువని తెలుస్తోంది. ఎత్తిపోతల పథకాలైన కాళేశ్వరం, దేవాదుల, ఎస్ఆర్ ఎస్‌లకు రూ. 2376.55కోట్లు, ఇతరత్రా పద్దుల కింద రూ.218.97 కోట్లను కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం నాణ్యత విషయంలో వివాదం నడుస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణ, ఇతరత్రా ఖర్చులకు గాను రూ.1676.46 కోట్లను కేటా యించగా.. గత బడ్జెట్ కన్నా ఈ సారి రూ.50కోట్లు ఎక్కువగానే ఇచ్చారు. దీంతో పాటు కాకతీయ విశ్వవిద్యాలయం, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ, వరంగల్ మహానగర పాలక సంస్థ, వరంగల్ స్మార్ట్ సిటీ, మేడారం తదితర వాటికి బడ్జెట్‌లో నిధులను ఇస్తున్నట్టు ప్రస్తావించారు. అయితే బడ్జెట్‌లో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మెగాటెక్స్‌టైల్ పార్క్, వరంగల్ సెంట్రల్ జైల్ నిర్మాణం ఊసేలేదు.

సీఎం పరిశీలించి వెళ్లినా..

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో భాగంగా మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శించి.. పార్క్ సత్వర పూర్తికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాత సెంట్రల్ జైలు స్థానంలో నిర్మిస్తున్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి నిధుల అంశం కూడా బడ్జెట్‌లో కానరాలేదు. సీఎం రేవంత్ నగర పర్యటనలో భాగంగా దీనిని కూడా సందర్శించారు. అయితే దీని నిర్మాణ అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలోనే ఈ ఆస్పత్రికి నిధులను కేటా యించి ఉండకపోవచ్చునన్న చర్చ జరుగుతోంది. కేఎంసీలో ఆవరణలో ఇటీవల నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి,



3.70 లక్షల మంది రైతులకు భరోసా

రైతు భరోసా అమలుపై శాసన సభలో మరోసారి ప్రభుత్వం ప్రకటన చేసింది. బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు ఏటా ఎకరానికి రూ. 15000 చెల్లించాలన్నది తమ సంకల్పమని, దీనిపై శాసనసభలో చర్చించి విధి విధానాలను ఖరారు చేసిన తర్వాత అమలు చేస్తామని స్పష్టం చేసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా ఉమ్మడి జిల్లాలో సుమారు 3.70లక్షల మంది రైతు భరోసా అందుకోనున్నారు. అలాగే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడం పట్ల అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

వరంగల్ ఎంజీఎం, కాళోజీ కళాక్షేత్రం, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)ను పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని స్మార్ట్ సిటీ పథకానికి బడ్జెట్‌లో మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చిన ప్రభుత్వం అసంపూర్తిగా మిగిలిపో యిన స్మార్ట్ సిటీ పనుల పూర్తికి రూ 156.22 కోట్లను ఇచ్చింది. మిగిలిపోయిన జాతర పనులకు రూ.52.95 కోట్లను నిర్దేశించింది. నగరంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన నియో మెట్రోరైల్ ప్రాజెక్టు అంశం పేర్కొన్నప్పటికీ నిధులపై స్పష్టత ఇవ్వలేదు. లెదర్ పార్క్, వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు గురించి పేర్కొన లేదు. మహబూబాబాద్‌లో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జనగామ కల్లెంలో టెక్స్‌టైల పార్క్, కొడకం డ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్, ములుగు జిల్లాలో బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, రామప్ప గుడి అభివృద్ధి, భూపాలపల్లిలో మైనింగ్ విద్యాలయం తదితర అంశాలకు బడ్జెట్‌లో చోటు దక్కలేదు.

12 చిన్న తరహా పారిశ్రామిక పార్కులకు అవకాశం

మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ ప్రత్యేక చిన్నతరహా పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో ఈ తరహా పార్కులు 12 వరకు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.



వ్యవసాయ కూలీలకూ ఆర్థిక సాయం

భూమిలేని నిరుపేద రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ప్రకటించగా ఉమ్మడి జిల్లాలో సుమారు 3.20లక్షల మంది రైతు కూలీలకు ప్రయోజనం చేకూరనుంది.

ఎకో టూరిజంగా పాకాల, ఏటూరునాగారం

ఎకో టూరిజాన్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పాకాల, ఏటూరునాగారంలను టూరిజం సర్క్యూట్లుగా గుర్తించినట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో గుర్తించిన ఏడు అటవీ ప్రాంతాల్లో ఈ రెండు ఉన్నాయి. పాకాల, ఏటూరునాగారం అటవీ ప్రాంతాలను ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈ రెండు ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి.



నిధుల కేటాయింపు ఇలా.. (అంచనా)

కాళేశ్వరం ప్రాజెక్టు :	రూ.1676.46 కోట్లు
ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 1:	రూ.140.00 కోట్లు
దేవాదుల (జీఎల్ఎస్):	రూ.20.04 కోట్లు
కంతనపల్లి (జీఎఎల్ఎస్):	రూ.20.00 కోట్లు
చిన్న కాళేశ్వరం:	రూ.200.00 కోట్లు
కంతనపల్లి ప్రాజెక్టు (నిర్వహణ):	రూ.30,05 కోట్లు
దేవాదుల (ఏబీపీ) ప్రాజెక్టు:	రూ.43.50 కోట్లు
ఎస్ఆర్ఎస్పి స్టేజ్ 2 (ఏబీపీ) :	రూ.25.00 కోట్లు
దేవాదుల (ఏబీపీ) :	రూ.14.50 కోట్లు
ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 (ఏబీపీ) :	రూ.9.00 కోట్లు
పాకాల సరస్సు (జీఎల్ఐఎస్):	రూ.5.00 కోట్లు
రామప్ప సరస్సు (జీఎల్ఐఎస్) :	రూ.5.00 కోట్లు
మల్లూరు వాగు (ఎస్ఆర్ఎస్పీ-1):	రూ.1.00 కోట్లు
వట్టివాగు (ఎస్ఆర్ఎస్పి -1):	రూ.25.90 కోట్లు
లక్నవరం (జీఎల్ఐఎస్):	రూ.2.00 కోట్లు
ఘనపూర్ సిస్టం (ఫతేపూర్-పాపన్నపేట కాలువ):	రూ.57.00 కోట్లు
ఎల్‌టీ బయ్యారం:	రూ.1.00 కోట్లు
వరంగల్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్స్:	రూ.16.53 కోట్లు
కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ:	రూ.2.00 కోట్లు
వరంగల్ కార్పొరేషన్:	రూ.50.00 కోట్లు
వరంగల్ స్మార్ట్ సిటీ (మ్యాచింగ్ గ్రాంట్):	రూ.14.34 కోట్లు
వరంగల్ స్మార్ట్ సిటీ పనులు:	రూ.15.60 కోట్లు
మేడారం జాతర మిగులు పనులు:	రూ.52.95 కోట్లు
వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో భవనాలు:	రూ.10.00 కోట్లు

ప్రతిష్ఠాత్మకంగా ఆరు గ్యారంటీల అమలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు బడ్జెట్‌లో అధిక మొత్తంలో నిధులను కేటాయించారు. ఈ పథకాలతో ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6.47లక్షల మంది ప్రయోజనం పొందుతున్నారు. ఇక ప్రతీ నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని ప్రకటించిన క్రమంలో ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను 43వేల పైచిలుకు ఇళ్ల నిర్మాణం జరుగనున్నది. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నారు.

కేయూకు మహర్దశ



విశ్వవిద్యాలయాలకు త్వరలోనే పూర్తికాలపు వైస్‌చాన్సలర్‌ను నియమిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో సదుపాయాల కల్పనకు రూ.500కోట్లను ప్రతిపాదించారు. ఇందులో రూ.100 కోట్లు ఓయూకు, మరో రూ.100 కోట్లు మహిళా వర్సిటీకి కేటాయించారు. మిగతా నిధులు కాకతీయ విశ్వవిద్యాలయానికి, ఇతర వర్సిటీలకు ఖర్చు చేస్తారు. ఈ లెక్కన మిగిలిన నిధుల్లో సుమారు రూ.50కోట్ల నుంచి రూ.75కోట్ల వరకు కాకతీయ వర్సిటీకి వచ్చే అవకాశమున్నట్టు అంచనా వేస్తున్నారు.

విధుల్లో చేరిన డీఈవో అబ్దుల్ హై

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 25: అనారోగ్య కారణాలతో కొన్ని రోజులుగా సెలవులో ఉన్న హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై గురువారం విధుల్లో చేరారు. ఆయన ఆరోగ్యం కుదుట పడటంతో హనుమకొండలోని డీఈవో కార్యాయంలో తిరిగి బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యాలయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సిబ్బంది సమయపాలన పాటించాలని, వారికి కేటాయించిన విధులను నిర్లక్ష్యం లేకుండా నిర్వర్తించాలని సూచించారు. నిబంధనల మేరకు విధులు నిర్వర్తించకపోతే సిబ్బంది చర్యలు తీసు కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పనుల కోసం వచ్చే ఉపాధ్యాయులతో మర్యాదగా, హుందాగా ప్రవర్తించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ విధులు సక్రమంగా నిర్వర్తించాలని అబ్దుల్ హై సూచించారు.

చిట్టీ డబ్బులు ఇవ్వకుండా మోసం

- ప్రభుత్వ ఉపాధ్యాయురాలి అరెస్టు

వరంగల్ క్రైం, జూలై 25: చిట్టీల పేరుతో మోసం చేసిన కామ మాధవి అనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మాధవి తనతో చిట్టీ కట్టించుకుని డబ్బులు ఇవ్వడం లేదని బాధితుడు అమ్మ క్రిష్ణ (ప్రభుత్వ టీచర్) హసన్‌పర్తి పోలీసులకు పిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు.. గురువారం ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మాధవి, సహకరించిన ఆమె భర్త వెంకటేశ్‌ను అరెస్టు చేశారు. అరెస్టు వివరాలను సీఐ సురేష్ వెల్లడించారు. హనుమకొండ రాంనగర్‌లో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కామ మాధవి లక్ష్మీసాయి చిట్స్ పేరిట చిట్టీలు నడుపుతోంది. తోటి ఉపాధ్యాయులతో పాటు పలు వురితో చిట్టీలు వేయించుకుని గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. 2011 నుంచి 2021 వరకు హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి గ్రామంలో విధులు నిర్వహించినప్పుడు చిట్టీలు నడిపి పలువురిని మోసం చేసింది. ప్రస్తుతం కామ మాధవి దామెర పాఠశాలలో విధులు నిర్వర్తిస్తోంది. కాగా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేసి మాధవిని, ఆమె భర్త వెం కటేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న హసన్‌పర్తి పోలీసులు

కాసుల కోసం సబ్‌రిజిస్ట్రార్ కక్కుర్తి

- రిజిస్ట్రేషన్ కోసం రూ.80వేల లంచం డిమాండ్
- వలపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు

పరకాల, జూలై 25: భూమిని కుమారుల పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలనుకున్న దంపతుల నుంచి లంచం డిమాండ్ చేసిన పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత ఏసీబీకి చిక్కారు. అధికారుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల మునిసిపాలిటీ పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన లడే రాజేశ్వర్‌రావు, సాంబలక్ష్మీ దంపతు లకు చెందిన 1,173 గజాల భూమిని వారసత్వంగా తమ ఇద్దరు కుమారులు లడే శ్రీనివాస్, లడే శ్రీకాంత్‌లకు చెరిసగం గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ఈ నెల మొదటివారంలో పరకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయం సమీపంలో ఉండే డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేశ్‌ను సంప్రదిం చగా సబ్‌రిజిస్ట్రార్‌ను అడిగి చెబుతానని వెళ్లి అనంతరం రూ.80వేలు ఇస్తే రిజిస్ట్రేషన్ జరుగుతు ందని చెప్పారు. ఈ విషయంపై శ్రీనివాస్, శ్రీకాంత్ నేరుగా సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లి



ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ సునీత



పలుమార్లు తమ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని కోరినప్పటికీ నరేశ్‌ను వెళ్లి కలవడంటూ దాటవేసేవారు. అంతే కాకుండా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సైతం ఈ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించినప్పటికీ చేస్తానని కాలయాపన చేశారు. దీంతో విసిగి వేసారిన శ్రీనివాస్, శ్రీకాంత్ ఈనెల 22న ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఏసీబీ అధికారుల సూచనల మేరకు వారు లంచం ఇస్తామంటూ ఒప్పందం కుదుర్చుకుని రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆ స్లాట్ ప్రకారం గురువారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా.. ఈ క్రమంలో లంచంగా ఇస్తామని చెప్పిన రూ.80వేలను డాక్యుమెంట్ రైటర్ నరేశ్‌కు ఇచ్చారు. వెంటనే నరేశ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని విచారించగా సబ్‌రిజిస్ట్రార్ ఆదేశాలతో లంచం తీసుకున్నట్లు ఒప్పుకోవడంతో వెంటనే సబ్‌రిజిస్ట్రార్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు.

ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకున్నట్లయితే 1064 లేదా 91543 88912కు కాల్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐలు శ్యాం, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

ప్రభుత్వాస్పత్రుల్లో వార్డులకు నెంబర్లు ఏర్పాటు చేయాలి

- రోగుల వివరాలు బోర్డులపై ప్రదర్శించాలి
- సూపరింటెండెంట్లతో సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూలై 25: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఉన్న వార్డులకు, పడకలకు వారం రోజులలోగా నెంబర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబం ధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై గురువారం కలెక్టర్.. సూపరింటె ండెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రు ల్లోని రోగుల పేర్లు, ఏ వార్డులో ఉన్నారు? అనే వివరాలు ఆస్పత్రుల ముందు బోర్డులపై ప్రదర్శించాలన్నారు. ఆస్పత్రుల్లో తాగునీరు, శానిటేషన్, కరెంట్, ఆస్పత్రుల్లోని ఇతర అవసరాలకు ఉపయోగించే నీరు, జనరేటర్ల పని విధానం నమోదు చేసేందుకు రిజిస్టర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ రిజిస్టర్లలో టెక్నీషియన్‌లు, వీటి రిపేర్లు, ఇతర విషయాలను నమోదు చేయాలన్నారు. ఈ రిజిస్టర్‌లను వారంలో రెండుసార్లు తనిఖీచేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పరిధిలో ఏ జబ్బులు ఉన్నాయి? వాటి ఖర్చు వివరాలను తెలుపుతూ బుక్‌లెట్స్ తయారు చేసి వాటిని గ్రామపంచాయతీ ఆఫీసులలో, మునిసిపల్ వార్డులలో అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆస్పత్రుల అభివృద్ధి కోసం కావాల్సిన వస్తువుల జాబితా తయారుచేసి దాతలను, సంస్థలను గుర్తించి అవసరమైన వస్తువులను సేకరించాలన్నారు. ఆటోమేటిక్ జనరేటర్‌లను సమకూర్చుకోవాలని, అంబులెన్స్‌ల కోసం సీఎస్ఆర్ నిధుల కోసం ప్రయత్నించాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు సాయంగా కోఆర్డినేటర్లను నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, పరకాల ఆర్డీవో నారాయణ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు

ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సమావేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.



మంత్రి కొండా సురేఖ



దొంతి మాధవరెడ్డి



రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కేఆర్ నాగరాజు



నాయిని రాజేందర్ రెడ్డి


మరిపెడలోని కార్గిల్ విజయ స్తూపం

నేడు కార్గిల్ విజయ్ దివస్

హాజరుకానున్న అమర జవాన్ల కుటుంబాలు ● మరిపెడలో ఏర్పాట్లు పూర్తి

మరిపెడ, జూలై 25: విద్రోహశక్తుల నుంచి పొంచిఉన్న ముప్పును రాత్రనకా, పగలనకా ఎముకలు కొరికే చలిలో నిద్రాహారాలు లేకుండా దేశరక్షణ కోసం శత్రుమూకల కదలికలను పసిక డుతూ భారత్‌ను కాపాడడానికి వారి ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకొని సైనికులు రక్షిస్తున్నారు. శత్రుమూకల దొంగదెబ్బకు బలియైనోళ్లు ఎందరో ఉన్నారు. వారే మనవీర సైనికులు. పాకిస్తాన్-ఇండియాకు 1999-2001 మధ్య జరిగిన కార్గిల్ యుద్ధం ఈ తరం ప్రజలకు తెల్సిందే! ఈ అమరులైన జవాన్ల జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం ఏటా జూలై 26వ తేదీని కార్గిల్ విజయ్ దివస్‌గా ప్రకటించింది.

మరిపెడలో యుద్ధ వీరుల స్తూపం

కార్గిల్ యుద్ధవీరుల సంస్మరణార్థం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలో కార్గిల్ స్థూపాన్ని 'కార్గిల్ ట్రస్ట్' ద్వారా చిల్లంచర్లకు చెందిన గాదె రాంబాబు నిర్మించారు. ఆ యుద్ధంలో అమరుడైన వీరజవాన్ పద్మపాణి ఆచార్య తల్లి విమలాచార్య, అప్పటి మంత్రి రెడ్యానాయక్ 2004 జూలై 23న ఆవిష్కరించారు. నాటి నుంచి ఏటా కార్గిల్ విజయ్ దివస్‌ను మరిపెడలో నిర్వహిస్తున్నారు.

ఉమ్మడిజిల్లాకు చెందిన వీరులు వీరే..

కార్గిల్ యుద్ధంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదుగురు జవాన్లు వీరమరణం పొందారు. మరొకరు అంగవైకల్యంతో ఉన్నారు. వర్ధన్నపేట మండలం కరాడిగూడెంకు చెందిన పి.దేవేందర్‌రెడ్డి, కరీమాబాద్ వాసి మాడి శెట్టి సతీశ్, స్టేషన్‌ఘన్‌పూర్ చంద్రశేఖర్, డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన బానోత్ లచ్చిరాంనాయక్ వీర మరణం పొందగా, కాజీపేటకు చెందిన గాదె కశ్యప్‌రెడ్డి రెండు కాళ్లు పోగొట్టుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని కార్గిల్ స్థూపం దగ్గర శుక్రవారం కార్గిల్ విజయ్‌దివస్‌ను ఘనంగా నిర్వహించడానికి కార్గిల్ సోల్జర్స్ ట్రస్ట్ నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలకు ప్రజాప్రతి నిధులతో పాటు మాజీ సైనిక కుటుంబాలు, విద్యార్థులు, యువత పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'బైపాస్ సర్జరీ' ఉద్యోగి బదిలీ రద్దు

ఆంధ్రజ్యోతి కథనంతో బల్దియా అధికారుల్లో చలనం

ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్

వరంగల్ కార్పొరేషన్, జూలై 25: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన బదిలీలలో అధికారులు చేసిన డొల్లతనం బట్టబయలైంది. బల్దియా, ఆర్‌డీఎంఏ కార్యాలయంలో పని చేస్తున్న కొందరు అధికారులు ఒకరికి బదులు మరొకరిని, అందులో స్పౌజ్ అర్హతతో పాటు బైపాస్ సర్జరీ చేసుకున్న సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'బల్దియా బదిలీల్లో అవకతవకలు' అనే శీర్షికన వార్తాకథనం ప్రచురితమైంది. దీనిపై బల్దియా అధికారులతో పాటు హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ గౌతమ్ స్పందించినట్టు తెలిసింది. బల్దియా బదిలీలలో జరిగిన లొసుగులపై పూర్తి విచారణ చేపట్టి బాధితుడికి న్యాయం చేయాలని ఆదేశించినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో బల్దియా అధికారులు సీనియర్ అసిస్టెంట్లు ఎంత మంది బదిలీకి ఆప్షన్ పెట్టుకున్నారు? ఎవరు అర్హులు? ఎందుకు తప్పు జరిగింది? అని పునరాలోచించుకున్నట్టు తెలిసింది. అన్ని కోణాల్లో నుంచి సమాచారం సేకరించిన తర్వాత ఒక కొలిక్కి వచ్చారు. వరంగల్ బల్దియా కాశిబుగ్గ సర్కిల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఖమ్మం మున్సిపాలిటీకి బదిలీ చేయబడ్డ ఈసంపెల్లి ఇజ్రాయెల్ బదిలీ ఆర్డర్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే దరఖాస్తు చేసుకున్న 22 మంది సీనియర్ అసిస్టెంట్లలో బదిలీకి అర్హత జాబితాలో మొదటి పేరు గల బొట్ల రమేష్‌ను ఖమ్మంకు బదిలీ చేస్తూ ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇజ్రాయెల్‌ను కార్యాలయానికి పిలిపించి రిటైన్డ్ ఎట్ డబ్ల్యూఎంసీ ఆర్డర్ పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆంధ్రజ్యోతికి ఇజ్రాయెల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆప్షన్ పెట్టుకున్న ప్రకారమే బదిలీ

సీనియర్ అసిస్టెంట్లు పెట్టుకున్న ఆప్షన్ ప్రకారం బదిలీల పక్రియ జరిగిందని, బదిలీలలో అవకతవకలు జరగలేదని ఆర్‌డీఎంఏ కార్యాలయం సిబ్బంది వివరణ ఇచ్చారు. సీనియర్ అసిస్టెంట్ ఇజ్రాయెల్ జీడబ్ల్యూఎంసీ, నర్సంపేట, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెంకు వెళ్లేందుకు ప్రాధాన్యతను బట్టి దరఖాస్తు చేసుకున్నాడని, 4వ జోన్‌లో ముందు వరసలో బొట్ల రమేష్, జి.దేవరాజ్, ఇమ్మడి ఇజ్రాయెల్, ఎం.సుధాకర్ (ఖమ్మం) ఉద్యోగులు ఉన్నారన్నారు. వీరిలో ఆప్షన్‌లో పేర్కొన్న ప్రకారం బదిలీ చేశామన్నారు. అయితే ముందుగా కొత్తగూడెంలో పని చేస్తున్న సుధాకర్ అనే ఉద్యోగికి మహబూబాబాద్‌కు, ఇజ్రాయెల్‌ను ఖమ్మకు బదిలీ చేశామన్నారు. పైనుంచి ఆదేశాలు అందడంతో మొదటి స్థానంలో సీనియారిటీ ప్రకారం ఇజ్రాయెల్ బదిలీని రద్దు చేస్తూ బొట్ల రమేష్‌ను ఖమ్మంకు బదిలీ చేస్తూ సవరణ ఉత్తర్వులు జారీ చేసినట్టు అధికారులు వెల్లడించారు.

నేడు, రేపు ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 25: హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం నేడు, రేపు స్పాట్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీవో ఎస్.విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 విద్యా సంవత్సరంలో రెగ్యులర్‌గా పాసైన విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందని ఆమె తెలిపారు. బాలికల ప్రవేశాల కోసం శుక్రవారం మడికొండలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే బాలుర ప్రవేశాల కోసం శనివారం మడికొండలోని బాలుర కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు వారి ధృవపత్రాల జిరాక్స్ కాపీలతో ఉదయం 8 గంటలకల్లా కళాశాలలో ఉండాలని తెలిపారు. గతంలో ఆర్‌సీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్పాట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ఆమె తెలిపారు.

రుణాల రికవరీపై దృష్టి పెట్టండి : మార్నేని

హనుమకొండ సిటీ, జూలై 25: డీసీసీ బ్యాంకు పరిధిలోని రుణాల రికవరీపై దృష్టి పెట్టాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో లోక్ పాలసీ మేకింగ్ కమిటీ, డిస్ట్రిక్ లెవెల్ మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. రుణాల మంజూరు, రికవరీ, విద్యా రుణాలు, బంగారు ఆభరణాల రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, డిపాజిట్లు తదితర అంశాలపై రవీందర్‌రావు సమీక్ష జరిపి అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు జగన్‌మోహన్, చాపల యాదగిరి, మురళీ, డీసీవో నాగేశ్వరరావు, సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, టెస్కాబ్ నోడల్ ఆఫీసర్ లత, నాబార్డు డీడీయం చంద్రశేఖర్ తదితర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 26 జూలై 2024

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.

చింతన



ముక్తి సాధన కోసం...
గకార చతుష్టయం

చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋుగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋుషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధి



స్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.



అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వినిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యథాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే.. వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనను మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013


భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్త వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహాత్మశ్రేణికిం దెల్పెనో... అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

."ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.


'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.

"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.



"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.

ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా సమసిపోయాయి.

శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే... దానిలోంచి దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా... పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqlklలో చదవండి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్యూటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆర్యోగానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్, సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

- వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.,28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్టు రాజు వెల్లడించారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌ను కలిసిన వైద్యుల సంఘం నేతలు



డాక్టర్ మురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 25: ఎంజీఎం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సీహెచ్.మురళిని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కేఎంసీ విభాగం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంజీఎం సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంబి శ్రీనివాస్, జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ బి.చిన్నికృష్ణ, డాక్టర్ హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కె.రాజేశ్వరి, డాక్టర్ రామ్‌మోహన్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ అర్చన, డాక్టర్ విద్యాసాగర్, వైద్యులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే ఆదర్శం

రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

బాలసముద్రం, జూలై 25: రాష్ట్రంలో రైతు రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే ఆదర్శమని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి రూ.70వేల659కోట్లు కేటాయించ డంపై జంగా రాఘవరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు కేంద్రంలో, రాష్ట్రంలో రైతులను మోసం చేసినట్లు వి మర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తు, రైతులకు ప్రభుత్వం అండగాని లుస్తుందని తెలిపారు. రైతులకు రైతుభరోసా, రైతుబీమా, పంటనష్ట పరిహారం ఉంటుందని వ్యవసాయానికి బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించినట్లు జంగా రాఘవరెడ్డి ప్రకటనలో తెలిపారు.

వరంగల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీపీఐ రాష్ట్ర నేత తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

బాలసముద్రం, జూలై 25 : బడ్జెట్‌లో వరంగల్ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వరంగల్‌కు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ నగర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కంతనపల్లి ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ప్రకటనలో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్య రంగానికి తీవ్ర అన్యాయం

కేయూ క్యాంపస్, జూలై 25: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను తక్కువగా కేటాయించి తీవ్ర అన్యాయానికి గురిచేసిందని ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ ఆరోపించారు. గురువారం కేయూ క్యాంటీన్ ఆవరణలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంద నరేశ్ పాల్గొని మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి విద్యాసంస్థలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించాలని అన్నారు. సంక్షేమ శాఖల నేతృత్వంలోని హాస్టల్ మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులను చెల్లించాలని అన్నారు. వర్సిటీలకు రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్లను నియామించాలని అన్నారు. లేకపోతే విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్, కేయూ ఇన్‌చార్జి మచ్చ పవన్ కల్యాణ్, కేయూ ఉపాధ్యక్షుడు హర్షం చరణ్, కిరణ్, సాయి, వెంకటేశ్, భరత్, సురేశ్, షూకూర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్‌కు గాడిదగుడ్డు

- నాయిని రాజేందర్‌రెడ్డి చేతగానితనానికిదే నిదర్శనం
- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హనుమకొండ టౌన్, జూలై 25: అసెంబ్లీలో గురువారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ నగరానికి సీఎం రేవంత్‌రెడ్డి గాడిద గుడ్డు ప్రసాదించాడని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఎద్దేవా చేశారు. హనుమకొండ జిల్లా అభివృద్ధిని ప్రశ్నార్థకంగా మార్చి తీవ్ర అన్యాయాన్ని మిగిల్చాడన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ.1500కోట్లు, ఆర్ఆర్ఆర్ రూ.1500కోట్లు కేటాయించి హనుమకొండ భద్రకాళి బండ్, వరంగల్ రింగ్ రోడ్డు గురించి విస్మరించారన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కును అభివృద్ధి చేస్తానని చెప్పి నేతన్నల నెత్తిన టోపీ పెట్టాడన్నారు. వరంగల్‌ను హెల్త్‌హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పి ఐసీయూలో ఉన్న వైద్యరంగానికి కనీసం ఆక్సిజన్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ నియామకంపై కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వ బడ్జెట్ గురించి మాట్లాడిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. వరంగల్ నగరానికి కనీసం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేకపోయాడని విమర్శించారు. ఆయన చేతగానితనానికి ఈ బడ్జెట్ నిదర్శమని హేళన చేశారు. ఇకనైనా గుడ్డు మీద ఈకలు పీకడం మానేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ హనుమకొండ అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, ఆర్.పి.జయంత్‌లాల్, జిల్లా నాయకులు వలబోజు శ్రీనివాస్, గై సారంగపాణి, రవీందర్‌రెడ్డి, అరణ్యరెడ్డి, శ్రీనువాస్‌రాజు, రాజు, శివ, గంధసిరి శ్రీకాంత్, కల్లూరి కళ్యాణ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో ఐదుగురు డీఈఈల బదిలీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 25: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఐదుగురు డీఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)లను బదిలీ చేస్తూ గురువారం రాష్ట్ర ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎమ్డీ జలాలుద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. చాలా కాలం ఒకే చోట పని చే యడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో బదిలీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఇక్కడి బల్దియా పరిధిలో పనిచేస్తున్న వారిని ఇతర ప్రాంతాలకు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని వరంగల్ బల్దియాకు పోస్టింగ్ ఇస్తున్నట్టు తెలిపారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ ఐన ప్రదేశం
కె.శ్యాంమోహన్	పబ్లిక్ హెల్త్ క్వాలిటీ కంట్రోల్, వరంగల్	జీడబ్ల్యుఎంసీ
టి.రవికుమార్	జీడబ్ల్యుఎంసీ	పబ్లిక్ హెల్త్ క్వాలిటీ కంట్రోల్, వరంగల్
కె.ప్రవీణ్‌కుమార్	జీడబ్ల్యుఎంసీ	జీహెచ్ఎంసీ హైదరాబాద్
ఇజ్రత్ జహాన్	జీడబ్ల్యుఎంసీ	టీయూఎఫ్ఐడీసీ యూనిట్ -3
ఎస్.సంజయ్‌కుమార్	జీడబ్ల్యుఎంసీ	జీహెచ్ఎంసీ హైదరాబాద్

ముంపు ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లను గుర్తించాలి

హనుమకొండ టౌన్, జూలై 25: ముంపుపాంతాల్లోని సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌పార్మర్ల ప్లింత్, లైన్‌ల ఎత్తు పెంపును ముందస్తుగా గుర్తించి వాటికి సంబంధించిన పనుల అంచనాలను రూపొందించుకోవాలని టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, ఎస్ఏవోలతో సీఎండీ గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మునిసిపాలిటీ, టౌన్ పరిధిలో 11 కేవీ ఫీడర్లను రింగ్‌మైన్ సిస్టమ్‌గా మార్పు చేసుకుంటే ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే రింగ్‌మైన్ ఫీడర్‌లోని మరొక ఫీడర్ ద్వారా సరఫరా అందించడం ద్వారా చాలావరకు అంతరాయాలు తగ్గించవచ్చన్నారు. పాల్వంచలో 11 కేవీ లైన్లకు (ఇన్సులేటెడ్ స్లీవ్స్) ఏర్పాటు చేయడానికి ప్రక్రియ మొదలుపెట్టామన్నారు. ఈ విధానం ద్వారా ఇళ్ల పక్కకు ఉన్న వైర్లకు అమర్చడం ద్వారా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉంటాయన్నారు. డివిజన్ల వారీగా సంవత్సరం.. అంత కంటే పైబడిన వర్క్ ఆర్డర్స్‌ను క్లోజ్ చేయాలన్నారు. ప్రతీ సర్కిల్‌కు ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు షెడ్ ఉండాలన్నారు. విద్యుత్ బిల్లు కనెక్షన్‌ల విషయంలో డివిజన్ల వారీగా రివ్యూ చేసి తగిన విధంగా చర్యలు చేపట్టి బకాయిలు వసూళ్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్, సీఈలు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో రాష్ట్రంపై వివక్ష తగదు

కేయూ క్యాంపస్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయానికి గురిచేయడం తగదని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర చైర్మన్, రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కేయూ దూరవిద్య కేంద్రంలో జరిగిన సమావేశంలో వెంకట్‌నారాయణ పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తి విరుద్ధంగా తెలంగాణపై ప్రధాని మోదీ వివక్ష చూపారని ధ్వజమెత్తారు. విభజన చట్టం ప్రకారమైన నిధులు ఇవ్వకుండా కేంద్రంలోని మూడో దఫా అధికారం చేపట్టిన నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంపదను సమానంగా పంచాల్సిన బాధ్యతలు కేంద్రానికి ఉందన్నారు. రూ.48లక్షల కోట్ల బడ్జెట్‌లో బీజేపీయేతర రాష్ట్రప్రభుత్వాలపై వివక్ష చూపిందన్నారు. ఏపీ, బిహార్‌లకు కేటాయించినట్లుగా తెలంగాణకు కేటాయించాలని అన్నారు. రాష్ట్రంలోని 8 ఎంపీ సీట్లు సాధించిన బీజేపీ.. విభజన చట్టం హక్కులను పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ ప్రజలు కేంద్రం తీరుపై తిరుగుబాటు చేయకముందే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కొట్టే భాస్కర్, సంగాని మల్లేశ్వర్, నల్లాని శ్రీనివాస్, వంగాల సుధాకర్, బిక్కునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం మండల ఉపాధ్యక్షుడిగా రామ్‌రెడ్డి

వడ్డెపల్లి, జూలై 25 : హసన్‌పర్తి మండలం దేవన్నపేట గ్రామానికి చెందిన అయ్యాల రామ్‌రెడ్డి రెడ్డి సంఘం మండల ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు అర్శుల కిషన్‌రెడ్డి ఆదేశం మేరకు హసన్‌పర్తి మండల అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి సంఘం అభివృద్ధితో పాటు పేద రెడ్డి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామ్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణపై ఎన్డీఏ సర్కార్ వివక్షత విడనాడాలి

వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్

వడ్డెపల్లి, జూలై 25: వికసిత్ భారత్ పేరుతో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష విడనాడి నిధులు కేటాయించాలని విముక్తి చిరుతల కచ్చి (వీసీకే) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, దక్షిణాది ఆత్మగౌరవ వేదిక రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్‌లు అన్నారు. బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు ఎన్డీఏ ప్రభుత్వం చేసిన వివక్షతను నిరసిస్తూ వీసీకే పార్టీతో పాటు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. అనంతరం వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నాల రవి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు 8ఎంపీ సీట్లు బీజేపీకి కట్టబెట్టారని, ఆ పార్టీ మాత్రం రిటర్న్ గిఫ్ట్‌గా తెలంగాణకు బడ్జెట్ కేటాయింపులో గుండు సున్నా ఇచ్చిందని దుయ్యబట్టారు. ఈ అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లు మంత్రి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా, ప్రదర్శనలో ప్రజా సంఘాల నాయకులు మచ్చ దేవేందర్, సూరం నిరంజన్, మచ్చ విశ్వతేజ, కూనూరు రంజిత్‌గౌడ్, ఎగ్గడి సుందర్‌రామ్, జేజే స్వామి పాల్గొన్నారు.

గుణాత్మక విద్యలో జిల్లాను మందంజలో ఉంచడమే లక్ష్యం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 25: గుణాత్మక విద్యను జిల్లాను ముందంజలో ఉంచడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ పనిచేస్తుందని డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై అన్నారు. గురువారం హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నాస్ రిసోర్స్ టీచర్ల ప్లానింగ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అబ్దుల్‌హై మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27 నుంచి 30 వరకు జిల్లా స్థాయి రిసోర్స్ టీచర్లకు, 31 నుంచి ఆగస్టు 2వరకు కాంప్లెక్స్ స్థాయిలో ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. జాతీయ స్థాయి సామర్థ సాధన పరీక్ష కోసం ఉపాధ్యాయులందరూ విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. శిక్షణ అనంతరం ఉపాధ్యాయుల పనివిధానం విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేదిగా ఉండాలన్నారు. ఈ విషయమై జిల్లాలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. ఉపాధ్యాయులకు అవసరమైన సహాయ సహకారాలను జిల్లా విద్యాశాఖ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఎ.శ్రీనివాస్, డీఎస్‌వో శ్రీనివాసస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 25: వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్, ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-17 సబ్ జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీల్లో వివిధ జిల్లా నుంచి వచ్చిన క్రీడాకారులు సెమీ ఫైనల్స్‌లో అత్యుత్తమ ప్రతిభతో రాణించి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. గురువారం హనుమకొండ ఆఫీసర్స్ క్లబ్‌లో హోరాహోరిగా జరిగిన సెమీఫైనల్స్‌లో గెలుపే లక్ష్యంగా ఫైనల్స్‌కు చేరుకున్నారు.

ఫైనల్స్‌కు చేరిన క్రీడాకారులు

బాలికల సింగిల్స్‌లో కీర్తి మంచాల వరంగల్, హస్విని రంగారెడ్డి, 21 - 19, 14 - 21, 21 - 12, అక్షయ చౌదరి మెదక్, అవినిరెడ్డి రంగారెడ్డి 21-17, 21-13, బాలుర సింగిల్స్ విభాగంలో శశాంక్ వనమాల రంగారెడ్డి, ఆలీసిద్దిక్ వరంగల్ 21-10, 15-21, 21-11, బాలుర డబుల్స్ విభాగంలో ధృవ్‌పరిషధ్, వివేక్ రంగారెడ్డి బీట్ ఆదిత్యారెడ్డి, శ్రీవర్ధన్‌గౌడ్ మెదక్ 24-22, 21-11, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఆదిత్య హర్షవర్ధన్, రిషిత్ పాండే రంగారెడ్డి బీట్ సాయినటకేశ్, మాడ్గుల పూజిత వరంగల్ 16-21, 21-16, 21-12. క్రీడాకారులు ఫైనల్స్‌కు అర్హత సాధించినట్లు వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్, డాక్టర్ పి.రమేష్‌రెడ్డి తెలిపారు. అలాగే రెండురోజులుగా ఆఫీసర్స్ క్లబ్ వేదికగా జరుతుగుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఫైనల్స్‌కు అర్హత సాధించిన క్రీడాకారులకు శుక్రవారం ఫైనల్స్‌లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి డి.నాగకిషన్, క్రీడాపోటీల నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎం.జితేందర్‌రెడ్డిలతోపాటు కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

జానపద గిరిజన విద్యాపీఠంలో కొత్తగా రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 25: వరంగల్ హంటర్‌రోడ్‌లోని జానపద గిరిజన విద్యాపీఠంలో కొత్తగా రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సును ప్రారంభిస్తున్నట్లు విద్యాపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్యా బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం అనుసంధానమైన జానపద గిరిజన విద్యాపీఠంలో ఈ ఏడాది నుంచి ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రవేశాల కోసం ప్రకటన జారీ చేసిందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆగస్టు 19 వరకు www.teluguuniversity.ac.in అనే వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

కేయూ ప్రీపీహెచ్‌డీ పరీక్షల ఫీజు వాయిదా

కేయూ క్యాంపస్, జూలై 25: కాకతీయ యూనివర్సిటీలోని అన్ని విభాగాల ప్రీపీహెచ్‌డీ పరీక్షల ఫీజులను చెల్లించుకోనుటను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, సోషల్‌సైన్స్, ఎడ్యుకేషన్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ తదితర పీహెచ్‌డీ అడ్మిషన్లు కలిగిన విద్యార్థులను ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కొన్ని విభాగాల్లో ప్రీ పీహెచ్‌డీ వర్క్స్ పూర్తి కానందుకు విద్యార్థుల కోరిక మేరకు వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఫీజుల చెల్లింపు వివరాలను త్వరత ప్రకటిస్తామని అధికారులు వెల్లడించారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 25: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ములుగురోడ్‌లోని ప్రభుత్వం ఐటీఐ క్యాంపస్‌లో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్న ఆ శాఖ ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి ఎం.మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని భారత్ ఫైనాన్షియల్ ఇన్‌ల్యూషన్ లిమిటెడ్ కంపెనీలో ఉన్న 150లోన్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 28 యేళ్ల మధ్యగల ఇంటర్, డిగ్రీ పాసైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు శనివారం ఉదయం 11 గంటల వరకు ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

డెంగీ దోమలపై అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ కార్పొరేషన్, జూలై 25: వర్షాకాలం సీజన్‌లో డెంగీ దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమలను నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని గ్రేటర్ వరంగల్ బల్దియా బయాలజిస్ట్ మాధవరెడ్డి అన్నారు. గురువారం గ్రేటర్ 45వ డివిజన్ తరాలపల్లి ప్రభుత్వం పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, డెంగీ పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. తరుచుగా కురుస్తున్న వర్షాల వల్ల దోమలతో పాటు క్రిమికీటకాలు విజృంభిస్తాయని, ప్రధానంగా చిన్న పిల్లల పట్ల దోమలు దారి చేసే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. దోమల పట్ల జాగ్రత్తలు పాటించాలని, దోమల సమస్య ఉన్న వారు తమకు ఫోన్ చేస్తే తప్పకుండా ఫాగింగ్ మిషన్లు, దోమల నివారణ మందును పిచికారి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ బలభద్ర రవి, హెల్త్ అసిస్టెంట్ శ్రవన్‌కుమార్, ఎస్ఐ కుమారస్వామి, ప్రతాప్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజమౌళిలతో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జవాన్లకు నివాళులర్పిస్తూ కాగడాల ర్యాలీ

హనుమకొండ టౌన్, జూలై 25: కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన భారత సైనికులకు నివాళులర్పిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో కాళోజీ జంక్షన్ నుంచి అమరవీరుల స్థూపం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా వార్తలు రాస్తే చర్యలు

వేలేరు(ధర్మసాగర్), జూలై 25: ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు వార్తలు రాస్తే చర్యలు తప్పవని వేలేరు తహసీల్దార్ కోమి అన్నారు. గురువారం వేలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. వేలేరు మండల కేంద్రంలోని పోచమ్మ కుంటలో ఇళ్ల స్థలాల విషయంలో తనపై ఓ పత్రికలో(ఆన్‌లైన్) వార్త రావడంపై ఖండించారు. పూర్తి ఆధారాలతోనే అధికారులపై వార్తలు రాయాలన్నారు. తప్పుడు వార్తలు రాస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పరువు నష్టం దావా కేసు వేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కోమి, ఆర్ఐ సురేందర్ మండల కేంద్రంలోని ప్రభుత్వానికి సంబంధించిన ఇళ్ల స్థలాలను సందర్శించారు. అక్కడ ఉన్న స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బీసీలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలి

కాజీపేట, జూలై 25 : బీసీలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వర్తింప చేయాలని కోరుతూ గురువారం కాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బావు సింగ్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. వినతి పత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో బీసీలకు ప్రకటించిన హామీలను తక్షణమే అమలుచేయాలని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో దర్గా పీఏసీఎస్ డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్, మేకల శ్రవణ్, సుంచు ప్రశాంత్, వి. వీరేందర్, రానా తదితరులు ఉన్నారు.

బీటెక్ విద్యార్థినికి చేయూత

వడ్డెపల్లి, జూలై 25 : హసన్‌పర్తి మండలంలోని ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న వరంగల్‌కు చెందిన కొంగల హాసినికి ఫీజు నిమిత్తం ఎన్నారై కొండపల్లి దీప్తి సహకారంతో రూ.107,500 ఆర్థిక సహాయం చెక్కును గురువారం హనుమకొండ వడ్డెపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్, ఒయాసిస్ చారిటబుల్ ట్రస్టు అధినేత వొద్దిరాజు చంద్ర ప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బిల్ల మహేందర్ మాట్లాడుతూ.. తమ విద్యా ఫౌండేషన్ విన్నపం మేరకు పేద కుటుంబానికి చెందిన హాసినిని కొండపల్లి దీప్తి దత్తత తీసుకొని బీటెక్ చదువు పూర్తి అయ్యే వరకు కాలేజీ ఫీజు చెల్లిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పేద విద్యార్థిని కొంగల హాసినికి ఆర్థిక సహాయాన్ని అందించిన కొండపల్లి దీప్తికి ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

రాంనగర్, జూలై 25: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. విలీన గ్రామాల మునిసిపల్ వార్డుల హసన్‌పర్తి మండల మహాసభ మండల కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో గురువారం రేణిగుంట్ల సురేష్, శ్రీలత, రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాగుల రమేశ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారులకు కార్మికులను బానిసలుగా మారుస్తోందన్నారు. మునిసిపల్ కార్మిక యూనియన్ కార్యదర్శి టి.ఉప్పలయ్య మాట్లాడుతూ.. మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా, కనీసవేతనాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. ఈ సమావేశంలో విలీన గ్రామాల్లో పనిచేస్తున్న మునిసిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గుట్కాప్యాకెట్ల పట్టివేత

కాజీపేట, జూలై 25: పోలీసుల తనిఖీలో గుట్కా, అంబర్ ప్యాకెట్‌లు పట్టుబడ్డాయి. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేటలో పలు కిరాణషాపుల్లో నిషేధిత గుట్కా, అంబర్‌ప్యాకెట్‌లు అమ్మకాలు చేస్తున్నారన్న సమాచారంతో గురువారం పలు కిరాణ షాపులు తనిఖీల చేస్తుండగా శివాలయం వీధిలోని ఏబీసీ కిరాణషాపులో రెండు సంచుల్లో అంబర్ ప్యాకెట్‌లు పట్టుబడ్డాయి. దీంతో షాపు యజమాని గౌరిశెట్టి విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని గుట్కాప్యాకెట్‌లు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పటుకున్న గుట్కాల, అంబర్‌ల విలువ రూ.17వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

హనుమకొండ టౌన్, జూలై 25: గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ 11 మందిని హనుమకొండ తహసీల్దార్ విజయ్‌కుమార్ ఎదుట గురువారం బైండోవర్ చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. బుధవారం రాత్రి పెట్రోలింగ్‌లో ఉన్న ఎస్సై శ్రావణ్‌కు జేఎన్ఎస్ స్టేడియం సమీపంలో 11మంది యువకులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వారిని ఆదుపులోకి తీసుకొని ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేసి, గురువారం ఉదయం యువకుల తల్లితండ్రుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్ పట్టివేత

ధర్మసాగర్, జూలై 25: అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న టిప్పర్లను, ఎక్స్‌కవేటర్లను పట్టుకున్నట్టు సీఐ మహేందర్ గురువారం తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని రిజర్వాయర్ దక్షణ కాలువ వద్ద అనుమతి లేకుండా దేవునూర్ గ్రామానికి చెందిన ఎమ్డీ షాముద్దీన్, మడికొండకు చెందిన యోగేష్ ఇరువురు రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో అనంతసాగర్‌కు చెందిన సూర కుమార్, ఉప్పుగల్‌కు చెందిన కస్తూరి సాయిలకు చెందిన రెండు టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు గురువారం వాటిని పట్టుకున్నారు. పట్టుకున్న ఎక్స్‌కవేటర్లను, టిప్పర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ కార్యాలయంలో వాహనాలను అప్పగించనున్నట్టు సీఐ తెలిపారు.

నేడు మేడిగడ్డ బ్యారేజీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం

మహదేవపూర్ రూరల్, జూలై 25 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధామనైన మేడిగడ్డ బ్యారేజీని నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు సహా మరో 23మంది ఎమ్మెల్యేలు శుక్రవారం సందర్శించనున్నారు. బ్యారేజీ బ్లాక్-7లో పిల్లర్లు కుంగిన నేపథ్యంలో తాత్కాలిక మరమ్మత్తులు పూర్తికాగా ప్రస్తుతం బ్యారేజీ వద్ద 7లక్షల పైచిలుకు ఇన్‌ఫ్లో వస్తుంది. అయితే అంత వరదను సైతం తట్టుకుని పిల్లర్లు నిలబడితే బ్యారేజీ పనికిరాదంటూ, యావత్ కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అంటూ కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు తిప్పికొట్టేందుకే ఎమ్మెల్యేల బృందం బ్యారేజీని సందర్శించున్నట్లు మండల బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా బ్యారేజీలో నీటినిల్వ చేస్తేనే బ్యారేజీ సామర్థ్యం బయటపడే అవకాశం ఉందని.. అప్పుడుగాని పిల్లర్ల పరిస్థితి ఎంటనేది స్పష్టమవుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. నీటిని నిల్వచేయకముందే దాని సామర్థ్యం ఎలా తెలుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 25: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ ఆరోపించారు. యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను తెలుసుకునేందుకు నగరంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా హనుమకొండ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల నుంచి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం టౌన్ సెక్రెటరీ రాకేష్, నాయకులు రాజేష్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ 2024-25



జీఎస్‌డీపీ రూ.14.63 లక్షల కోట్లు

2023-24లో 11.9% వృద్ధి

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) 2023-24 సంవత్సరంలో (ప్రస్తుత ధరల వద్ద) రూ.14,63,963 కోట్లుగా నమోదైంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నమోదైన జీఎస్‌డీపీ రూ.13,08,034 కోట్లతో పోల్చితే 11.9 శాతం వృద్ధి రేటు నమోదైనట్టు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయ రంగం ఊతమివ్వడంతో జీఎస్‌డీపీ పెరిగింది. దీనికి సేవల రంగం 65.7%, పారిశ్రామిక రంగం 18.5%, వ్యవసాయం దాని అనుబంధ రంగాలు 15.8శాతం మేర స్థూల విలువను జోడించాయి. ప్రస్తుత ధరల ప్రకారం 2022-23తో పోలిస్తే 2023-24లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల స్థూల జోడింపు విలువ (జీవీఏ) 4 శాతం పెరిగింది. వ్యవసాయ రంగంపైనే రాష్ట్రంలోని 47.3 శాతం జనాభా ఆధారపడగా.. సర్వీసు రంగంపై 33%, పారిశ్రామిక రంగంపై 19.7 శాతం మంది ఆధారపడి జీవిస్తున్నారు.



రైతు.. రాజధాని!

రేవంత్ సర్కారు బడ్జెట్లో వీటికే పెద్దపీట

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే అతి క్లిష్టమైన రుణ మాఫీ పథకాన్ని పట్టాలపైకి ఎక్కించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడ్జెట్లోనూ వ్యవసాయ రంగానికే పెద్దపీట వేసింది. మొత్తం బడ్జెట్లో ఒక్క వ్యవసాయ రంగానికే 24.95 శాతం నిధులను కేటాయించింది. రుణ మాఫీ పథకాన్ని సుసాధ్యం చేస్తామని రైతాంగానికి భరోసా ఇచ్చింది. ఇప్పటికే మొదలు పెట్టిన ఈ పథకానికి బడ్జెట్‌లో అన్ని స్కీముల కంటే ఎక్కువగా రూ.26 వేల కోట్లను కేటాయించింది. రుణ మాఫీ, రైతు భరోసా, రైతు కూలీల సంక్షేమం, పంటల బీమా, వరి పంటకు బోనస్, ధరణి, రైతు నేస్తం వంటి పథకాలు, కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను రూపొందించింది. ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఫిబ్రవరిలో రూ.2,75,891 కోట్లతో 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆయన.. ఇప్పుడు దానికి రూ.15,268 కోట్ల (5.53%)ను పెంచి రూ.2,91,159 కోట్ల పద్దును సమర్పించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు కాగా.. మూలధన వ్యయం రూ.33,457 కోట్లు! ఇందులో ఒక్క వ్యవసాయ రంగానికే రూ.72,659 కోట్లను కేటాయించింది. రైతు భరోసా, పంటల బీమా, రైతు కూలీల సంక్షేమం, ఫసల్ బీమా వంటి పథకాలతోపాటు గతానికి భిన్నంగా విద్యుత్తు సబ్సిడీని, నీటి పారుదల శాఖ కేటాయింపులను కూడా ఇందులోనే కలిపేయడం గమనార్హం. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన సర్కారు.. అందుకు అనుగుణంగా బడ్జెట్లో రూ.1200 కోట్లను



కేటాయించింది. ఇక, సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రకటించిన సర్కారు.. దానికి కూడా బడ్జెట్లో చోటు కల్పించింది. ఆ పథకం కింద రూ.1800 కోట్లను కేటాయించింది. మరోవైపు, అర్హులకు మాత్రమే రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని బడ్జెట్లో తేల్చి చెప్పారు. నిజానికి, గత బడ్జెట్లో రైతు బంధు పథకానికి రూ.15,075 కోట్లు కేటాయించారు. అప్పట్లో ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇస్తే.. కాంగ్రెస్ సర్కారు రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. అంటే, ఆ మేరకు బడ్జెట్లో నిధులను పెంచి చూపించాలి. కానీ, ఈసారి బడ్జెట్లో కూడా 15,075 కోట్లు మాత్రమే కేటాయించారు. అర్హుల పేరిట రైతు భరోసా లబ్ధిదారులపై కోత పడనుందని స్పష్టమవుతోంది.

సంక్షేమమే సగం బలం

వ్యవసాయం తర్వాత రేవంత్ సర్కారు వివిధ వర్గాల సంక్షేమానికి బడ్జెట్లో అత్యంత ప్రాధాన్యమిచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా శిశు సంక్షేమ రంగాలకు ఏకంగా రూ.65,119 కోట్లను కేటాయించింది. వ్యవసాయానికి, సంక్షేమానికి కలిపి 47.32 శాతం నిధులను కేటాయించింది. ఎస్సీల సంక్షేమానికి అత్యధికంగా రూ.33,124 కోట్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. అయినా, గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది కాస్త తక్కువే. గత బడ్జెట్లో బీసీ సంక్షేమానికి రూ.6,229 కోట్లను కేటాయించగా.. ఈసారి దానిని రూ.9,200 కోట్లకు పెంచారు. యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలకు రూ.500 కోట్లు కేటాయించిన సర్కారు.. చాలా ఏళ్ల తర్వాత ఉస్మానియా, మహిళా విశ్వవిద్యాలయాలకు రూ.100 కోట్ల చొప్పున కేటాయించడం గమనార్హం. అలాగే, ప్రభుత్వ ప్రాధాన్య పథకాలైన ఆరు హామీల్లో నాలుగింటికే గ్యారెంటీ ఇచ్చారు. రూ.500కే గ్యాస్ సిలిండర్లు; బస్సుల్లో ఉచిత ప్రయాణం; గృహ జ్యోతి; ఇందిరమ్మ ఇంటి పథకానికి నిధులు కేటాయించిన సర్కారు.. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డులిచ్చే యువ వికాసం, పింఛన్ల పెంపు గురించి బడ్జెట్లో ప్రస్తావించలేదు. తద్వారా, ఈ ఏడాదిలో వీటి అమలు ఉంటుందా లేదా అనే దానిపై సందిగ్ధం ఏర్పడింది. వెరసి, ఆరు గ్యారెంటీల అమలుకే దాదాపు రూ.47 వేల కోట్లను కేటాయించింది. రాబోయే ఐదేళ్లలో మహిళలకు లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను ఇస్తామని ప్రకటించింది.

హైదరాబాద్ చుట్టూ...

రేవంత్ రెడ్డి సర్కారు బడ్జెట్లో అధిక భాగం హైదరాబాద్ నగరం చుట్టూ తిరిగింది. హైదరాబాద్ అభివృద్ధికే రూ.10 వేల కోట్లను కేటాయించింది. గత సర్కారు ఇందుకు నాలుగైదు వేల కోట్లను కేటాయిస్తే.. రేవంత్ సర్కారు దాన్ని దాదాపు రెట్టింపు చేసింది. భూగర్భ డ్రైనేజీని ప్రక్షాళన చేస్తామని సంకల్పం చెప్పుకొంది. ఇందులో భాగంగా గత సర్కారు కేవలం రూ.182 కోట్లు కేటాయించిన జీహెచ్ఎంసీకి భారీగా రూ.3,086 కోట్లను కేటాయించడం విశేషం. లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామన్న మూసీ అభివృద్ధి పథకానికి బడ్జెట్లో రూ.1,500 కోట్లు కేటాయించడం విశేషం. అలాగే, ఆర్‌ఆర్‌ఆర్‌కు మరో రూ.1525 కోట్లను కేటాయించింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న హైడ్రాకు రూ.200 కోట్లు కేటాయించారు. హైదరాబాద్ మెట్రోకు గతంతో పోలిస్తే కేటాయింపులు తగ్గడం గమనార్హం. నగర శివార్లలో టౌన్‌షిప్‌ల నిర్మాణానికీ సంకల్పం చెప్పుకొన్నారు. నిజానికి, గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, శివారుల్లోనే కాంగ్రెస్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలిన విషయం తెలిసిందే. ఇక్కడి మెజారిటీ సీట్లను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో, రేవంత్ సర్కారు హైదరాబాద్, శివారు ప్రాంతాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిందని, నిధుల కేటాయింపులో పెద్దపీట వేయడం ఇందులో భాగమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీఆర్ఎస్ సర్కారు పథకాలకు రాం రాం

బీఆర్ఎస్ సర్కారు అమలు చేసిన కొన్ని పథకాలకు రేవంత్ ప్రభుత్వం స్వస్తి పలికింది. అందులో ఒకటి, గొర్రెల పంపిణీ పథకం. దీనికి సంబంధించి బడ్జెట్లో అసలు ప్రస్తావన కూడా లేదు. బీఆర్ఎస్ సర్కారు నిరుద్యోగ భృతి కింద రూ.3000 ఇస్తామని ఐదేళ్ల కాలంలోనూ అమలు చేయలేదు. అయినా, కాంగ్రెస్ సర్కారు భృతి కింద రూ.4000 ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ, బడ్జెట్లో దాని ఊసు కూడా లేదు. బీఆర్ఎస్ సర్కారు దళిత బంధు కింద గత బడ్జెట్లో 17,700 కోట్లు కేటాయించింది. కానీ, ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. అయినా, ఆ పథకం పేరు మార్చి 'అంబేడ్కర్ అభయ హస్తం' పేరిట పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తామని చెప్పింది. కానీ.. దీని గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. కానీ, రూ.2000 కోట్లు కేటాయించారు. ఐతే ఈ నిధులను దేనికి ఖర్చు పెడతారనే స్పష్టత కరువైంది. కేసీఆర్ కిట్ వంటి పథకాలకు పేర్లు మార్చారు. అయినా.. వాటికి కూడా బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం గమనార్హం. అంతేనా.. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. ఇటీవల ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సల ధరలనూ సవరించారు. అయినా.. ఈ పథకానికి నిధులను పెంచడానికి బదులు తగ్గించడం విశేషం. గత ప్రభుత్వం ఈ పథకానికి రూ.1,463 కోట్లను కేటాయిస్తే.. ఈసారి రూ.1,065 కోట్లకే పరిమితం చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కల్యాణమస్తుగా పేరు మార్చినా.. గతంతో పోలిస్తే రూ.375 కోట్లను తగ్గించారు. ఈ పథకం అమల్లో భాగంగా తులం బంగారం ఇస్తామని ప్రకటించినా.. బడ్జెట్లో దాని ఊసు లేదు. కేంద్ర సాయంతో కలిపి ఇందిరమ్మ ఇళ్లకు రూ.9,184 కోట్లు కేటాయించారు. నియోజకవర్గానికి ఈ ఏడాదిలో 3,500 ఇళ్లు నిర్మిస్తామని చెప్పినా ఈ నిధులు సగం ఇళ్లకే సరిపోతాయి.

కేటాయింపులు సరే.. నిధులేవీ!?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను విమర్శించి.. తాము వాస్తవిక దృష్టితో బడ్జెట్ రూపొందిస్తామని కాంగ్రెస్ నాయకులు గతంలో ప్రకటించారు. కానీ, గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే కాస్త ఎక్కువే పెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2,90,396 కోట్ల బడ్జెట్‌కు ఇది రూ.763 కోట్లు (0.26%) ఎక్కువ. కొన్ని కేటాయింపుల్లోనూ వాస్తవానికి దూరంగానే గణాంకాలు చూపించారు. ఉదాహరణకు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద గత బడ్జెట్లో బీఆర్ఎస్ సర్కారు రూ.41,259 కోట్లు చూపించింది. కానీ, వచ్చింది రూ.9,729 కోట్లే. అయినా, తాజా బడ్జెట్లో రూ.21,636 కోట్లు వస్తాయని అంచనా వేసింది. ఎంతో కొంత తగ్గించినా.. గతానుభవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఊహాజనితంగానే ఈ గణాంకాలు ఉండడం గమనార్హం. అలాగే, పన్నేతర రాబడి కింద బడ్జెట్‌లో రూ.35,208 కోట్లను అంచనా వేశారు. ప్రభుత్వ భూముల అమ్మకం, లీజుకివ్వడం, తనఖా పెట్టడం, హామీగా పెట్టడం (సెక్యూరిటైజేషన్) తదితరాల ద్వారా ఈ నిధులను సాధించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలోనూ పన్నేతర రాబడిని భారీగా పెట్టినా.. ఆచరణకు వచ్చేసరికి అంచనాను ఎప్పుడూ అందుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌లోనూ ఇదే పునరావృతమైంది. కేంద్రం గ్రాంట్లు, పన్నేతర రాబడి కిందే దాదాపు రూ.57 వేల కోట్లను ప్రతిపాదించారు. ఇందులో ఎంతమేర కోత పడితే.. ఆ మేరకు వివిధ శాఖల కేటాయింపుల్లో తగ్గించాల్సి వస్తుంది. ఇక, గత ప్రభుత్వం చేసిన అప్పు అసలు, వడ్డీకి కలిపి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.42 వేల కోట్లను కట్టామని, తాము కేవలం రూ.35 వేల కోట్లను మాత్రమే కొత్తగా అప్పు తెచ్చామని, తద్వారా దాదాపు రూ.7000 కోట్ల బాకీని అదనంగా తీర్చామని చెప్పడం బడ్జెట్ ప్రసంగంలో ఊరట.



ఇంటికి నిధులు.. అందరికీ అందేనా!

ఇందిరమ్మ ఇళ్లకు 9,184 కోట్లు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరేలా కనిపించడంలేదు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నిధులు కేటాయించినా.. చెప్పిన ఇళ్లకు అవి సరిపోయే పరిస్థితి లేదు. తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం హౌసింగ్ శాఖకు రూ.9,184 కోట్లు కేటాయించింది. ఇందులోనే కేంద్రం అమలు చేసే ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్, రూరల్) పథకాల కింద రూ.3,500 కోట్లకుపైగా కేంద్ర ప్రాయోజిత నిధులు కూడా అందుతాయని పేర్కొంది. మొదటి దశలో ఈ ఏడాది నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 4,16,500 ఇళ్లను నిర్మించాలని, రిజర్వ్ కోటాలో మరో 33,500 ఇళ్లు కలిపి 4,50,000 ఇళ్లను నిర్మించాలని నిర్ణయించింది. అయితే, తాజా బడ్జెట్‌లో మొత్తం ఇళ్ల నిర్మాణాలకయ్యే నిధుల్లో 40శాతమే కేటాయించింది. రూ.9,184 కోట్లతో (ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున) రాష్ట్రవ్యాప్తంగా 1,83,680 ఇళ్ల నిర్మాణానికి సాయం అందనుంది. అంటే ఒక్కో నియోజకవర్గానికి 1,543 ఇళ్లకే అందనుంది. మరోవైపు ఈ నిధులనుంచే గత ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో మరమ్మతుల కోసం రూ.650-1,000కోట్ల వరకు అవసరం అవుతాయని అంచనా. ఇవి పోగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మిగిలేది రూ.8,184 కోట్లేనని తెలుస్తోంది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆశించిన స్థాయిలో ముందుకెళుతుందా అన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసు శాఖకు 9564 కోట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో హోం శాఖకు నిధుల కేటాయింపు స్వల్పంగా తగ్గింది. గత బడ్జెట్‌లో రూ.9,599కోట్ల కేటాయింపులు జరగ్గా.. ఈ సారి రూ.9,564కోట్లను ప్రకటించారు. శాఖాధిపతికి రూ.374.48కోట్లు, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు రూ.276.44కోట్లు, సైబరాబాద్ కమిషనరేట్‌కు రూ.20కోట్లు కేటాయించారు. నిఘా విభాగానికి రూ.108.7 కోట్లకు పెంచారు. తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్)కు గతంలో రూ.8.5 కోట్లు ఇవ్వగా.. ఈ సారి రూ.20కోట్లకు పెంచారు. సైబర్ నేరాల కట్టడికి ఏర్పాటైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ)కి బడ్జెట్‌లో తొలిసారి రూ.15 కోట్లను కేటాయించారు.

మద్యం, రిజిస్ట్రేషన్ బాదుడు ఉంటుందా!?

కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భారీ బడ్జెట్‌నే ప్రవేశపెట్టింది. అందులోని గణాంకాలు భారీగా కనిపిస్తున్నా.. ఆచరణకు, ఏడాది చివరికి వచ్చేసరికి ఎప్పట్లాగే భారీ వ్యత్యాసం ఉంటుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంచనాకు, ఖర్చుకు మధ్య భారీ లోటు ఉంటుందని విశ్లేషిస్తున్నారు. దానిని పూడ్చుకోవడానికి బడ్జెట్లో పరోక్షంగా ప్రతిపాదనలు పెట్టారని అంటున్నారు. మద్యం రేట్లతోపాటు రిజిస్ట్రేషన్ చార్జీల సవరణ, మోటారు వెహికిల్ ట్యాక్సుల్లో మార్పులు ఉండవచ్చని చెబుతున్నారు. ఉదాహరణకు, ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.19,884 కోట్ల రాబడి వస్తుందని గత బీఆర్ఎస్ బడ్జెట్లో అంచనా వేశారు. ఈసారి దానిని రూ.25,617 కోట్లకు పెంచేశారు. తద్వారా, మద్యం ధరలను పెంచుతారా!? అనే సందేహాలను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అలాగే, గత బడ్జెట్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ రాబడిని రూ.18,500 కోట్లుగా అంచనా వేసినా చివరకు రూ.14,295 కోట్లు మాత్రమే వచ్చింది. అయినా, ఈసారి రూ.18,228 కోట్లుగా అంచనా వేశారు. భూముల మార్కెట్ విలువలకు సంబంధించి ఇప్పటికే కసరత్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ రేట్లను కూడా సవరించే అవకాశం ఉండవచ్చని భావిస్తున్నారు. అమ్మకం పన్ను, ట్రేడ్ ట్యాక్సులను కూడా భారీగా పెంచిన నేపథ్యంలో మోటారు వాహనాల పన్నుల విషయంలో ఏమైనా మార్పులు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చివరిగా, ఏపీ నుంచి రూ.20 వేల కోట్లకుపైగా వస్తాయని గత బడ్జెట్లో ప్రతిపాదిస్తే.. ఈసారి బడ్జెట్లో దానిని 'సున్నా'గా చూపించడం విశేషం!!

బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ. కోట్లలో)

	2022-23 (వాస్తవ)	2023-24 (బడ్జెట్ అంచనా)	2023-24 (సవరించిన అంచనా)	2024-25 (బడ్జెట్ అంచనా)
రెవెన్యూ వసూళ్లు	1,59,350	2,16,566	1,69,089	2,21,242
మూలధన వసూళ్లు	45,143	73,106	57,006	69,572
మొత్తం వసూళ్లు	2,04,493	2,89,672	2,26,095	2,90,814
రెవెన్యూ వ్యయం	1,53,406	2,11,685	1,67,385	2,20,945
మూలధన వ్యయం	17,881	37,525	44,252	33,487
రుణాలు, అడ్వాన్సులు	21,248	28,479	6861	19,626
రుణాల చెల్లింపు	11,987	12,607	12,519	17,001
మొత్తం వ్యయం	2,04,522	2,90,296	2,31,017	2,91,059
రెవెన్యూ మిగులు	5,943	4,881	1,704	297
ద్రవ్య లోటు	32,556	38,234	49,373	49,255

ఆశలన్నీ ఆ మూడింటిపైనే!

భారీ పథకాలకు నిధుల కోసం ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, రవాణాశాఖలపై సర్కారు దృష్టి

భారీ పథకాలకు అవసరమైన నిధుల కోసం.. సర్కారు ప్రధానంగా మూడు శాఖలపైనే ఆశలు పెట్టుకుంది. కొత్త అప్పులకు అవకాశం లేకపోవడం, కేంద్రం ఆదుకుంటుందన్న ఆశలూ లేకపోవడంతో రాష్ట్ర ఖజానాకు ఎక్కువ ఆదాయాన్ని అందించే ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, రవాణా శాఖలను నమ్ముకుంది. రూ.2.91 లక్షల కోట్లతో ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రూ.52,322 కోట్లు వీటి ద్వారానే ఆర్జించాలని నిర్ణయించింది. మొత్తం బడ్జెట్‌లో ఇది దాదాపు 18% కావడం గమనార్హం. నిరుటితో పోలిస్తే ఈ మూడు శాఖల నుంచి రూ.10,343 కోట్లు అదనంగా సమీకరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. శాఖలవారీగా పరిశీలిస్తే..

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

రవాణా శాఖ నుంచి..

రవాణా శాఖ ద్వారా ఈ ఏడాది రూ.8,477.93 కోట్ల ఆదాయం సమకూర్చుకోనున్నట్టు ప్రభుత్వం ప్రతిపాదించింది. గతేడాది రవాణా శాఖ నుంచి వచ్చిన ఆదాయం.. రూ.7,094.82 కోట్లు. అంటే, గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.1,383 కోట్లు అధికం. ఈమేరకు ఆదాయాన్ని పెంచుకునేలా చర్యలు చేపట్టనున్నట్టు సమాచారం. రాష్ట్రంలో ఏటా వాహనాల రిజిస్ట్రేషన్‌ల సంఖ్య 10శాతానికి పైగా పెరుగుతోంది. రూ.10 లక్షల లోపు ఖరీదైన వాహనాలపై 12%, అంతకు మించి ఖరీదైన వాహనాల నుంచి 18 శాతానికి పైగా రవాణా శాఖ లైఫ్ టాక్స్ వసూలు చేస్తోంది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆదాయాన్ని సమకూర్చడానికి.. బకాయిల వసూలుకు విస్తృత స్థాయి తనిఖీలతో పాటు కొన్ని మోటారు వాహనాలపై 1నుంచి 2 శాతం వకు టాక్స్ పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

అబ్కారీ నుంచి..



ఎక్సైజ్ శాఖ నుంచి సర్కారు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.25,617 కోట్లు రాబట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. నిరుటితో పోలిస్తే ఇది రూ.5,319 కోట్లు (21 శాతం) అదనం. ఎందుకంటే.. గత ఐదేళ్ల నుంచి ఏటా ఎక్సైజ్ శాఖ ఆదాయం సగటున 5-6 శాతం మేర పెరుగుతోంది. గత ఏడాది కొత్త మద్యం దుకాణాల కేటాయింపు, లైసెన్స్ ఫీజు పెంచడంతో పెరుగుదల 9 శాతంగా నమోదైంది. వచ్చే ఏడాది వరకు కొత్త మద్యం దుకాణాల కేటాయింపు లేదు. అయినప్పటికీ ప్రభుత్వం ఆదాయ అంచనాను పెంచడం గమనార్హం. కాగా.. ఆదాయం పెంచుకునేందుకు కొత్తగా ఎలైట్ బార్లను ప్రవేశపెట్టాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి..



రిజిస్ట్రేషన్ల ఆదాయం ఈసారి భారీగా పెరుగుతుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.18,228 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. ఇది గత ఏడాది బడ్జెట్‌లో రాబడి అంచనాల కంటే తక్కువే. అయితే గత ఏడాది వాస్తవ రాబడికంటే మాత్రం చాలా ఎక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.14,588 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మరో రూ.3,640 కోట్ల ఆదాయం అదనంగా వస్తుందని బడ్జెట్‌లో చూపించారు. ఆదాయం అంత మేర పెరుగుతుందా అనే అనుమానాలున్నాయి. కానీ.. ప్రభుత్వం మాత్రం ఆమేరకు ఆదాయం పెంచుకోవాలని చూస్తోంది. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువల సవరించే నివేదిక బాధ్యతలను ప్రైవేట్ ఏజన్సీకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏజన్సీ నుంచి నివేదికలు రాగానే రిజిస్ట్రేషన్ విలువలను సవరించనున్నట్లు సమాచారం.

హైదరాబాద్‌కు 10 వేల కోట్లు!

'గ్రేటర్'పై రేవంత్ సర్కారు ప్రత్యేక దృష్టి



గతానికి భిన్నంగా అధిక నిధులు..

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి ఈసారి బడ్జెట్‌లో గణనీయంగా నిధులు కేటాయించారు. గత సర్కారుకు భిన్నంగా రేవంత్ ప్రభుత్వం రూ.10 వేల కోట్ల భారీ మొత్తంతో మహానగర అభివృద్ధికి తెర తీసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిని ఔటర్ రింగు రోడ్డు ప్రాంతాలకు విస్తరించడంతో పాటు మౌలిక వసతులకు నిధుల కొరత లేకుండా కేటాయింపులు జరిపింది. గత ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.182 కోట్లు కేటాయిస్తే.. తాజా బడ్జెట్‌లో ఏకంగా రూ.3,065 కోట్లు కేటాయించారు. ఇది దాదాపు 16 రెట్లు ఎక్కువ.. హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చే జలమండలికి సైతం భారీగా కేటాయింపులు జరిపారు. గత బడ్జెట్‌లో వాటర్ బోర్డుకు రూ.1,960.7 కోట్లు కేటాయిస్తే.. ఈసారి రూ.3,385 కోట్లకు పెంచారు. మూసీ సుందరీకరణ, అభివృద్ధి కోసం గత ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయిస్తే.. దాన్ని ఈసారి రూ.1,500 కోట్లకు పెంచేశారు.

హైడ్రాకు రూ.200 కోట్లు..

ఔటర్ వరకు ప్రభుత్వ ఆస్తుల రక్షణ, విపత్తుల నిర్వహణ కోసం కొత్తగా ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు రూ.200 కోట్లు సర్కారు కేటాయించింది. ఇక మెట్రో రైల్ విస్తరణకు గత సర్కారు బడ్జెట్‌లో రూ.2,427.35 కోట్లు కేటాయించగా.. అది ఈసారి మాత్రం రూ.1,100 కోట్లకు తగ్గింది. ప్రతిపాదనల్లో పాతబస్తీకి రూ.500 కోట్లు, నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రూ.100 కోట్లు, హెచ్ఎంఆర్‌కు రూ.500 కోట్లు కేటాయింపులు జరిపారు. ఇక ఔటర్ రుణాల చెల్లింపు.. పలు ప్రాంతాల్లో ప్రతిపాదిత అభివృద్ధి పనుల కోసం హెచ్ఎండీఏకు రూ.710 కోట్లు సర్కారు కేటాయించింది. అంతర్జాతీయంగా భాగ్యనగర ఖ్యాతి పెంచుతామని చెబుతున్న కాంగ్రెస్ సర్కారు.. అందుకు తగినట్టుగా బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చింది. జీహెచ్ఎంసీకి వివిధ పనుల నిమిత్తం గత సర్కారు రూ.182 కోట్లు కేటాయిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని రూ.2,654 కోట్లకు పెంచింది. బల్దియాకు ప్లానింగ్ కమిషన్ గ్రాంట్లు రూ.387 కోట్ల నుంచి రూ.411 కోట్లకు పెంచారు.

సభ్యులతో సభ కళకళ

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తొలిసారిగా శాసనసభ పూర్తిస్థాయి సభ్యులతో కళకళ లాడింది. అధికార, విపక్ష సభ్యులంతా హాజరయ్యారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సభ్యుల ప్రమాణ స్వీకారం సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సహా పలువురు అధికార, విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత తొలిసారిగా గురువారం కేసీఆర్ సభకు హాజరయ్యారు. కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన 65 మంది, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలు సభలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలూ పూర్తిస్థాయిలో హాజరయ్యారు. బీజేపీ ఎమ్మెల్యేలు అందరూ, సీపీఐ ఎమ్మెల్యే కూడా సమావేశాల్లో పాలుపంచుకున్నారు. ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మినహా ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు.



రాక	
రాష్ట్ర పన్నులు, సుంకాలు	62.45 పైసలు (1,38,181)
కేంద్ర పన్నుల్లో వాటా	11.85 పైసలు (26,216)
పన్నేతర ఆదాయం	25.38 పైసలు (56,131)
వడ్డీ వసూళ్లు	0.32 పైసలు (712)

పోక	
రెవెన్యూ వ్యయం	80.28 పైసలు (1,77,580)
రుణాల చెల్లింపులు	8.02 పైసలు (17,731)
పరిపాలన వ్యయం	5.19 పైసలు (11,492)
ఇతరత్రా వ్యయం	5.88 పైసలు (13,018)
పన్ను వసూళ్ల వ్యయం	0.50 పైసలు (1,121)
మిగులు	0.13 పైసలు (297)

(బ్రాకెట్లలోని అంకెలు రూ. కోట్లలో)



చివరి దశలో ఉన్న ప్రాజెక్టులు పూర్తి: ఉత్తమ్



నీటిపారుదల శాఖకు రూ.22,301 కోట్లు కేటాయించడాన్ని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వాగతించారు. ఈ నిధులతో చివరి దశలో ఉన్న ఆరు సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూస్తామని వెల్లడించారు. అలాగే పౌర సరఫరాల శాఖకు రూ.3,836 కోట్లు కేటాయించడాన్ని ఉత్తమ్ స్వాగతించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మార్చే స్పష్టమైన విజన్.. బడ్జెట్లో కనిపించిందన్నారు.

శాసనసభ రేపటికి వాయిదా

శాసనసభ శనివారానికి వాయిదా పడింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం సభను శనివారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తూ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటన చేశారు.

1న క్యాబినెట్ భేటీ

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆగస్టు 1న జరగనుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను గురువారం జారీ చేశారు. ఆగస్టు 1న సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగే ఈ భేటీలో అసెంబ్లీలో ప్రవేశపెట్టే కొన్ని బిల్లులతోపాటు, ముఖ్యమైన అంశాలపై రాష్ట్ర మంత్రివర్గం చర్చించనుంది.

సాగుకు సలాం

(మొదటిపేజీ తరువాయి)

నిదర్శనమన్నారు. గురువారం శాసనసభలో బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం ప్రవేశపెట్టారు. మధ్యాహ్నం 12:02 గంటలకు ప్రారంభమైన బడ్జెట్ ప్రసంగం 1:57 గంటలకు ముగిసింది. భట్టివిక్రమార్క ప్రసంగిస్తూ.. సంకల్ప బలం, చిత్త శుద్ధి, సమర్థత, నిజాయతీ పునాదులుగా ఏర్పడిన ప్రభుత్వానికి అలవికాని హామీలేవీ లేవని నిరూపించామన్నారు. ప్రజల ఆకాంక్షలతో కాంగ్రెస్ ఆశయాలను సమన్వయపరిచి.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరచాలనే దృఢ దీక్షతో ఉన్నామన్నారు. ప్రభుత్వ విధానాలు పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యంతో ఖరారు కావాలే తప్ప.. నాలుగు గోడల గడీల మధ్య కాదని వ్యాఖ్యానించారు.

సన్నరకం ధాన్యానికి బోనస్..

రాష్ట్రంలో సన్నరకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి వీలుగా 33 రకాల సన్నాలను గుర్తించి, క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. దీంతోపాటు భూమిలేని రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులను మార్చడానికిగాను వారికి ఏటా రూ.12 వేల చొప్పున అందజేస్తామన్నారు. ఇక ఈ ఏడాది నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో చేరనున్నామని, ఈ పథకం కింద రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతుల రూ.2 లక్షల రుణమాఫీకిగాను రూ.31 వేల కోట్లను సమీకరించుకుంటున్నట్లు తెలిపారు. రూ.లక్ష దాకా రుణం ఉన్న 11.34 లక్షల మంది రైతులకు ఈ నెల 18నే మాఫీ చేశామని, పూర్తి నిధులను త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించారు. ఇక రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేయనున్నట్లు వెల్లడించారు. పంటలు సాగుచేసే, అర్హులైన రైతులకే ఈ సాయం అందించనున్నట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ధాన్యాన్ని సేకరణ కేంద్రాలకు తరలించేలా గంటగంటకూ వాతావరణ సమాచారం తెలియజేసే యాప్‌ను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

వామనావతారంలా అప్పులు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.75,577 కోట్లుగా ఉన్న అప్పు.. రోజు రోజుకూ వామనావతారంలా పెరిగిపోయిందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. గతేడాది డిసెంబరు నాటికి ఈ అప్పులు రూ.6,71,757 కోట్లకు చేరాయని తెలిపారు. గత దశాబ్దకాలంలో తప్పుడు నిర్ణయాల వల్ల సాగునీటి ప్రాజెక్టుల్లో ఆశించిన ఫలితాలు సాధించలేదన్నారు. కాలువల ద్వారా నీళ్లు కాకుండా.. అవినీతి సొమ్మును ప్రవహింపచేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పనిచేసిందని ఆరోపించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడంతో.. ఎంతో సమృద్ధిగా, ఆర్థికంగా పరిపుష్టిగా ఉన్న రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. కనీసం ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షనర్లకు చెల్లింపులు కూడా సకాలంలో చేయలేకపోయారని ఆక్షేపించారు. తాము దుబారా ఖర్చులను కట్టడి చేసి, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని, ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తారీకున వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ నిర్వాకంతో అప్పులు చెల్లించడానికి కూడా మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

త్వరలోనే జాబ్ క్యాలెండర్..

గత దశాబ్ద కాలంలో ఉద్యోగ నియామకాల విషయాన్ని పక్కనపెడితే.. అరకొర నియామకాల్లోనూ అక్రమాలు, పేపర్ లీకేజీలు చోటుచేసుకున్నాయని ఉపముఖ్యమంత్రి ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను సమూలంగా ప్రక్షాళన చేశామని, ఇప్పటిదాకా 31,768 మందికి ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. నియామక ప్రణాళిక క్యాలెండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. సొంత జాగా ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇల్లు కట్టుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో 4.50 లక్షల మందికి ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 63 లక్షల మంది మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకుగాను 'ఇందిరా మహిళా శక్తి' పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. స్త్రీ నిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానం ద్వారా రూ.లక్ష కోట్ల సాయం అందించాలన్నది లక్ష్యమన్నారు.

థేమ్స్ తరహాలో మూసీ అభివృద్ధి..

హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మెట్రో కారిడార్ల విస్తరణ చేపట్టనున్నట్లు, రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర, దక్షిణ ప్రాంతాల రోడ్లను జాతీయ రహదారులుగా ప్రకటించడానికి వీలుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పే సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ కోర్సులు బోధించడానికి తెలంగాణ స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వర్సిటీలకు వీసీల నియామకం, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను టాటా టెక్నాలజీతో అభివృద్ధి చేస్తామన్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా ఆరు కొత్త దీర్ఘకాలిక కోర్సుల్లో ఏటా 5860 మందికి విద్యార్థులకు, స్వల్పకాలిక కోర్సుల్లో 31,200 మందికి శిక్షణ ఇస్తామన్నారు.



జిల్లాల మధ్య ఆర్థిక అంతరం..

2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,47,299 కాగా, జాతీయ తలసరి ఆదాయం రూ.1,83,236గా ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. జాతీయ స్థాయితో పోలిస్తే.. తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,64,063 అధికంగా ఉందన్నారు. అయితే అదే సమయంలో తలసరి ఆదాయం స్థాయిల్లో జిల్లాల మధ్య భారీగా అంతరం ఉందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.9,46,862గా ఉంటే.. వికారాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ.1,80,241గా ఉందన్నారు.

భట్టిని ఆప్యాయంగా కౌగిలించుకున్న రేవంత్

ఉదయం 11:45 గంటలకే శాసనసభలోకి అడుగుపెట్టిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రసంగంపై కాసేపు రిహార్సల్స్ చేశారు. ఆ తర్వాత 11:59 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలోకి వచ్చిరాగానే భట్టి విక్రమార్కను ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. బడ్జెట్ ప్రసంగం పూర్తయ్యాకా అధికార పార్టీ సభ్యులంతా సీఎంకు, డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు.



బడ్జెట్ ప్రసంగంలోని కీలకాంశాలు..

- ఆధునిక సాంకేతిక పద్ధతులతో ఆరోగ్య సేవలు అందించడానికి వీలుగా ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు జారీ .
- ధరణి కమిటీ అధ్యయనం పూర్తయ్యాక.. శాశ్వత పరిష్కారం దిశగా తగిన చర్యలు.
- వివిధ వర్గాల విద్యార్థుల మధ్య స్నేహభావం పెరిగి, అంతరాలు తగ్గించేందుకు 20 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల పాఠశాలలను కలిపి సమీకృత గురుకులాల నిర్మాణం.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక నిధులు.
- ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల సబ్సిడీకి రూ.16,410 కోట్ల నిధులు. ఈ ఆర్థిక సంవత్సరంలో 11 కొత్త ఎక్స్‌ట్రా హైవోల్టేజీ సబ్‌స్టేషన్ల నిర్మాణం. 31 ఎక్స్‌ట్రా హైవోల్టేజీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు కోసం నిధులు. 2030 దాకా విద్యుత్ ఉత్పత్తి ప్రణాళిక కోసం నూతన ఇంధన పాలసీ. ఎలక్ట్రిక్ వాహనదారులకు చార్జింగ్ కేంద్రాల సమాచారం ఇవ్వడానికి వీలుగా టీజీ ఈవీ పేరుతో మొబైల్ యాప్ తయారీ.
- అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లు, వికారాబాద్-అనంతగిరి సర్క్యూట్, కనకగిరి, కుంటాల జలపాతం, కిన్నెరసాని, పాకాల, ఏటూరునాగారం సర్క్యూట్‌లలో ఎకో టూరిజం. ఈ ఏడాది 20.02 కోట్ల మొక్కలు నాటడానికి వీలుగా 'వజ్రోత్సవ వనమహోత్సవం'. అటవీ జంతువుల దాడిలో చనిపోయిన వారికి పరిహారం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు.
- త్వరలోనే నిజాం షుగర్స్ ప్రారంభం.
- 24 భారీ, 7 మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం కోసం బడ్జెట్‌లో ఇరిగేషన్ శాఖకు నిధులు
- తెలంగాణ మాదక ద్రవ్యాల నిర్మూలనకు జీరో టాలరెన్స్ విధానం అమలు. మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చడానికి వీలుగా హోంశాఖకు నిధుల కేటాయింపు.
- కంటోన్మెంట్ రోడ్ల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి తారు రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు లేన్ల రహదారి. జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి అనుసంధానం చేసేలా హైవేల నిర్మాణం. ఈ బడ్జెట్‌లో రోడ్లు భవనాల శాఖకు రూ.5790 కోట్లు.

బీజేపీ చెబితే.. కేసీఆర్ వచ్చారు

పూర్తి ప్రసంగం వినకుండానే వెళ్లిపోయారు

విలేకరులతో ఇష్టాగోష్ఠిలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీవాళ్లు చెబితేనే.. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారని, మీడియా పాయింట్ వద్ద బడ్జెట్‌పై మాట్లాడారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. అయితే పూర్తి బడ్జెట్ ప్రసంగాన్ని వినకుండా మధ్యలోనే వెళ్లిపోయారని, అడ్డగోలుగా గాలిమాటలు మాట్లాడారని అన్నారు. పూర్తిగా వినకపోతే బడ్జెట్‌పై అవగాహన ఎలా వస్తుందన్నారు. హడావుడిగా వచ్చి.. వెళ్లేందుకైతే అసలు రావడమెందుకని ప్రశ్నించారు. ప్రజలపై, రాష్ట్ర బడ్జెట్‌పై అభిమానం ఉంటే పూర్తిగా వినాలని హితవు పలికారు. గురువారం అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం డిప్యూటీ సీఎం.. అసెంబ్లీ కమిటీ హాల్-1లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాడానని చెప్పుకొనే వ్యక్తి.. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై బుధవారం అసెంబ్లీలో తీర్మానం పెడితే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఆరు నెలలపాటు కాంగ్రెస్‌కు సమయం ఇచ్చామని కేసీఆర్ అంటున్నారని, నిజానికి ప్రజలే వారిని ఓడించి, పూర్తిగా విశ్రాంతినిచ్చారని ఎద్దేవా చేశారు. దళితబంధుకు రూ.17,700 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయని కేసీఆర్.. ఈ బడ్జెట్లో దళితబంధు పథకాన్ని ప్రస్తావించలేదని మాట్లాడుతుంటే నవ్వాలో? ఏడ్వాలో? అర్థం కావడం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గత ప్రభుత్వం మాదిరిగా తాము మళ్లించబోమన్నారు. బ్యాక్‌లాగ్ నిధులతో సహా ప్రతి పైసాను దళిత, గిరిజనుల ప్రయోజనాల కోసమే ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే స్కిల్ యూనివర్సిటీకి 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'గా నామకరణం చేశామన్నారు. కోటి మంది మహిళలను లక్షాధికారులుగా తయారు చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని, ఏటా మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న తరహా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

అరుపులు.. నినాదాల మధ్య ప్రసంగం

తెలంగాణ శాసనసభ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బడ్జెట్ ప్రసంగం ఆసాంతం అరుపులు, కేకల మధ్య కొనసాగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బడ్జెట్ ప్రసంగం చేస్తున్న సమయంలో 'షేమ్ షేమ్.. బోగస్, ఫాల్స్, అబద్ధం' అంటూ ప్రతిపక్షం నినాదాలు చేయగా.. అధికార పక్షం కూడా అంతే స్థాయిలో బదులిచ్చింది. బడ్జెట్ ప్రసంగం పూర్తయ్యేదాకా ఇలా నినాదాలు కొనసాగాయి. మధ్యలో రెండు మూడుసార్లు మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ కూడా ఇతర బీఆర్ఎస్ సభ్యులతో గొంతు కలిపారు. ఓ దశలో ప్రతిపక్ష నేత కేసీఆర్.. వెనక్కి తిరిగి నినాదాలు చేసే సభ్యుల వైపు చూశారు. అధికార పక్ష సభ్యులతో కలిసి మంత్రులు కూడా విపక్షానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం గమనార్హం. కాగా, బడ్జెట్ ప్రసంగంలో పలు చోట్ల రిఫరెన్స్‌లుగా దక్షిణాఫ్రికా జాతిపిత నెల్సన్ మండేలా, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, జాతిపిత మహాత్మాగాంధీ సూక్తులతో సాగింది.

సామాజిక, ఆర్థిక సర్వేలోని కొన్ని ముఖ్యమైన వివరాలు

తలసరి ఆదాయం 3,47,299
అత్యధికం 9,46,862 రంగారెడ్డి
అత్యల్పం 1,80,322 వికారాబాద్



40,656 మొత్తం పాఠశాలలు
58,98,686 మొత్తం విద్యార్థులు
48.82 ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల శాతం
58.18 ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల శాతం
2,69,776 మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య



రాష్ట్రంలోని వైద్యసేవలందించే కేంద్రాల సంఖ్య 851

రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 1.90 కోట్లు

రాష్ట్రంలో కోళ్ల సంఖ్య 7.99 కోట్లు

ఆర్ఆర్ఆర్‌కు 1,525 కోట్లు!

భూ పరిహారం చెల్లింపునకు కేటాయింపు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించింది. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం భూ పరిహారం కోసం రాష్ట్ర వాటా కింద రూ.1,525కోట్లను కేటాయించింది. గత ప్రభుత్వం 2023-24బడ్జెట్‌లో ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం భూ పరిహారం చెల్లింపునకు అవసరమైన నిధుల్లో కేవలం రూ.500కోట్లను కేటాయించినా, ఒక్క రూపాయి ఖర్చు చేయకపోవడం గమనార్హం. మరోవైపు రీజినల్ రింగు రోడ్డును మొదట 4లేన్లుగా నిర్మించి, తర్వాత ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా 8లేన్లగా విస్తరిస్తామని, గురువారం నాటి బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. భవిష్యత్తులో విస్తరించబోయే 8లేన్ల రహదారికి కావాల్సిన స్థాయిలోనే భూ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తర భాగం రహదారి చౌటుప్పల్‌లో మొదలై ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డికి అనుసంధానం కానుంది. దీని నిర్మాణానికి దాదాపు 2వేల హెక్టార్ల భూమి అవసరమవుతుందని ఎన్‌హెచ్ఏఐ ప్రాథమికంగా అంచనా వేసింది.





పట్టణ ప్రగతికి 15,594 కోట్లు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పురపాలక, పట్టణాభివృద్ధికి బడ్జెట్‌లో సర్కారు రూ.15,594 కోట్లు కేటాయించింది. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో వ్యూహాత్మక అభివృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా నిధుల కేటాయింపులు జరిపారు. అయితే ఇందులో హైదరాబాద్ నగరాభివృద్ధికే గణనీయంగా రూ.10 వేల కోట్ల (65 శాతం) వరకు కేటాయింపులున్నాయి. ఇక యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి అథారిటీకి రూ.200 కోట్లు, వేములవాడ ఆలయ ప్రాంత అభివృద్ధి అథారిటీకి రూ.50 కోట్లు, రాష్ట్ర ఆర్థిక సంఘం కింద పురపాలక సంఘాలకు రూ.1,300 కోట్లు, వైకుంఠధామాల నిర్మాణాలకు రూ.75 కోట్లు, సమీకృత శాకాహార, మాంసాహార మార్కెట్ల నిర్మాణాలకు రూ.100 కోట్లు కేటాయించారు. మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో వడ్డీలేని రుణాల కోసం రూ.142 కోట్లు, పురపాలక శాఖలో వివిధ పనుల నిమిత్తం రూ.2,305 కోట్లు.. పారిశుధ్యం, ప్రజారోగ్య విభాగాలకు రూ.525 కోట్లు కేటాయించారు. మిషన్ భగీరథ పథకానికి గత బడ్జెట్‌లో రూ.900 కోట్ల కేటాయింపులుండగా.. రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారు.

ప్రాజెక్టుల నిర్మాణ పనులకు 10,829 కోట్లు!

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టును సాధించాలన్న లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు నిధులు కేటాయించింది. మొత్తం రూ.22,301 కోట్లు కేటాయించింది. ఇందులో ప్రాజెక్టుల నిర్మాణ పనులకు రూ.10,829 కోట్లు వెచ్చించనున్నారు. ఉద్యోగుల జీతభత్యాలకు రూ.2000 కోట్లు, మిగిలిన నిధులను రుణాల చెల్లింపులు, ప్రాజెక్టు నిర్వహణకు ఖర్చు చేయనున్నారు. కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ రుణాలకు రూ.10374 కోట్లు కట్టాల్సి ఉండగా.. రుణ సంస్థలతో సంప్రదింపులు జరిపి, వాటిని దీర్ఘకాలిక రుణాలుగా మార్చుకోవాలని నిర్ణయించారు. అంతేగాక తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థకు తెచ్చుకున్న రుణాలకు కూడా రూ.3200 కోట్లు చెల్లించాల్సి ఉంది. అంటే రుణాలకే రూ.13574 కోట్లు కట్టాలి. గత ప్రభుత్వం తీసుకున్న స్వల్పకాలిక రుణాలను దీర్ఘకాలికంగా మార్చుకుంటే రుణ భారం రూ.9 వేల కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. దీంతో ఈ ఏడాది ప్రాజెక్టుల నిర్మాణ పనులకు రూ.10,829 కోట్లను వెచ్చించవచ్చని లెక్కకట్టింది. గత బడ్జెట్‌లో రూ.33,064 కోట్లను కేటాయించగా.. రూ.27367 కోట్లను వెచ్చించారు.

ప్రాజెక్టుల పనులకు నిధుల కేటాయింపు (రూ.కోట్లలో)

2020-21	2021-22	2022-23	2023-24	2024-25
3607	6424	9277	9381	10,829

మొత్తం 22,301 (రూ. కోట్లలో)
భారీ, మధ్యతరహా 21,082
చిన్ననీటి పారుదల 892
ఆయకట్టు అభివృద్ధి 29
వరద నియంత్రణ, డ్రైనేజీ 298



సాగునీటి బడ్జెట్‌లో దేనికెంత? (రూ.కోట్లలో)

ప్రాజెక్టులు	కేటాయింపులు
పాలమూరు	1285
కాళేశ్వరం	1676
ఎస్ఎల్‌బీసీ	800
సీతారామ	799
కల్వకుర్తి	715
శ్రీపాద ఎల్లంపల్లి	349
ప్రాణహిత-చేవెళ్ల	248



బడ్జెట్‌తో పాటు సామాజిక, ఆర్థిక సర్వే సమర్పణ

వార్షిక బడ్జెట్‌తో పాటు సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. ఆర్థిక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ పెట్టుబడులను ప్రోత్సహించే విధానాలు, వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణ, నూతన ఆవిష్కరణలకు చేయూత, ఉపాధి కల్పన వంటి విధానాలతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని ఈ సర్వే పేర్కొంది. రాష్ట్ర తలసరి ఆదాయం, తలసరి అప్పు, రాష్ట్ర స్థూల ఉత్పత్తి, స్థూల వృద్ధి వంటి వివరాలతోపాటు జనాభాలో స్త్రీపురుషుల నిరుద్యోగ శాతం, ఉపాధి వివరాలను నివేదికలో పేర్కొన్నారు.

మండలి సమావేశాలు మరో నాలుగు రోజులే.!

శాసన సభ బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 2 వరకు పొడిగించినప్పటికీ మండలి సమావేశాలు మరో నాలుగు రోజులు మాత్రమే జరగనున్నాయి. గురువారం మంత్రి శ్రీధర్‌బాబు బడ్జెట్ ప్రసంగం అనంతరం మండలి సమావేశాన్ని చైర్మన్ శనివారానికి వాయిదా వేశారు. బడ్జెట్‌పై సాధారణ చర్చ అనంతరం శనివారం మండలిలో డిప్యూటీ సీఎం భట్టి సమాధానం ఉంటుంది. తర్వాత ఆదివారం సెలవు. 29, 30 తేదీల్లో మండలి సమావేశాలకు విరామం ప్రకటించారు. 31న మండలిలో ప్రవేశపెట్టనున్న ద్రవ్య వినిమయ బిల్లు 2024-25ను ఆమోదించనున్నారు. ఆగస్టు 1, 2న సాధారణ బిల్లులపై మండలిలో చర్చ జరుగుతుంది.

కీలక శాఖలు కేటాయింపులు.. (రూ.కోట్లలో)

21,292	విద్యాశాఖ
16,410	విద్యుత్
9,564	హోం శాఖ
5,790	రోడ్లు భవనాలు
1,064	అడవులు, పర్యావరణం
11,468	వైద్యం, ఆరోగ్యం
29,816	గ్రామీణాభివృద్ధి
774	ఐటీ శాఖ
2,762	పరిశ్రమలు, వాణిజ్యం
9,184	గృహనిర్మాణం
15,594	పట్టణాభివృద్ధి
3,836	పౌరసరఫరాలశాఖ

రుణమాఫీకి 26 వేల కోట్లే!


రూ.31 వేల కోట్లలో రూ.5 వేల కోట్లు కోత.. 'రైతు భరోసా' పెరిగినా బడ్జెట్ మాత్రం అంతే!

- వ్యవసాయ, అనుబంధ రంగాలకు 72,659 కోట్లు
- నీటిపారుదల శాఖ, విద్యుత్ సబ్సిడీ ఇందులోనే!
- మొత్తం బడ్జెట్‌లో 25 శాతం 'సాగు'కే కేటాయింపు
- 10లక్షల మంది రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రేవంత్ రెడ్డి సర్కారు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో 25 శాతం ఆ రంగానికే కేటాయించింది. బడ్జెట్ మొత్తం రూ.2,91,159 కోట్లు కాగా.. ఇందులో వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.72,659 కోట్లు కేటాయించింది. నీటి పారుదల శాఖకు ప్రగతి పద్దులో కేటాయించిన రూ.10,829 కోట్లు, విద్యుత్ సబ్సిడీ కింద ఇచ్చే రూ.11,500 కోట్లను కూడా సాగు బడ్జెట్ లెక్కలోనే కలిపేశారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, పంటల బీమా, పంటలకు బోనస్, విత్తనాల పంపిణీ, ఇతర అనుబంధ రంగాలకు కలిపి ఈ కేటాయింపులు చేశారు. రెండు లక్షల రుణమాఫీ పథకం ఇప్పటికే ప్రారంభమైన సంగతి తెలిసిందే. మొదటి విడతలో రూ.లక్ష వరకు బకాయిలున్న 11.34 లక్షల మందికి రూ.6,035 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకానికి రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని, ఈ నెలాఖరులోగా రూ.లక్షన్నర, ఆగస్టులో రూ.2 లక్షల వరకు మాఫీ పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన 44 లక్షల లోన్ అకౌంట్లకు రుణమాఫీ చేయటానికి రూ.31 వేల కోట్లు అవసరమని పేర్కొంది. అయితే ఈ బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లే కేటాయించారు.

ఇదీ రైతు భరోసా లెక్క

రైతు భరోసా పథకానికి ప్రభుత్వం బడ్జెట్ పెంచలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరానికి రూ.5 వేల చొప్పున రెండు పంటలకు కలిపి ఏడాదికి రూ.10 వేలు ఇవ్వగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక పంటకు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. 2023-24లో రైతుబంధు బడ్జెట్ రూ.15,075 వేల కోట్లు కాగా.. ఇప్పుడు కూడా రూ.15,075 కోట్లే కేటాయించారు. సాగుకు యోగ్యం కాని భూములను రైతు భరోసా నుంచి మినహాయిస్తే ఆర్థిక భారం తగ్గుతుందని, ఆ నిధులే ఎకరానికి రూ.2,500 చొప్పున ఏడాదికి పెరిగే రూ.5 వేలకు సరిపోతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఒకరోజు చర్చించి.. విధి విధానాలు ఖరారు చేస్తామని ప్రకటించింది. గతంలో కోటిన్నర ఎకరాలకు రైతుబంధు ఇచ్చేవారు. ఇప్పుడు సుమారు 30 లక్షల ఎకరాలకు రైతు భరోసా కోత పడే అవకాశాలు ఉన్నాయి.



మిగతా కేటాయింపులు ఇలా..

ఉచిత పంటల బీమా పథకానికి రూ.1,300 కోట్లు కేటాయించింది. రైతు బీమా పథకం రెన్యువల్ కోసం రూ.1,590 కోట్లు కేటాయించింది. భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున పంపిణీ చేసే పథకానికి రూ.1,200 కోట్లు కేటాయించింది. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కోటాలో రూ.1,800 కోట్లు కేటాయించింది. విత్తన సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. రూ.109 కోట్లు కేటాయించింది. వ్యవసాయ యాంత్రీకరణకు కేవలం రూ.50 కోట్లతో సరిపెట్టింది. వ్యవసాయశాఖ ప్రయోగశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు, విస్తరణ విభాగానికి రూ.3.50 కోట్లు, మౌలిక వసతుల కల్పనకు రూ.6 కోట్లు, రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ఏర్పాటుకు రూ.47.53 కోట్లు, రైతుబంధు సమితికి రూ.కోటి చొప్పున కేటాయించింది.

రైతు సంక్షేమానికి పెద్దపీట: తుమ్మల

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నా రూ.72,659 కోట్లు సాగు రంగానికి కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.



శాసనమండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో బడ్జెట్‌ను ఐటీ, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. గురువారం చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన సభ ప్రారంభమవ్వగా మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తరఫున శ్రీధర్‌బాబు బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. గంట 40 నిమిషాల పాటు ఆ ప్రసంగం కొనసాగింది. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 2,91,159 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెడుతున్నట్టు శ్రీధర్‌బాబు తెలిపారు. గతప్రభుత్వ హయాంలో ఆదాయం, అప్పులు, ఇతర మార్గాల ద్వారా సమకూరిన నిధుల వ్యయానికి, రాష్ట్ర పురోగతికి ఏమాత్రం పొంతన లేకపోవడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరిందని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులపై వడ్డీలు చెల్లించేందుకు కూడా అప్పులు తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయినప్పటికీ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ గత డిసెంబర్ నుంచి నేటి వరకు 34,579 కోట్లు వివిధ పథకాల కోసం ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు.



గృహజ్యోతికి రూ.2,418 కోట్లు

- విద్యుత్ సబ్సిడీలన్నింటికీ రూ.16,398 కోట్లు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత/రాయితీతో విద్యుత్ పొందే వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరగడంతో విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సిన సబ్సిడీ నిధులను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మార్చి 1 నుంచి 200 యూనిట్ల దాకా వినియోగించే 45,81,676 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్న విషయం విదితమే. దీనికి బడ్జెట్‌లో రూ.2,418 కోట్లను కేటాయించారు. అయితే రాయితీ పథకాలకు రూ.17,102 కోట్లను కేటాయించాలని ప్రతిపాదనలు వెళ్లగా.. రూ.16,398 కోట్లను కేటాయించారు. దీని కోసం ప్రతి నెల రూ.958.33 కోట్లను విడుదల చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పోను.. డిస్కమ్‌లు ప్రతి నెల రూ.1,386 కోట్ల నష్టాలతో నడుస్తున్నాయని శ్వేతపత్రంలో ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఇక 200 యూనిట్లలోపు వాడే వారికి ఏటా రూ.3,431 కోట్లు అవుతాయని అంచనాలు వేయగా.. ప్రభుత్వం రూ.2,418 కోట్లను కేటాయించింది. వినియోగానికి తగ్గట్లుగా సబ్సిడీ పెరగాల్సి ఉండగా.. వాస్తవిక లెక్కలు లేకపోవడమే సబ్సిడీ కోతకు కారణంగా భావిస్తున్నారు. ఇక, సర్కారు డిస్కంలకు రూ.43,770 కోట్లను చెల్లించాల్సి ఉంది. వివిధ ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన కరెంట్ బిల్లులు రూ.28,842 కోట్లు ఉండగా.. 2016-17 నుంచి 2022-23 దాకా ట్రూఅప్ ఛార్జీల కింద రూ.12,550 కోట్లు, ఇంధన సర్దుబాటు ఛార్జీల కింద రూ.2,378 కోట్లు కలుపుకొని రూ.43,770 కోట్లు డిస్కమ్‌లకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

కుప్పలుగా పాత అప్పు

- అప్పుల కిస్తీలు, వడ్డీలకే రూ.48,331 కోట్లు

హైదరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రేవంత్ సర్కారుకు పాత అప్పుల కుప్ప పెద్ద సంకటంగా మారింది. సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధుల కేటాయింపులకు కూడా రూ.6,71,757 కోట్ల మేర ఉన్న అప్పులే ప్రతిబంధకంగా మారుతున్నాయి. దీనికి తోడు ఈ ఏడాది మరో రూ.62,112 కోట్ల అప్పు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అంటే.. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేసరికి అప్పు రూ.7,33,869 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అయితే, పాత అప్పుల అసలు కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.17,101.37 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. మరో రూ.17,729.77 కోట్లను అప్పుల వార్షిక వడ్డీల కింద చెల్లించాలని తెలిపింది. అంటే ఈ అప్పుల కిస్తీలు, వడ్డీల కింద ఈ ఏడాది రూ.34,831.14 కోట్లను చెల్లించాలి. ఇది కాకుండా ప్రభుత్వ గ్యారెంటీలతో కాళేశ్వరం సాగునీటి పారుదల ప్రాజెక్టు కార్పొరేషన్, తెలంగాణ జలవనరుల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ రూ.90వేల కోట్లకు పైగా అప్పులను రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, బ్యాంకుల కన్సార్షియం నుంచి తీసుకున్నాయి. ఈ రూ.90 వేల కోట్లకు సంబంధించి కిస్తీలు, వడ్డీల కింద ఏటా రూ.13,500 కోట్లను చెల్లించాలి. ఇలా ప్రభుత్వ అప్పుల కిస్తీలు, వడ్డీలు రూ.34,831.14 కోట్లు, కార్పొరేషన్ల అప్పుల అసలు, వడ్డీలు రూ.13,500కోట్లు కలిపి ప్రభుత్వంపై పడే వార్షిక భారం రూ.48,331.14 కోట్లు. ఈ లెక్కన నెలకు రూ.4,027.59 కోట్లు చెల్లించాలి. ప్రస్తుత బడ్జెట్‌లో అప్పుల కిస్తీలు, వడ్డీలకే 16.59% సొమ్ము పోనుంది.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు తగ్గిన కేటాయింపులు

- ఈసారి రూ.29,816 కోట్లు.. రూ.1,610 కోట్ల తగ్గుదల
- పింఛన్లకు రూ.14,861 కోట్లు

హైదరాబాద్, జూలై25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.29,816 కోట్లు కేటాయించింది. 2023-24లో ఈ శాఖకు కేటాయించిన రూ.31,426 కోట్లతో పోల్చితే ఈసారి రూ.1,610 కోట్లు తగ్గింది. చేయూత పథకం కింద దివ్యాంగులు, వయోవృద్ధులు, ఇతర కేటగిరీల వారికి పింఛను ఇచ్చేందుకు బడ్జెట్‌లో రూ.14,861 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వం ఆసరా పేరిట అమలు చేసిన ఇదే పథకానికి రూ.12 వేల కోట్లు ప్రకటించగా దాంతో పోల్చితే రూ.2,861 కోట్లు పెరిగినప్పటికీ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పింఛను పెంపుపై సంబంధిత వర్గాల్లో సందిగ్ధం నెలకొంది. దివ్యాంగులకు రూ.4వేలున్న పింఛన్‌ను రూ.6వేలు, వయోవృద్ధులు, ఇతరులకు రూ.2వేలున్న పెన్షన్‌ను రూ.4వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ సర్కారు హామీ మేరకు ఎప్పట్లోగా పెంపు చేస్తారనే దానిపై స్పష్టతలేదు. ప్రస్తుతం చేయూత పింఛను పథకం లబ్ధిదారుల సంఖ్య ప్రకారం ప్రభుత్వం ఏటా రూ.11,548 కోట్లు వెచ్చిస్తోంది. ఉన్నవారికే అదనంగా పింఛను పెంచితే ఏటా రూ.21,600 కోట్లు అవసరం ఉంటుందని అంచనా. కాగా ఈ బడ్జెట్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది. 'ఇందిరా మహిళాశక్తి' పథకం పేరిట ఎస్‌హెచ్‌జీ సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రూ.50.41కోట్లు ప్రకటించింది. అదేవిధంగా ఇందిరా జీవిత బీమా పథకం ద్వారా రాష్ట్రంలోని 63.86లక్షల మంది మహిళలకు రూ.10లక్షల బీమా కల్పించనున్నట్లు పేర్కొంది.




ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి 50,180 కోట్లు

- దళిత బంధుకు రూ.2వేల కోట్లు.. మేడారం జాతరకు రూ.52 కోట్లు
- కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌కు రూ.3,585 కోట్లు
- బీసీ శాఖకు రూ.9,200 కోట్లు.. మహిళా, శిశు సంక్షేమానికి రూ.2,736 కోట్లు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక నిధుల కింద రూ.50,180 కోట్లు కేటాయించింది. ఇందులో ఎస్సీల ప్రత్యేక నిధికి రూ.33,124 కోట్లు, ఎస్టీకి రూ.17,056 కోట్లు ఇచ్చింది. 2023-24 బడ్జెట్‌లో ఎస్టీ ప్రత్యేక నిధికి రూ.15,232 కోట్లు, ఎస్సీలకు రూ.36,750కోట్లు కలిపి మొత్తం రూ.51,982 కోట్లు కేటాయింపులు జరిగాయి. వాటితో పోలిస్తే ఈసారి కేటాయింపులు స్వల్పంగా తగ్గాయి. గత బడ్జెట్‌తో పోలిస్తే బీసీ సంక్షేమానికి, మహిళా, శిశు సంక్షేమ శాఖకు, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు కేటాయింపులు ఈసారి స్వల్పంగా పెరిగాయి. బీసీ సంక్షేమ శాఖకు అనుబంధంగా ఉన్న వివిధ కులాల కార్పొరేషన్లకు గత ప్రభుత్వం కేటాయించిన విధంగానే రూ.50కోట్లు, రూ.65కోట్ల చొప్పున కేటాయించగా, వెనుకబడిన కులాల కార్పొరేషన్ (ఎంబీసీ)కు రూ.400కోట్లు, బీసీ కార్పొరేషన్‌కు రూ.700 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో బీసీ శాఖకు రూ. 6,229 కోట్లు ఇవ్వగా ఈసారి రూ.9,200 కోట్లు ఇచ్చారు. ఎస్సీ సంక్షేమ శాఖకు రూ.7,638 కోట్లు కేటాయించారు. దళితబంధు పథకానికి బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ.21,072కోట్లను కేటాయించగా అందులో రూ.17,700 కోట్ల మేర నిధులను దళిత బంధుకు ఇచ్చారు. ఇక, ప్రస్తుత బడ్జెట్‌లో గిరిజన సంక్షేమశాఖకు రూ.3,969 కోట్లు, మహిళా, శిశు సంక్షేమ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ శాఖకు రూ.2,736 కోట్లు కేటాయించారు. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు ఈ బడ్జెట్‌లో రూ.3,585 కోట్లు కేటాయించగా 2023-24లో జరిగిన కేటాయింపుల కంటే ఇది రూ.375కోట్లు అదనం. ఇక, మేడారం జాతరకు సర్కారు రూ.52 కోట్లు కేటాయించింది.

గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు

గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్సీ సమీకృత గురుకులాల నిర్మాణానికి రూ.2వేల కోట్లు, గిరిజన గురుకుల ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.200కోట్లు, బీసీ రెసిడెన్షియల్ హైస్కూల్, జూనియర్ కళాశాలలకు రూ.307 కోట్లు కేటాయించింది. కొత్తగా ఏర్పాటైన గిరిజన తండాల గ్రామ పంచాయతీల్లో.. పంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.300కోట్లు, గిరిజన ఆవాసాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.200కోట్లు, రహదారి సౌకర్యం లేని తండాలకు రహదారుల కల్పనకు రూ.150కోట్లు ఇచ్చారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యానిధి పథకం అమలుకు కూడా నిధులు కేటాయించారు.




ఆరోగ్యశ్రీ నిధుల్లో కోత

రూ.1,065 కోట్లు కేటాయింపు.. గత ఏడాది కంటే తక్కువే

- నర్సింగ్, మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం రూ.742 కోట్లు
- ప్రజల డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులకు రూ.200 కోట్లు
- వైద్య రంగానికి రూ.11,468 కోట్లు.. బడ్జెట్‌లో 3.93 శాతం

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు ఒకవైపు వైద్య విద్యకు పెద్దపీట వేస్తూనే.. మరోవైపు ఆరోగ్యశ్రీ పథకానికి నిధుల్లో కోత పెట్టింది. ఆస్పత్రులు, మెడికల్, నర్సింగ్ కాలేజీల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించగా.. ఆరోగ్యశ్రీకి గత ఏడాది కంటే తక్కువ కేటాయించింది. వైద్య రంగానికి రూ.11,468 కోట్లు కేటాయించగా.. ఇది మొత్తం బడ్జెట్‌లో 3.93 శాతం. ఇందులో ప్రగతి పద్దు కింద రూ.5,725 కోట్లు చూపించింది. జీతభత్యాలు మినహా అభివృద్ధి పనులకు కేటాయించే మొత్తాన్ని ప్రగతి పద్దు కింద పరిగణిస్తారు. గత ఏడాది బీఆర్ఎస్ సర్కారు వైద్య శాఖకు రూ.12,161 కోట్లు కేటాయించింది. అందులో ప్రగతి పద్దు కింద రూ.6,566 కోట్లు చూపించింది. గత బడ్జెట్‌తో పోలిస్తే కేటాయింపులు రూ.693 కోట్లు తగ్గాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, మెడికల్, నర్సింగ్ కాలేజీలకు ప్రాధాన్యమిస్తూ రూ.1,002 కోట్ల కేటాయింపులు చేసింది. ఇందులో జిల్లాకొక నర్సింగ్ కాలేజీ కోసం రూ.200 కోట్ల కేటాయించింది. కేసీఆర్ న్యూట్రియంట్ కిట్స్‌కు కేటాయింపులు చేయలేదు. 2022-23 బడ్జెట్‌లో వైద్య రంగానికి 4.37 శాతం నిధులు కేటాయిస్తే, అది గత ఏడాది 4.18కి, ఈసారి 3.93 శాతానికి తగ్గింది. ఈసారి బడ్జెట్‌లో ఆరోగ్యశ్రీకి రూ.1,065 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.1,101 కోట్లు కేటాయింపులు చూపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. ఈ పథకంలో వైద్య చికిత్సలతో పాటు వాటి ప్యాకేజీ ధరలను కూడా 20-25 శాతం పెంచారు. ఈ లెక్కన ఆరోగ్యశ్రీకి కేటాయింపులు పెంచాల్సి వుండగా తగ్గించారు. ఆయుష్మాన్ భారత్ మ్యాచింగ్ గ్రాంటు రూ.168 కోట్లుగా చూపారు. గత బడ్జెట్‌లో రూ.115 కోట్లుగా చూపించారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగిన డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు విధానం త్వరలోనే ప్రవేశపెడతామని ప్రభుత్వం ప్రకటించింది. దీనికి బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించింది.





దేవాదాయ శాఖకు రూ.237 కోట్లు



దేవాదాయ శాఖకు ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో రూ.237 కోట్లు కేటాయించింది. నిర్వహణ పద్దు కింద రూ.47.38 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.189.68 కోట్లు కేటాయించింది. అర్చక ఉద్యోగుల వేతనాలు, కామన్‌గుడ్ ఫండ్(సీజీఎఫ్) కింద ఆలయాల నిర్వహణ, మరమ్మతులు, బోనాల జాతర నిర్వహణ ఇతర చెల్లింపులకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

బీజేపీ మెప్పు కోసమే కేసీఆర్ విమర్శలు: సీతక్క



కేంద్ర బడ్జెట్‌పై స్పందించని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్‌పైన విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ అసెంబ్లీలో బుధవారం తీర్మానం ప్రవేశపెడితే దానిపై మాట్లాడేందుకు కేసీఆర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడని కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శించడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెప్పు కోసమే కేసీఆర్.. రాష్ట్ర బడ్జెట్‌పైన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆరు నెలలుగా ఆయన అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. అసెంబ్లీ ఆవరణలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

అభూత కల్పన.. అంకెలగారడీ

- మైనార్టీల సంతుష్టీకరణే కాంగ్రెస్ ఏకైక లక్ష్యం
- వారికి ఏకంగా 30% నిధుల పెంపు: కిషన్ రెడ్డి



హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అభూతకల్పన, అంకెల గారడీ, ఆర్భాటం, సంతుష్టీకరణ తప్ప రాష్ట్ర బడ్జెట్‌లో ఏమీ లేదని కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటినీ తుంగలో తొక్కిందని, ప్రతి సంవత్సరం రైతులకు సీజన్ ముందు ఇవ్వాల్సిన పంటపెట్టుబడి సాయానికి ఎలాంటి కేటాయింపులు చేయలేదని ఆరోపించారు. 'ఆసరా పెన్షన్ల ప్రస్తావనే లేదు. పెన్షన్లు పెంచుతామని మోసం చేశారు. మహిళలకు ప్రతినెలా రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ బడ్జెట్‌లో మాత్రం ఆ ఊసే ఎత్తలేదు. దళితులు, గిరిజనుల సంక్షేమం కోసం కేటాయింపులు తగ్గిపోయాయి. మొత్తం ప్రపంచం ఏమైపోయినా ఫరవాలేదు... మైనారిటీల సంతుష్టీకరణ మాత్రమే చాలనే కాంగ్రెస్ ఆలోచన మరోసారి ఈ బడ్జెట్లో బట్టబయలైంది. 2023-24లో రూ.2వేల కోట్లుగా ఉన్న మైనార్టీ సంక్షేమ నిధులను ఏకంగా రూ.3,003కోట్లకు పెంచారు. అంటే ఒక్క ఏడాదిలోనే 30 శాతం పెంచేశారు' అని ఆరోపించారు. గత సర్కారు విచ్చలవిడిగా చేసిన అప్పులు కట్టేందుకు, ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు మరిన్ని అప్పులు చేస్తున్నారని విమర్శించారు.

బడ్జెట్టా.. అప్పుల పత్రమా?

- కాంగ్రెస్+రాష్ట్ర బడ్జెట్=గాడిద గుడ్డేనా?: సంజయ్



హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టింది ఆర్థిక బడ్జెట్టా? లేక అప్పుల పత్రమా? స్పష్టం చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్+రాష్ట్ర బడ్జెట్=గాడిద గుడ్డేనా అంటూ ఎద్దేవా చేశారు. గాడిద గుడ్డు పెట్టడం ఎంత నిజమో.. కాంగ్రెస్ హామీలను అమలు చేయడం అంతే నిజమంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. '12 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇచ్చిన మీరు 31 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామనడం నిరుద్యోగులను మోసగించడమే. రూ.లక్షన్నర కోట్లతో మూసీ రివర్ ఫ్రంట్ చేపడతామని చెప్పి.. పైసా కేటాయించలేదు. రంజాన్ వేడుకలకు రూ.33కోట్లు కేటాయించి.. హిందువుల పండుగలకు పైసా కేటాయించకపోవడం మతతత్వం కాదా? 'అని ప్రశ్నించారు. కాగా, రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలకు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ఏం సంబంధమో ఆర్థిక మంత్రి సమాధానం చెప్పాలని బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్ డిమాండ్‌చేశారు. మహిళా సంఘాలు ఆయా బ్యాంకుల నుంచి రూ.లక్ష కోట్ల రుణం తీసుకుని వడ్డీతో సహా తిరిగి చెల్లించాయని, ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వ సాయంగా ప్రకటించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

సభలో భజన బృందం ఎక్కువైంది

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎన్నికల్లో ఓడించి కామారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో అనవసరంగా గెలిచి అసెంబ్లీకి వచ్చానన్న ఆయన సభ జరుగుతున్న తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నేత కాటిపల్లి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం మాట్లాడుతూ.. సభలో భజన బృందం ఎక్కువైపోయిందన్నారు. సభలో ప్రజా సమస్యలు ప్రస్తావించాలనే ఆలోచన ఏ నేతకు లేదని, కొందరికి అసెంబ్లీ పేకాట క్లబ్‌గా మారిపోయిందని విమర్శించారు. ఒకరిమీద ఒకరు కామెంట్లు, జోకులు వేసుకుంటూ సభా సమయం వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం మాంసాహార భోజనం చేస్తూ గడిపేస్తున్నారని అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై... ఎనిమిది, ఎనిమిది కలిపితే సున్నా అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం అన్నారు.

రేవంత్ దెబ్బకు మీడియా పాయింట్‌కు కేసీఆర్

- విప్‌లు లక్ష్మణ్, ఐలయ్య, రామచంద్రు, శ్రీనివాస్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా బడ్జెట్ ఉందని ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, రామచంద్రు నాయక్, అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడారు. రేవంత్ రెడ్డి దెబ్బకు కేసీఆర్ మీడియా పాయింట్‌కు రావాల్సి వచ్చిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ వైఖరి మార్చుకోకపోతే ఈసారి మీడియా పాయింట్‌కు కూడా రాలేరని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 30వేల ఉద్యోగాలు ఇస్తే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేశామని, భవిష్యత్తులోనూ పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ సర్కారు సాగునీటి ప్రాజెక్టుల కోసం అడ్డగోలుగా నిధులు ఖర్చు పెట్టి కమీషన్లు కొట్టేసిందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విమర్శించారు. వాస్తవ పరిస్థితుల మేరకు తమ ప్రభుత్వం ప్రాజెక్టులకు నిధులు కేటాయించిందన్నారు. కేసీఆర్ చేసిన నిర్వాకంతో త్వరలోనే జైలుకు పోతారని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు.

ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటుకు 500 కోట్లు

హైదరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటుకు రూ. 500 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులను చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నేషనల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులను తీసుకవస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మండలానికి మూడు చొప్పున అంతర్జాతీయ స్థాయిలో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుత బడ్జెట్‌లో రూ.500కోట్లను కేటాయించారు. అలాగే.. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు రూ.500కోట్ల నిధులను కేటాయించారు. ఇందులో మహిళా యూనివర్సిటీకి రూ. 100కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కోసం రూ. 100కోట్లను కేటాయించారు. రాష్ట్రంలోని మిగతా వర్సిటీలకు ప్రగతి పద్దు కింద రూ.300 కోట్లను కేటాయించారు. సాధారణంగా ప్రతీ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో యూనివర్సిటీల నిర్వహణ, జీతభత్యాలకు నిధులను కేటాయిస్తుంటారు. ఈసారి వర్సిటీల అభివృద్ధికి కూడా నిధులను కేటాయించడం విశేషం. అదేవిధంగా.. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల భవనాల కోసం రూ.5.3కోట్లు, న్యూ ఇండియా లిటరసీ ప్రొగ్రాంకు రూ.7.01 కోట్లు, స్టేట్‌బుక్స్‌కు రూ. 18.29 కోట్లు, పాఠ్య పుస్తకాల పంపిణీకి కోసం రూ. 46.29 కోట్లను కేటాయించారు.

బడ్జెట్‌పై చీల్చి చెండాడతాం

అంతా ట్రాష్.. గ్యాస్.. ఓ పాలసీ లేదు.. గొర్రెల పథకం, దళిత బంధు ప్రస్తావనే లేదు

- ఇది రైతు శత్రు ప్రభుత్వం
- రైతు బంధు, భరోసాలో ఆంక్షలతో మోసం చేశారు: కేసీఆర్
- పదేళ్లలో తొలిసారి మీడియా పాయింట్‌కు బీఆర్ఎస్ అధినేత



అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): "బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం రైతుల్ని వంచించింది. వృత్తి కార్మికుల్ని వంచించింది. అంతా ట్రాష్. గ్యాస్. ఈస్ట్‌మన్ కలర్ మాదిరిగా చెప్పారు. ఓ కథ చెప్పినట్లు ఉంది. చిల్లర మల్లర స్పీచ్‌లా ఉంది. బడ్జెట్ ప్రసంగంలా లేదు. పారిశ్రామిక పాలసీ లేదు. ఐటీ పాలసీ లేదు. పేదలకు సంబంధించి ఈ సర్కారుకు ఓ పాలసీ అంటూ లేదు. ఇది పేదల బడ్జెట్ కాదు. రైతు బడ్జెట్ కాదు. ఎవరి బడ్జెట్ అనేది విశ్లేషణలో తెలుస్తుంది. భవిష్యత్తులో దీన్ని చీల్చి చెండాడతాం" అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. అంకెలను ఒత్తి ఒత్తి పలకడం తప్ప ఆర్థిక మంత్రి కొత్తగా చెప్పిందేమీ లేదన్నారు. శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా గురువారం ఆయన అసెంబ్లీకి వచ్చారు. బడ్జెట్ ప్రసంగం 12:02 గంటలకు ప్రారంభం కాగా.. 25 మంది పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి 12:04 గంటల సమయంలో ఆయన సభలోకి అడుగుపెట్టారు. బడ్జెట్ ప్రసంగం 1:50 గంటలకు ముగియగా.. దానికంటే రెండు నిమిషాల ముందే బయటికి వెళ్లిపోయారు. అనంతరం పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. "బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లేలా ఉంది. ఏ ఒక్క వర్గానికి స్పష్టమైన హామీ లేదు. రైతులను పొగుడుతున్నట్లు పొగుడుతూనే వెన్నుపోటు పొడిచింది. రైతు బంధు, భరోసాలో అనేక ఆంక్షలు పెట్టబోతున్నట్లు చెప్పి రైతుల్ని మోసం చేశారు. గతంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని కాంక్షించి అనేక పథకాలు ప్రవేశపెట్టాం. ఒక్క పథకంపై కూడా ఇప్పుడు స్పష్టత లేదు. యాదవులకు గొర్రెల పెంపకం పథకం మూసివేసినట్లు అర్థమవుతోంది. దళిత బంధు పథకం ప్రస్తావన లేదు. దళిత సమాజంపై నిర్లక్ష్యానికి ఇంతకంటే మరో నిదర్శనం అవసరం లేదు. మత్స్యకారులకు మాత్రమే కాదు.. ఎవరికీ చెప్పుకోదగ్గ భరోసా లేదు" అని దుయ్యబట్టారు. ఒక్క కొత్త సంక్షేమ పథకం లేదని, మహిళల పథకాలపైనా స్పష్టత లేదని విమర్శించారు. "దురదృష్టం ఏమిటంటే.. ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత 6 నెలలు సమయం ఇవ్వాలనుకున్నాం. రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణకు రెండు దఫాలు రైతు బంధు ఇచ్చాం. వీరు ఎగ్గొడతామంటున్నారు. రైతులకు ఇచ్చిన డబ్బులను దుర్వినియోగం చేసినట్లు దురదృష్టకరమైన వ్యాఖ్యలు చేశారు. ఇది రైతు శత్రు ప్రభుత్వం" అని మండిపడ్డారు. ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని, విద్యుత్తు, నీరు సరఫరా చేయడం లేదని, చాలా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతు బంధు, రైతు భరోసా ఎప్పుడు ఇస్తారని అడిగితే కనీసం సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. మీడియా కేసీఆర్‌ను పలు అంశాలపై ప్రశ్నించేందుకు ప్రయత్నించగా.. తాను చెప్పాలనుకున్నది చెప్పి వెళ్లిపోయారు.

పదేళ్లలో తొలిసారి మీడియా పాయింట్‌కు...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో తొలిసారి కేసీఆర్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్లు సీఎం హోదాలో ఉన్న ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడే సందర్భం రాలేదు. గత ఏడాది డిసెంబరులో అధికారం కోల్పోయి.. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పటికీ ఆయన అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాలేదు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసేందుకు వచ్చినా.. మీడియాతో మాట్లాడలేదు. అంతకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీలోకి వచ్చిన కేసీఆర్‌కు పార్టీ ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి నేరుగా ఆయన తన కొత్త చాంబర్‌కు చేరుకున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతకు ప్రభుత్వం అసెంబ్లీ ఆవరణలోని ఔటర్ లాబీలో ప్రత్యేక చాంబర్ కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే, ఇన్నర్ లాబీలోని చాంబర్‌ను తమకు కేటాయించాలని బీఆర్ఎస్ కోరినా ప్రయోజనం లేకుండాపోయింది. ప్రస్తుత చాంబర్ చిన్నదిగా ఉందని, గతంలో ఉన్నట్లు ఇన్నర్ లాబీలోనే కేటాయించాలని బీఏసీ సమావేశంలో కూడా కోరారు. ఈ నేపథ్యంలో, తొలిసారిగా అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ పది నిమిషాలపాటు కొత్త చాంబర్‌లో ఉన్నారు.

గ్యారెంటీలకు నిధులేవి?

సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం: హరీశ్



హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులేవని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్.. ఎన్నికల్లో గ్యారెంటీల గారడీ చేసిందని, ఇప్పుడు బడ్జెట్‌లో అంకెల గారడీ చేసింది తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఆసరా పింఛన్లు పెంచుతామన్నారు, బడ్జెట్‌లో మాత్రం నిధులు పెంచలేదు. ఆటో కార్మికులకు రూ.12 వేలు, రూ.4వేల నిరుద్యోగ భృతి, మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసేలేదు. కొత్త రేషన్ కార్డుల ప్రస్తావన లేదు. రూ.57వేల కోట్లు అప్పు తెస్తామంటున్నారు. ఇది మా ప్రభుత్వం కన్నా రూ.17వేల కోట్లు ఎక్కువ. నెలకు రూ.7వేల కోట్ల వడ్డీ కడుతున్నామని రాష్ట్ర ఆర్థికమంత్రి చెబుతున్నారు. బడ్జెట్ కాపీలో మాత్రం వచ్చే ఏడాదికి చెల్లించాల్సిన వడ్డీ రూ.17,729 కోట్లని చూపించారు. ఇందులో ఏది నిజమో చెప్పాలి. ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో దానికి రూ.15,470కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులతో ఒకేసారి మాఫీ ఎలా సాధ్యం" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆత్మస్తుతి, పరనిందతప్ప ప్రభుత్వ మొదటి బడ్జెట్‌లో ఎలాంటి దశా దిశాలేదని ఆయన విమర్శించారు.

పింఛన్ల పెంపు మాటే లేదు: కేటీఆర్



హైదరాబాద్, జూలై25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన 2024-25 బడ్జెట్‌లో వయోవృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలకు ఇచ్చే పింఛను పెంపు మాటే లేదని, నిరుద్యోగ భృతి రూ.4వేలకు సంబంధించిన అంశమే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టింది 'దోకేబాజ్ బడ్జెట్' అంటూ ఆయన విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌పై గురువారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. బడ్జెట్‌లో ఎటువంటి విధానాలు పాటించలేదని, 6గ్యారెంటీల అమలును ఎక్కడా ప్రస్తావించలేదని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై శ్రద్ధ చూపలేదని, మౌలిక వసతులకు ఏమాత్రం నిధులు కేటాయించలేదని అన్నారు. నేతన్నలు, ఆటో డ్రైవర్లకు అండా దండా చూపని దండగమారి బడ్జెట్ ఇదని విమర్శించారు.

సోనియా, రాహుల్, ఖర్గేల నాయకత్వంలో..

అత్యుత్తమ బడ్జెట్ పెట్టిన రేవంత్, భట్టి

కేసీఆర్‌ది ఊహల బడ్జెట్.. మాది అభివృద్ధి బడ్జెట్.. రైతు ప్రభుత్వమని నిరూపించుకున్నం

హైదరాబాద్ దశ మారేలా రేవంత్ ఆలోచన.. 10 వేల కోట్ల కేటాయింపు మంచి నిర్ణయం

కేటీఆర్.. గ్యారెంటీల అమలుపై జనంలోకి వెళ్లి చూడు: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సోనియా, రాహుల్, ఖర్గేల నాయకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అత్యుత్తమంగా ఉందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. వ్యవసాయానికి రూ.72 వేల కోట్లు కేటాయించడం ద్వారా తమది రైతు ప్రభుత్వమని మరోమారు నిరూపించుకున్నట్లయిందని చెప్పారు. తెలంగాణ భవన్‌లో కూర్చుని మాట్లాడడం కాదని, హామీలు అమలవుతున్నాయో లేదో జనంలోకి వెళ్లి చూస్తే తెలుస్తుందని కేటీఆర్‌కు సూచించారు. గాంధీభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. కేసీఆర్‌ది ఊహల, ప్రచార బడ్జెట్ అయితే.. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టింది వాస్తవాలు ప్రతిబింబించే బడ్జెట్ అని చెప్పారు. "భట్టి పెట్టిన బడ్జెట్ బిందెలో నీళ్లు ముంచుకుని తాగినట్లుగా ఉంది. కేసీఆర్ బడ్జెట్ చెరువులో నీళ్లు తెచ్చుకుని తాగినట్లుగా, దావత్‌కు వెళ్లి మటన్ బిర్యానీ తిని రావచ్చన్నట్లుగా ఉంటది. దావత్‌ల మటన్ బిర్యానీ వండుతున్నమంటూ ప్రచారం చేస్తరు. పొయ్యిమీద గిన్నెలు పెడతరు గానీ అందులో మటన్ ఉండదు. మనం మటన్ కోసం ఎదురు చూస్తనే ఉంటం. బడ్జెట్ విషయంలో కేసీఆర్ ప్రజల్ని ఇట్లనే మోసం చేసిండు" అని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. పప్పు, మజ్జిగ, ఊరగాయ ఉన్నయి.. ఇవి వేసుకుని తృప్తిగా తినండంటూ నిజం చెప్పినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ ఉంటుందన్నారు. మంచి బడ్జెట్ పెట్టిన రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం మంచి నిర్ణయమన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తే పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తారని, కార్మికులకూ మేలు జరుగుతుందని చెప్పారు. కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల మేర అప్పులు చేయడానికి ప్రాధాన్యమిస్తే.. రేవంత్, భట్టి అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. ఆరు గ్యారెంటీలను గంగలో కలిపారన్న కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. తెలంగాణ భవన్‌లో కూర్చొని మాట్లాడడం కాదని, మంత్రి పొన్నంతో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కితే; మంత్రి తుమ్మలతో కలిసి రైతుల వద్దకు వెళితే; భట్టితో కలిసి ప్రజల దగ్గరకు వెళితే పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుస్తుందని చెప్పారు. కేసీఆర్ ఒక విమర్శ చేస్తే దానికి రెట్టింపు చేసేవాళ్లు తమ దగ్గర వంద మంది ఉన్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



- నానాటికి పెరుగుతున్న వైనం
- ఈసారి తీసుకోనున్న అప్పు రూ.62,112 కోట్లు
- రూ.7,33,869 కోట్లకు పెరగనున్న రాష్ట్ర మొత్తం అప్పు

హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొత్తం అప్పు మరింతగా పెరగబోతోంది. దీని వల్ల ప్రజలపై తలసరి అప్పు భారం కూడా పెరగనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ.6,71,757 కోట్ల అప్పు చేసినట్టు గురువారం శాసన సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.62,112 కోట్ల అప్పు తీసుకోబోతున్నట్టు ప్రతిపాదించింది. దీన్ని కలిపితే రాష్ట్ర మొత్తం అప్పు రూ.7,33,869 కోట్లకు చేరనుంది. రాష్ట్ర అర్థ గణాంక సంచాలకుల కార్యాలయం ఇటీవల ప్రకటించిన వివరాల ప్రకారం రాష్ట్ర జనాభా 3,77,25,000. రాష్ట్ర మొత్తం అప్పును ఈ జనాభాతో భాగిస్తే తలసరి అప్పు రూ.1,94,531 ఉంటుందని తేలుతోంది. రాష్ట్ర అప్పు నానాటికీ పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆరింటిలో.. కొన్నింటికి గ్యారెంటీ లేదు!

బడ్జెట్‌లో కేటాయింపులను చూపలేదు

- బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి రూ.4,084 కోట్లు
- రైతు భరోసాకు 15 వేల కోట్లు
- గృహజ్యోతికి రూ.2,418 కోట్లు.. ఇళ్లకు రూ.7,740 కోట్లు
- పింఛన్లకు రూ.14,861 కోట్లు



హైదరాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో కొన్ని పథకాలకు తాజా బడ్జెట్‌లో నిధులను కేటాయించలేదు. దాంతో ఈ పథకాలు ఈ ఆర్థిక సంవత్సరంలో అమల్లోకి వస్తాయా? అనే అనుమానం వ్యక్తం అవుతోంది.

- కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల్లో మొదటిది మహాలక్ష్మి. ఈ స్కీమ్‌లో మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకం ఇంకా అమల్లోకి రాలేదు. ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు జరపలేదు. మహాలక్ష్మిలో భాగమైన రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం మాత్రం ప్రారంభమైంది. ఈ పథకానికి రూ.723 కోట్లను కేటాయించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకానికి రూ.4,084 కోట్ల కేటాయింపులు జరిగాయి.
- రెండో గ్యారెంటీ అయిన రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇంకా అమల్లోకి రావాల్సి ఉన్న ఈ పథకానికి రూ.15,075 కోట్లను కేటాయించారు. గతంలో అమలైన రైతుబంధుకు ఇంతే మొత్తంలో కేటాయింపులు ఉండేవి. రైతు భరోసాలోని మరో పథకం 'వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు' స్కీమ్‌కు రూ.1,200 కోట్లను కేటాయించారు. ఈ పథకం కూడా ఇంకా ప్రారంభం కావాల్సి ఉండగా.. వరికి బోనస్ పథకానికి రూ.1,800 కోట్ల మేర కేటాయింపులు జరిగాయి.
- మూడో గ్యారెంటీ అయిన గృహజ్యోతి ఇప్పటికే అమల్లోకి వచ్చింది. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తును అందించే ఈ పథకానికి రూ.2,418 కోట్లను ప్రకటించారు.
- నాలుగో గ్యారెంటీ అయిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇంకా అమల్లోకి రావాల్సి ఉంది. ఈ పథకానికి రూ.7,740 కోట్లను కేటాయించారు.
- విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసా కార్డులు ఇచ్చే ఐదో గ్యారెంటీ అయిన యువ వికాసాన్ని గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.
- చేయూత పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని ఆరో గ్యారెంటీ ఇచ్చారు. గత బడ్జెట్‌లో ఆసరా పింఛన్లకు రూ.12 వేల కోట్లను కేటాయించగా.. ఈ సారి రూ.14,861 కోట్లను కేటాయించారు. అయితే.. పింఛన్లను రూ.4 వేలకు పెంచాలంటే.. ఈ కేటాయింపులు సరిపోవని తెలుస్తోంది. మొత్తమ్మీద ఆరు గ్యారెంటీలకు రూ.47,167 కోట్లను కేటాయించారు.



తెరుచుకోనున్న నిజాం షుగర్స్!

బోధన్, మెట్‌పల్లి, మెదక్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు రూ.132 కోట్లు

హైదరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల శాఖకు ఈ సారి బడ్జెట్టులో నిరుటితో పోలిస్తే తక్కువ కేటాయింపులు దక్కాయి. నిరుడు రూ. 4037కోట్లు కేటాయించగా, ఈసారి రూ.2762కోట్లు కేటాయించారు. ఈ సారి పారిశ్రామిక రాయితీలు ఇచ్చే అవసరం పెద్దగా లేకపోవడంతో కేటాయింపులు తగ్గాయి. గతంతో పోలిస్తే రూ.1275కోట్లు తగ్గాయి. ఈసారి కొత్త పథకాలకు అధిక నిధులు కేటాయించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా నిజాం చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు కాంగ్రెస్ సర్కారు రూ. 138 కోట్లు కేటాయించింది. బోధన్, మెట్‌పల్లి, మెదక్‌లో ఉన్న ఈ ఫ్యాక్టరీలు డిసెంబరు-2015లో మూతపడ్డాయి. వీటిలో తొలుత మెట్‌పల్లి ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక స్కిల్ యూనివర్సిటీ కోసం రూ.75కోట్లు, చేనేత కార్మికుల సంక్షేమానికి 355కోట్లు కేటాయించారు. పరిశ్రమల విద్యుత్తు రాయితీకి రూ.250కోట్లు, పావలా వడ్డీకి రూ.250కోట్లు, ఇతర రాయితీలు, నిమ్జ్ భూసేకరణకు రూ.125కోట్లు, ముచ్చెర్ల ఫార్మాసిటీ స్థానంలో కొత్తగా ప్రకటించిన ఔషధ గ్రామాల్లో భూసేకరణ కోసం రూ.50కోట్లు, ఇతర రాయితీలకు మొత్తం రూ.986కోట్లు కేటాయించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి నిరుడు రూ.366కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.774కోట్లకు పెంచారు.

జగన్ బాధితులూ.. లేచి నిలబడండి


- అసెంబ్లీలో చంద్రబాబు సూచన
- నిలబడ్డ 90 శాతం ఎమ్మెల్యేలు
- పవన్, లోకేశ్, పలువురు మంత్రులూ

అమరావతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గత జగన్ సర్కారు బాధితుల్లో సామాన్యులే కాదు ఎంతో మంది ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి నారా లోకేశ్.. ఇంకా చాలా మంది ఈ జాబితాలో ఉన్నారు. గత ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల్లో తామూ బాధితులమేనంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు... అసెంబ్లీలో పవన్, లోకేశ్, పలువురు మంత్రులతో సహా 90 శాతం మంది ఎమ్మెల్యేలు లేచి నిలబడ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో గురువారం ఈ ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయంటూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ బాధితుల్లో తాను, పవన్, స్పీకర్, అచ్చెన్న, నారాయణ, లోకేశ్, ఇతర మంత్రులు ఉన్నారంటూ పేర్లు ప్రస్తావిస్తూ సభ్యుల వైపు చూశారు. ఈ సందర్భంగా 'నేను, నేను'.. అంటూ ఎమ్మెల్యేలు చేతులెత్తారు. దీంతో చంద్రబాబు... 'జగన్ ప్రభుత్వంలో శారీరక, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు గురై అక్రమ కేసుల్లో చిక్కుకున్న బాధితులు ఒకసారి లేచి నిల్చోండి' అని అన్నారు. దీంతో పవన్, లోకేశ్, మంత్రులతో సహా దాదాపు 90 శాతం మంది ఎమ్మెల్యేలు లేచి నిలబడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన పని సభలో నవ్వులు పూయించింది.



చంద్రబాబు సూచనతో సభలో నిలుచున్న కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు

లోకం తీరు



తెలంగాణకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం!

- ప్రధాని మోదీకి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల లేఖ

న్యూఢిల్లీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి.. ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ 8మంది ఎంపీలు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు గురువారం లేఖ రాశారు. విభజన చట్టంలో రాష్ట్రానికి ఐఐఎం, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, తొమ్మిది ఉమ్మడి జిల్లాలకు వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులను కేటాయిస్తామని హామీలు ఇచ్చి నెరవేర్చలేదని గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘు రామిరెడ్డి, బలరాంనాయక్, సురేష్ షెట్కార్ పాల్గొన్నారు. తెలంగాణ ప్రజల నమ్మకాన్ని బీజేపీ ఎంపీలు వమ్ము చేశారని ఆరోపించారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ న్యాయం చేయలేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పోరాటం చెయ్యాలని సూచించారు. సీఎం రేవంత్ సూచనల ప్రకారం తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

వివేకా హత్య కేసులో దస్తగిరి సాక్షే

- ఆయన పిటిషన్‌ను అనుమతించిన సీబీఐ కోర్టు
- ఎంపీ అవినాశ్‌రెడ్డి సహా ఇతర నిందితులకు ఎదురుదెబ్బ

హైదరాబాద్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్ బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. వివేకాను హత్య చేసిన నలుగురిలో నాలుగో నిందితుడు(ఏ-4)గా ఉన్న షేక్ దస్తగిరిని సాక్షిగా గుర్తిస్తున్నట్లు నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ప్రకటించింది. ఈ మేరకు తనను నిందితుడిగా కాకుండా సాక్షిగా గుర్తించాలని విజ్ఞప్తి చేస్తూ దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ను సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి రఘురాం అనుమతించారు. అభియోగాలు నమోదు చేసే వరకు దస్తగిరిని నిందితుడిగా కాకుండా సాక్షిగానే గుర్తిస్తామని స్పష్టం చేశారు. వివేకా హత్య కేసు హైదరాబాద్‌కు బదిలీ కాకముందే దస్తగిరిని కడప కోర్టు అప్రూవర్‌గా గుర్తించింది. దస్తగిరి అప్రూవర్‌గా మారినప్పటి నుంచే ఈ కేసు కీలక మలుపులు తిరిగింది. తాజాగా దస్తగిరిని సీబీఐ కోర్టు సాక్షిగా గుర్తించడం అవినాశ్‌రెడ్డి, ఇతర నిందితులకు శరాఘాతంగా మారింది. ఈ కేసులో గూగుల్ టేకౌట్, కాల్ డేటా, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ కంటే దస్తగిరి సాక్ష్యం అత్యంత కీలకంగా మారింది. నిందితులు సైతం దస్తగిరి సాక్ష్యం తప్ప మరే ఇతర ఆధారాలు లేవని పదేపదే ఆరోపిస్తున్న తరుణంలో వారికి ఇది భారీ ఎదురు దెబ్బగా పరిణమించింది.

వసతి గృహంలో అత్యాచార ఘటనను

ఎందుకు గోప్యంగా ఉంచారు?

ఇన్నాళ్లుగా మీకు తెలియదా? ఘటన జరిగిన 18 రోజులకు వస్తారా?

- అంధ విద్యార్థినుల ప్రశ్నలకు ప్రభుత్వ అధికారిణి ఉక్కిరిబిక్కిరి
- సీతక్క సీరియస్.. ఇన్‌చార్జి వార్డెన్ సస్పెన్షన్.. విచారణకు త్రిసభ్య కమిటీ
- ఆలస్యంగా కేసు నమోదేమిటి? నివేదికవ్వండి.. సిటీ కమిషర్ ఆదేశం
- సమస్యలకు నిలయంగా మలక్‌పేటలోని ప్రభుత్వ అంధ బాలికల హాస్టల్

సైదాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం జరిగిన 18 రోజుల తర్వాత హాస్టల్‌కు వస్తారా? ఘటన గురించి ఇన్ని రోజులుగా మీకు తెలియదా? ఎందుకు నిర్లక్ష్యం వహించారు? అంటూ వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజను మలక్‌పేటలోని ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహానికి చెందిన ఓ బాలిక నిలదీసింది. వసతి గృహంలో ఎనిమిదేళ్ల అంధ బాలికపై అక్కడ బాత్రూంలు శుభ్రపరిచే యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో అత్యాచార ఘటనపై వివరాలు తెలుసుకునేందుకు వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, ఏడీ రాజేందర్ గురువారం వసతి గృహాన్ని సందర్శించారు. వారిని అక్కడి అంధ విద్యార్థులు చుట్టుముట్టారు. ఘటనను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొస్తేనే మీరు ఇక్కడికి వచ్చారంటూ శైలజను ఓ బాలిక నిలదీసింది. ఈ నెల 7న ఘటన జరిగితే 24వ తేదీ వరకు ఎందుకు గోప్యంగా ఉంచాల్సి వచ్చింది?అని విద్యార్థులు ఆమెను ప్రశ్నించారు. అత్యాచార ఘటనపై విచారణ చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ చెప్పారు. అత్యాచార ఘటనలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఈ హాస్టల్లో ఆరు సీసీ కెమెరాలు ఉన్నా పనిచేయడం లేదు. ఫలితంగా పర్యవేక్షణ లేదనే ధీమాతోనే బాలికపై స్కావెంజర్ అత్యాచారానికి పాల్పడినట్లుగా చెబుతున్నారు. ఘటనపై మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. ఆమె ఆదేశాలతో హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ స్వప్నను అధికారులు సస్పెండ్ చేశారు. ఘటనపై విచారణకు వికలాంగులశాఖ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, బీసీ సంక్షేమ శాఖ అధికారితో త్రిసభ్య కమిటీని వేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. మరోవైపు.. అత్యాచార ఘటనలో పోలీసులు నిర్లక్ష్యం వహించారంటూ వచ్చిన వార్తలపై సిటీ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆరా తీశారు. ఈ నెల 7న ఘటన జరిగితే.. ఆలస్యంగా 16న కేసు ఎందుకు నమోదు చేశారని, దీనిపై నివేదిక సమర్పించాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాష్‌ను ఆదేశించారు.



పూర్తి శిథిలావస్థలో మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహం

ఎప్పుడు కూలిపోతుందో?

మలక్‌పేటలోని ఇదే హాస్టల్లో 2010లో తొమ్మిదో తరగతి విద్యార్థినిపై అత్యాచారం జరిగింది. ఘటన గురించి తెలిసినా ఇప్పటి మాదిరిగానే అప్పుడూ ప్రిన్సిపల్, హాస్టల్ మ్యాట్రిన్, వాచ్‌మన్ పోలీసులకు సమాచారమివ్వలేదు. ఇప్పటి మాదిరిగానే అప్పుడూ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో వారిని అప్పటి కలెక్టర్ నవీన్ మిట్టల్ సస్పెండ్ చేశారు. వారిపైన క్రిమినల్ కేసులూ నమోదయ్యాయి. ఇక.. ఈ హాస్టల్ భవనం విద్యార్థినులకు ఏమాత్రం సురక్షితంగా లేదు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో అక్కడ ఉన్న 62 మంది బాలికల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భవనం స్లాబు, గోడలకు పగుళ్లొచ్చాయి. తలుపులు, కిటికీలు పూర్తిగా పాడైపోయాయి. బాలికలకు సరైన భోజనం పెట్టడం లేదని, తాగునీటి వసతీ లేదని, మరుగుదొడ్ల నిర్వహణ కూడా సరిగా లేదన్న ఆరోపణలున్నాయి. సిబ్బందీ అరకొరగానే ఉన్నారు. ఇన్‌చార్జి వార్డెన్‌సహా కేవలం ఆరుగురు (వంట మనిషి, ఆయా, వాచ్‌మన్, స్కావెంజర్, స్వీపర్)సిబ్బందే ఉన్నారు. కుక్ రానిరోజు ఆయా వంట చేస్తున్నారు. సిబ్బంది సాయంత్రం ఇళ్లకు వెళుతుండటంతో రాత్రివేళలో పిల్లలకు ఏదైనా సమస్య వస్తే పట్టించుకునేవారే లేరు. నిబంధనల ప్రకారం హాస్టల్లోనే నెలకోసారి పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నా.. వైద్య శిబిరాలే నిర్వహించడం లేదు.

స్మితా సబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- నమో దివ్యాంగ్ క్యాంపెయినింగ్ భారత్

న్యూఢిల్లీ, జూలై 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసినందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని నమో దివ్యాంగ్ క్యాంపెయినింగ్ భారత్, డిసేబుల్డ్ హెల్ప్‌లైన్ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వికాస్‌శర్మ డిమాండ్ చేశారు. ఆమె చేసిన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలకు దివ్యాంగుల తరపున కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం తెలంగాణభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్మిత ట్వీట్లు దివ్యాంగుల పట్ల ఆమె చులకనభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న స్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమా? లేదా ప్రభుత్వ అభిప్రాయమా? అని ఆయన ప్రశ్నించారు.

బాధ్యతా రాహిత్యంగా స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు

- మంత్రి కొండా సురేఖ

వరంగల్‌సిటీ, జూలై25: సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు హుందాగా వ్యవహరించాలని, ప్రభుత్వ వ్యవస్థల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. వికలాంగుల కోటాపై స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలపై గురువారం ఒక ప్రకటనలో ఆమె స్పందించారు. స్మిత వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. ఉన్నతమైన స్థానంలో ఉండి పర్యవసనాలను ఆలోచించకుండా మాట్లాడడం తగదని, సమాజానికి ఎలాంటి సందేశం వెళ్తుందో దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. శారీరక సామర్థ్యం కంటే మానసిక సామర్థ్యం ముఖ్యమని అన్నారు.

ఊరగాయ ఇవ్వని హోటల్‌కు
రూ.35,000 జరిమానా!

చెన్నై, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భోజనం పార్శిల్‌తో పాటు ఊరగాయ ఇవ్వని ఓ హోటల్‌కు వినియోగదారుల ఫోరం రూ.35 వేల జరిమానా విధించింది. తమిళనాడు రాష్ట్రం విల్లుపురానికి చెందిన ఆరోగ్యస్వామి అనే వ్యక్తి ఓ ఆశ్రమానికి అందించేందుకు విల్లుపురంలోని ఓ ప్రముఖ హోటల్‌లో 25 భోజనాలు కొనుగోలు చేశారు. అయితే హోటల్ సిబ్బంది భోజన పార్శిల్‌తో పాటు ఊరగాయ ఇవ్వలేదు. ఈ విషయాన్ని ఆరోగ్యస్వామి యజమాని దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ కూడా నిర్లక్ష్య సమాధానమే వచ్చింది. దీంతో, ఆరోగ్యస్వామి విల్లుపురం వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఫోరం.. హోటల్ యాజమాన్యం ఆరోగ్యస్వామికి రూ.35 వేలు నష్టపరిహారం చెల్లించాలని గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

ఈ ఏడాదీ జనగణన లేనట్టే!

» బడ్జెట్‌లో పరిమితంగానే కేటాయింపులు

న్యూఢిల్లీ, జూలై 25: దేశంలో జనాభా లెక్కల ప్రక్రియ ఈ ఏడాది కూడా చేపట్టే అవకాశాలు కనిపించడం లేదు. జనగణన కోసం తాజా బడ్జెట్‌లో కేటాయింపులను కేంద్రం రూ.1,250 కోట్లకే పరిమితం చేసింది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు 17% తక్కువ. 2021-22లో కేటాయించిన దానిలో మూడింట ఒక వంతు మాత్రమే ఇవ్వడంతో ఈ ఏడాది జాతీయ జనాభా నమోదును చేపట్టే ఉద్దేశం కేంద్రానికి లేదని తేలిపోయింది. 2020 నుంచి ఈ విభాగానికి కేటాయింపులు క్రమంగా తగ్గుతున్నాయి. మరోవైపు కేటాయించిన దానిలోనూ ఏటా కొద్ది మొత్తాన్ని మాత్రమే ఖర్చు చేస్తున్నారు.

ఇకపై పకడ్బందీగా యూపీఎస్సీ పరీక్షలు

» ఆధార్ ధ్రువీకరణ, అభ్యర్థుల ఫేషియల్ రికగ్నిషన్

న్యూఢిల్లీ, జూలై 25: వివాదాస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేడ్కర్ కేసు నేపథ్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) అప్రమత్తమైంది. అవకతవకలను నివారించి, పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించడానికి అత్యాధునిక డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ఆధార్ ఆధారిత వేలిముద్రల ధ్రువీకరణ, అభ్యర్థుల ఫేషియల్ రికగ్నిషన్, ఈ-అడ్మిట్ కార్డులపై క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో పాటు దేశవ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో నియమించిన సిబ్బంది పనితీరును, అభ్యర్థుల కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ప్రత్యక్ష ఏఐ ఆధారిత సీసీటీవీ నిఘా కోసం ప్రభుత్వ రంగ సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించింది. ఈ కాంట్రాక్టు కాలపరిమితి మూడేళ్లు ఉంటుందని, దీన్ని మరో ఏడాదిపాటు పొడిగించే అవకాశం యూపీఎస్సీ ఉందని తెలిపింది.

దర్బార్ హాలు కాదు.. గణతంత్ర మండపం

» అశోక్ మండపంగా మారిన అశోక్ హాలు.. పేర్లు మార్పు

న్యూఢిల్లీ, జూలై 25: రాష్ట్రపతి భవన్‌లో వివిధ కీలక వేదికల పేర్లను మార్చారు. ప్రఖ్యాత 'దర్బార్ హాలు' పేరును గణతంత్ర మండపంగా, 'అశోక్ హాలు' పేరు అశోక్ మండపంగా గురువారం నామకరణం చేశారు. నిరుడు సుప్రసిద్ధ మొగల్ గార్డెన్స్‌ను 'అమృత్ ఉద్యాన్'గా మార్చిన సంగతి తెలిసిందే. కాగా, పేర్ల మార్పును కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ ఆక్షేపించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. వాళ్లకు 'దర్బార్' భావన లేదని.. 'నియంత' భావన మాత్రమే ఉందని వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీ మళ్లీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూలై 25: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి పొడిగించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ కస్టడీని ఈనెల 31 వరకు పొడిగించగా.. సీబీఐ దాఖలు చేసిన అవినీతి కేసులో ఆగస్టు 8వ తేదీ వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి కావేరి బవేజా గురువారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే సిసోడియా, కవితతో పాటు ఇతర నిందితుల జ్యుడీషియల్ కస్టడీని కూడా ఈ నెల 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తిహాడ్ జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిందితులను కోర్టు ముందు హాజరుపరిచారు.

ఖనిజ సంపదపై రాష్ట్రాలు
పన్ను విధించవచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యులతో కూడిన ధర్మాసనం 200 పేజీల మెజారిటీ (8:1) తీర్పును వెలువరించింది. జస్టిస్ బీవీ నాగరత్న విడిగా తీర్పునిస్తూ.. గనులు, ఖనిజాలున్న భూములపై పన్ను విధించే అధికారం రాష్ట్రాలకు లేదని, ఆ అధికారం పార్లమెంటుదేనని పేర్కొన్నారు. రాయల్టీ పన్ను వంటిదేనన్నారు. కాగా, మిగిలిన 8 మంది న్యాయమూర్తుల తరఫున సీజేఐ తీర్పును చదవి వినిపించారు. ఈ మెజారిటీ తీర్పు ప్రకారం.. రాజ్యాంగంలోని రెండో జాబితాలో ఉన్న ఎంట్రీ 49 (ఆర్టికల్ 246) మేరకు భూములు, భవనాలు, గనులు, క్వారీలపై రాష్ట్ర శాసనసభ పన్ను విధించవచ్చు. ఉత్పత్తి అయ్యే ఖనిజాల పరిమాణం ఆధారంగా పన్ను నిర్ణయించవచ్చు. రాజ్యాంగంలోని తొలి జాబితాలో ఉన్న ఎంట్రీ 54 పరిధిలోని ఖనిజాల హక్కులపై పన్ను విధించే చట్టబద్ధ అధికారం పార్లమెంటుకు లేదు. ఖనిజాలపై ఆయా సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించే రాయల్టీ.. పన్ను కాదు. అయితే, ఖనిజాల హక్కులకు సంబంధించి పన్నులు విధించే రాష్ట్రాల మీద పార్లమెంటు ఏవైనా పరిమితుల్ని నిర్దేశించవచ్చు. రాజ్యాంగంలోని రెండో జాబితాలో ఉన్న ఎంట్రీ 50 ప్రకారం, ఆ పరిమితులు.. ఆంక్షలు, షరతులు, నిబంధనలు, మొత్తంగా నిషేధం కూడా కావచ్చు. దేశంలో ఖనిజాభివృద్ధికి సంబంధించి పార్లమెంటు చేసే చట్టాలకు లోబడే ఏవైనా పన్నులు విధించాలని ఎంట్రీ 50 చెబుతోంది.

ఆ తీర్పు సరైనది కాదు

రాయల్టీని పన్నుగా పేర్కొంటూ 1989లో ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు సరైనది కాదని మెజారిటీ తీర్పు పేర్కొంది. మైనింగ్ లీజు తీసుకున్న సంస్థ కాంట్రాక్టు ప్రకారం చెల్లించే రాయల్టీ.. పన్ను వంటిది కాదని తెలిపింది. కాబట్టి, 1989లో ఇండియన్ సిమెంట్స్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేస్తున్నామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే సీజేఐ తమ తీర్పులో.. గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టాన్ని (ఎంఎండీఆర్‌ఏ) ప్రస్తావించారు. ఖనిజాలు, ఖనిజ అభివృద్ధిపై పన్ను విధించకుండా ఈ చట్టంలో ఎటువంటి ఆంక్షలు లేవని గుర్తు చేశారు. అలాగే, ఈ చట్టం ప్రకారం రాయల్టీ.. పన్ను కాదని తెలిపారు. గనులు, ఖనిజాలు, ఖనిజాలతో కూడిన భూములపై పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం రాష్ట్రాలకు ఉందని పేర్కొన్నారు. ధర్మాసనంలో జస్టిస్ చంద్రచూడ్‌తోపాటు జస్టిస్‌లు రిషికేశ్ రాయ్, అభయ్ ఓకా, జేబీ పార్థివాలా, మనోజ్ మిశ్రా, ఉజ్వల్ భుయాన్, సతీశ్‌చంద్ర శర్మ, అగస్టీన్ జార్జ్ మాసి, నాగరత్న ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి ఈ వివాదాస్పద అంశంపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది.



పాత బకాయిలు ఇప్పించండి

తీర్పు తమకు అనుకూలంగా వచ్చిన సందర్భంగా.. గనులు, ఖనిజాలపై పన్ను రూపంలో కేంద్రం ఇప్పటి వరకూ వసూలు చేసిన వేలాది కోట్ల రూపాయలను తమకు తిరిగి చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టును తాజాగా కోరాయి. అయితే, కేంద్రం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా రాష్ట్రాల వాదనను తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిపై రాష్ట్రాలు, కేంద్రం లిఖితపూర్వకంగా వాదనలు సమర్పించాలని, జూలై 31న తాము తీర్పు చెబుతామని సుప్రీంకోర్టు పేర్కొంది.

నేపథ్యం ఇదీ..

ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడులో గతంలో ఓ మైనింగ్ లీజు పొందిన ఇండియా సిమెంట్స్ కంపెనీ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ చెల్లిస్తూ వచ్చింది. అయితే, రాయల్టీతోపాటు సెస్ కూడా చెల్లించాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశించటంతో ఇండియా సిమెంట్స్ కంపెనీ మద్రాస్ హైకోర్టులో ఆ ఆదేశాల్ని సవాల్ చేసింది. రాయల్టీపై సెస్సు అనేది పన్ను వంటిదేనని, ఈ విధంగా పన్ను విధించటం రాష్ట్ర పరిధిలో లేని అంశమని కోర్టులో వాదించింది. సెస్సు అనేది ల్యాండ్ రెవెన్యూలో భాగమని, దానిని విధించే అధికారం తమకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరటంతో 1989లో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. ఇండియా సిమెంట్స్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఎంఎండీఆర్‌ఏ ప్రకారం రాష్ట్రాలు మైనింగ్ మీద రాయల్టీ తీసుకోవచ్చుగానీ, అదనంగా పన్ను విధించలేవని, ఆ అధికారం కేంద్రానికి మాత్రమే ఉందని పేర్కొంది. రాయల్టీని కూడా పన్నుగా పరిగణించవచ్చని తెలిపింది. అయితే, 2004లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, కేశోరామ్ ఇండస్ట్రీస్ కేసులో ఐదుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం.. 1989 నాటి తీర్పులో ఒక టైపింగ్ పొరపాటు దొర్లిందని పేర్కొంది. రాయల్టీ కూడా ట్యాక్సే అనే వాక్యాన్ని రాయల్టీపై విధించే సెస్సు కూడా ట్యాక్సే అని చదువుకోవాలని తెలిపింది. రాయల్టీ పన్ను కాదని స్పష్టం చేసింది. ఇండియా సిమెంట్స్ కేసులో ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు చెప్పినందున, ఈ అంశాన్ని తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనానికి సిఫార్సు చేశారు. ఎనిమిది రోజులపాటు విచారణ జరిగింది. మైనింగ్, ఖనిజాల మీద పన్ను విధించే అధికారం తమకు ఉందని రాష్ట్రాలు వాదించగా, కేంద్రం, మైనింగ్ కంపెనీలు, ప్రభుత్వరంగ సంస్థలు ఖనిజాలు, గనుల మీద పన్ను విధించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని, రాష్ట్రాలకు లేదని వాదించాయి.

వర్ష బీభత్సం

మహారాష్ట్ర, గుజరాత్, హిమాచల్ రాష్ట్రాలలో కుండపోత



గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న స్థానికులు

ముంబై, పుణె, జూలై 25: ఎడతెరిపి లేని వర్షాలు మహారాష్ట్రను వణికిస్తున్నాయి. రాజధాని ముంబై, ఐటీ సంస్థల కేంద్రం పుణెతో పాటు రాయ్‌గఢ్, పాల్ఘర్ జిల్లాల్లో వరుణుడు విజృంభిస్తున్నాడు. ముంబైలో రోడ్లపై భారీగా నీరు నిలిచిపోయింది. ట్రాఫిక్ జామ్‌లతో పాటు రైల్ సర్వీసులు ఆలస్యం అయ్యాయి. రాగల 24 గంటల్లోనూ అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. సాయన్, చెంబూర్, అంధేరీల్లో వరద ప్రభావం అధికంగా ఉంది. శుక్రవారం ఉదయం వరకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ సంస్థలు విమాన సర్వీసులను రద్దు చేశాయి. పుణెతో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. పుణెలో దక్కన్ జింఖానా వద్ద వీధి వ్యాపారులు ముగ్గురు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరొకరు వర్షాలకు మృతిచెందారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఇక్కడివారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ నగరానికి రెడ్ అలర్ట్ జారీ చేశారు. థానె, పాల్ఘర్ జిల్లాల్లోనూ భారీగా వర్షాలు కురుస్తున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన మనాలీలో క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి కురిసింది. అంజనీ మహదేవ్ కాల్వ పోటెత్తింది. ఈ కాల్వలోని రాళ్లు.. మనాలీ-లేహ్ జాతీయ రహదారిపై ఉన్న వంతెనపైకి వచ్చాయి. గుజరాత్‌లోని కశ్మీర్ నగర్‌లో ఔరంగా నది ఉప్పొంగడం తో తక్షణమే 150 కుటుంబాలను ఖాళీ చేయించారు. యూపీలోని మొరాదాబాద్‌ను భారీ వర్షాలు కుదిపేశాయి.

కర్ణాటకలో 'నీట్' రద్దు!

» రాష్ట్ర శాసనసభ, మండలి తీర్మానం

» మరో మూడు కీలక బిల్లులకూ ఆమోదం

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశానికై దేశవ్యాప్తంగా నిర్వహించే అర్హతా పరీక్షలు 'నీట్'ను కర్ణాటకలో రద్దు చేసేందుకు శాసనసభ ఉభయసభలు తీర్మానించాయి. వైద్య విద్యాశాఖ మంత్రి శరణుప్రకాష్ పాటిల్ గురువారం శాసనసభలో తొలుత ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'నీట్' విధానంతో రాష్ట్ర పరిధిలోని గ్రామీణ విద్యార్థులకు వైద్య విద్యకు అవకాశాలు లభించడం లేదన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల హక్కులను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'నీట్' పరీక్షా వ్యవస్థ కాలరాస్తోందని ఆరోపించారు. శాసనసభలో ఆమోదించిన 'నీట్' రద్దు బిల్లును శాసనమండలిలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రవేశపెట్టగా సభ్యుల ఆమోదంతో ఆమోదించారు.

ఒక దేశం.. ఒకే ఎన్నికకు వ్యతిరేక బిల్లు

ఒక దేశం ఒకే ఎన్నిక జరపాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా శాసనసభలో బిల్లును ఆమోదించారు. బీజేపీ, జేడీఎస్ సభ్యులు వ్యతిరేకిస్తున్నా అధికార కాంగ్రెస్ సభ్యులు సభలో అంగీకారం తెలిపారు. శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ మరో బిల్లుకు అంగీకారం తెలిపారు. 2026 లేదా ఆ తర్వాత జరిగే జనాభా లెక్కలకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన సరికాదని, 1971 జనాభా ఆధారంగా పునర్విభజన చేయాలని ఆ బిల్లు ద్వారా కోరారు. ఆదివాసీలకు అటవీ సంరక్షణ చట్టం నుంచి మినహాయింపు ఇవ్వాలనే బిల్లుకు కూడా ఆమోదం తెలిపారు. ఈ బిల్లులకు శాసన మండలిలోనూ ఆమోదముద్ర వేశారు.

14 గంటల డ్యూటీపై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల నిరసన

బెంగళూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఐటీ కంపెనీల్లో ఉద్యోగులకు పని సమయం 14 గంటలకు పెంచాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై టెకీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా సోషల్ మీడియా వేదికగా వారు నిరసన తెలుపుతున్నారు. రెండురోజులుగా ప్రాంతాల వారీగా రోడ్డెక్కి నిరసనలకు దిగుతున్నారు. మడివాళ, బీటీఎం లే అవుట్ ప్రాంతాల్లో టెకీలు బుధవారం రాత్రి పొద్దుపోయాక రోడ్లపైకి చేరి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ కార్మిక సంస్థ చట్టాలను ఉల్లంఘించే చర్యలు తీవ్రమవుతున్నాయని, ఇప్పటికే ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలంటే మానవవనరులపై దాడిలా మారిపోయాయని మండిపడ్డారు. ఏకంగా 14 గంటల పాటు పనిచేయడమనే నిబంధన ఉద్యోగిని మానసికంగా, శారీరకంగా దెబ్బతీయడమే అని అన్నారు. ఎలక్ట్రానిక్ సిటీకి సమీపాన ఉండే ప్రాంతంలో జరిగిన ఆందోళన కావడంతో పెద్దఎత్తున టెకీలు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో నిరసన సాగించారు. టెకీలు మెయిల్ ద్వారా నిరసన అస్త్రాన్ని ప్రయోగించదలచారు. కార్మికశాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రి, డీసీఎంలకు మెయిల్ ద్వారా నిరసన తెలుపదలచినట్లు వెల్లడించారు.

ఆర్నెల్లకో ఇంజెక్షన్‌తో..
గుండెపోటుకు చెక్

చెడ్డ కొలెస్ట్రాల్ తయారీని జన్యుస్థాయిలో అడ్డుకునే అద్భుత ఔషధం.. ఇన్‌క్లిసిరాన్

ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మన శరీరంలో చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్), మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) రెండూ ఉంటాయి. చెడ్డ కొలెస్ట్రాల్ పెరిగిపోతే రక్తనాళాలు పూడుకుపోయి గుండెపోటు బారిన పడే ప్రమాదం ఉంటుంది. శరీరానికి హాని చేసే ఈ ఎల్‌డీఎల్‌ను తగ్గించడానికి రకరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అయితే.. ఆ సంప్రదాయ మందులకు భిన్నంగా జన్యుస్థాయిలోనే ప్రభావం చూపి ఎల్‌డీఎల్ తయారీకే అడ్డుకట్ట వేసే ఒక ఇంజెక్షన్ ఇప్పుడు హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చింది. కాకపోతే ఖరీదు కాస్తంత ఎక్కువే. దాదాపు లక్ష రూపాయల విలువైన ఈ ఇంజెక్షన్‌ను ఆర్నెల్లకొకసారి చేయించుకుంటే.. గుండెపోటు రాకుండా సాఫీగా జీవించవచ్చని అపోలో ఆస్పత్రికి చెందిన సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్ వివరించారు. గుండెపోటు వచ్చిన తర్వాత శస్త్రచికిత్స చేయించుకునే కంటే.. చెడ్డ కొలెస్ట్రాల్ బాధితులు ముందు జాగ్రత్త చర్యగా ఈ ఇంజెక్షన్ తీసుకుంటే ఇబ్బందులు లేకుండా జీవించవచ్చునని ఆయన తెలిపారు. గతంలో ధమనులు పూర్తిగా బ్లాక్ అయినప్పుడు తప్పనిసరిగా శస్త్రచికిత్స చేసేవారని.. కానీ, ఇప్పుడు బ్లాక్ అయిన ధమనులను క్లియర్ చేయడానికి ప్రత్యేక పద్ధతులు ఉన్నాయని.. అలాంటి ఒక ప్రత్యేక పద్ధతే ఈ ఇంజెక్షన్ అని డాక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. ఇతర దేశాల్లోనూ దీన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ ఇంజెక్షన్‌ను స్టెంట్ వేయించుకున్న వారు, బైపాస్ సర్జరీ చేయించుకున్నవారూ తీసుకోవచ్చని చెప్పారు. అయితే.. ఈ ఇంజెక్షన్ ఎల్‌డీఎల్ అధికంగా ఉన్న వారిలో బాగా పనిచేస్తుందిగానీ, ట్రైగ్లిజరైడ్స్ అధికంగా ఉన్న వారికి ఉపయోగపడదన్నారు. అపోలో ఆస్పత్రిలో మూడు నెలల నుంచి ఈ ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరగనున్న ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ సదస్సులో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైద్యులకు దీనిపై 30% మేరకు రాయితీ ఇవ్వనున్నట్టు డాక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ ఇంజెక్షన్ వినియోగం పెరిగితే.. భవిష్యత్తులో ధర తగ్గే అవకాశముందన్నారు. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్న వారు ఏ వయసులోనైనా ఈ ఇంజెక్షన్ చేయించుకోవచ్చని చెప్పారు. అయితే.. 'ఇంజెక్షన్ తీసుకున్నాం కదా' అని నిర్లక్ష్యంగా ఉండడం మంచిదికాదని.. ఏది పడితే అది తినడం, కదలకుండా ఎక్కువ సేపు కూర్చోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి జీవనశైలితో గుండెకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.



ఇలా పనిచేస్తుంది..

మన శరీరంలో ఉండే 'ఎల్‌డీఎల్ రిసెప్టర్ల'ను నాశనం చేసే ప్రొటీన్‌ను నియంత్రించే ఒక కీలకమైన జన్యువు.. పీసీఎస్‌కే9 (ప్రొప్రొటీన్ కన్వర్టేజ్ సటిలిసిన్/కెక్సిన్ టైప్ 9). ఎల్‌డీఎల్ రిసెప్టర్లు రక్తంలో ఉండి.. చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) రేణువులకు అతుక్కుని.. ఆ రేణువులను కాలేయంలోకి తీసుకెళ్తాయి. అక్కడ కాలేయం ఎల్‌డీఎల్‌ను బ్రేక్‌డౌన్ చేసి అధికంగా ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. కానీ, పీసీఎస్‌కే9 ప్రొటీన్ ఆ రిసెప్టర్లను నాశనం చేయడం వల్ల ఎల్‌డీఎల్ రక్తనాళాల్లో పెద్దఎత్తున పేరుకుపోయి గుండెపోటుకు కారణమవుతుంది. దీంతో పీసీఎస్‌కే9ను పనిచేయకుండా చేసే (ఇన్హిబిటర్) ఔషధాలపై శాస్త్రజ్ఞులు చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికే అలాంటి కొన్ని ఇన్హిబిటర్లు పాశ్చాత్యదేశాల్లో అందుబాటులోకి వచ్చాయి. ఇన్‌క్లిసిరాన్ కూడా ఆ కోవలోనిదే. ఇది పీసీఎస్‌కే9 జీన్‌ను స్విచాఫ్ చేసేస్తుంది. దానివల్ల పీసీఎస్‌కే9 ప్రొటీన్ అసలు తయారే కాదు. ఆ ప్రొటీన్ లేకపోవడం వల్ల.. ఎల్‌డీఎల్ రిసెప్టర్లు స్వేచ్ఛగా పనిచేయగలుగుతాయి. ఫలితంగా శరీరంలో ఎల్‌డీఎల్ స్థాయిలు తగ్గిపోతాయి. గుండెపోటు ముప్పు తగ్గుతుంది.

ఫ్లై ఓవర్ ఎక్కండి!

గూగుల్ మ్యాప్స్‌లో కొత్త ఫీచర్లు అందుబాటులోకి..

» దేశంలోని 40 ప్రముఖ నగరాల్లో ఫ్లై ఓవర్ అలర్ట్

» ఫ్లై ఓవర్ ఎక్కాలా? వద్దా? అనే సందేహానికి చెక్

» ఈవీ చార్జింగ్ స్టేషన్ల వివరాలూ ఇక ఆ యాప్‌లో!

» ఇరుకు రోడ్ల గురించి ముందే హెచ్చరించే వ్యవస్థ

» చెన్నై, కొచ్చి నగరాల్లో మెట్రో బుకింగ్‌లకూ చాన్స్

న్యూఢిల్లీ, జూలై 25: గూగుల్ మ్యాప్స్ పెట్టుకొని ఎక్కడికో బయల్దేరాం! దారిలో ఒక ఫ్లై ఓవర్ కనిపిస్తుంది. గూగుల్ మ్యాప్స్ ఏమో.. నేరుగా వెళ్లాలని చెబుతుంది. నేరుగా అంటే.. ఫ్లై ఓవర్ ఎక్కాలా? లేక ఫ్లై ఓవర్ పక్కగా కింద నుంచి వెళ్లాలా? అర్థం కాదు. చాలా మందికి ఎదురవుతున్న ఈ సమస్యను పరిష్కరిస్తూ గూగుల్ మ్యాప్స్ భారత్‌లో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతోపాటు.. ఇరుగ్గా ఉండే రోడ్లను గురించి ముందే హెచ్చరించే ఫీచర్‌ని, ద్విచక్ర విద్యుత్తు వాహనాల చార్జింగ్ స్టేషన్లు ఎక్కడున్నాయో చెప్పే ఫీచర్, మెట్రో టికెటింగ్.. ఇలా మొత్తం ఆరు కొత్త ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓలా మ్యాప్స్ నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునేందుకే గూగుల్ ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఫ్లైఓవర్ అలర్ట్ సమాచారం ప్రస్తుతానికి మనదేశంలోని 40 నగరాల్లో, ఆండ్రాయిడ్ వినియోగదారులకు కనిపిస్తుంది. ఐఫోన్ వినియోగదారులకు, మిగతా నగరాల్లో త్వరలో అందుబాటులోకి రానుంది. ఇక.. దేశంలో విద్యుత్తు వాహనాలు.. ముఖ్యంగా ఎలక్ట్రిక్ స్కూటర్ల వినియోగం బాగా పెరిగిన నేపథ్యంలో గూగుల్ సంస్థ ప్రముఖ ఈవీ చార్జింగ్ ప్రొవైడర్లతో ఒప్పందం కుదుర్చుకుంది. ఫలితంగా.. దేశవ్యాప్తంగా ఉన్న 8000కు పైగా ఈవీ చార్జింగ్ స్టేషన్ల వివరాలు గూగుల్ మ్యాప్స్‌లో కనిపిస్తాయి. ఆయా స్టేషన్లలో ఏ తరహా చార్జర్లు ఉన్నాయనే విషయాన్ని కూడా గూగుల్ మ్యాప్స్ ద్వారానే తెలుసుకోవచ్చు. ఇలా ఈవీ చార్జింగ్ స్టేషన్ల వివరాలు, ఫ్లై ఓవర్ అలర్ట్, ఇరుకు రోడ్లపై అప్రమత్తం చేసే పరిజ్ఞానం.. గూగుల్ మ్యాప్స్‌లో కనిపించే తొలి దేశం మనదే కావడం గమనార్హం. ఇక.. గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుని వెళ్తున్నప్పుడు ఉన్నట్టుండి చాలా ఇరుకైన రోడ్లు ప్రత్యక్షమవుతాయి. వెనక్కి, ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఇబ్బందిని తప్పించడానికి గూగుల్ సంస్థ ఏఐ సాయంతో అలాంటి ఇరుకు రోడ్ల గురించి ముందే హెచ్చరించే ఫీచర్‌ను ప్రవేశపెట్టింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, ఇండోర్, భోపాల్, భువనేశ్వర్ నగరాల్లో ఆండ్రాయిడ్ వినియోగదారులకు ఈ వారం నుంచే ఈ ఫీచర్ అందుబాటులోకి రానుంది. యాపిల్ ఫోన్ వాడేవారికి, మిగతా నగరాల వారికి కూడా త్వరలోనే దీన్ని అందుబాటులోకి తెస్తామని గూగుల్ పేర్కొంది. కొచ్చి, చెన్నై నగరాల్లో వినియోగదారులు మెట్రో రైలు టికెట్లు సైతం గూగుల్ మ్యాప్స్ నుంచే బుక్ చేసుకునేలా ఓఎన్‌డీసీ, నమ్మ యాత్రితో ఒప్పందాలు చేసుకుంది. అలాగే, మనం వెళ్లేదారిలో ఏదైనా ప్రమాదం జరిగినా, నిర్మాణ పనుల వల్ల ఆ దారి బ్లాక్ అయినా.. గూగుల్ మ్యాప్స్‌లో ఆ విషయాన్ని సులువుగా రిపోర్ట్ చేసే అవకాశాన్ని ఆండ్రాయిడ్, ఐఫోన్ వినియోగదారులందరికీ అందుబాటులోకి తెచ్చింది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.